తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:56, Issue: 03
August - 2025, Price Rs.20/-.

ఆగష్టు 2025
వెల రూ. 20/-
పుటలు - 56




శ్రీ వరలక్ష్మీ వ్రతం (08-08-2025)



# తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

(24-09-2025 నుండి 02-10-2025 వరకు)

| తేదీలు | వారం | పగలు ఉత్సవాలు | రాత్రి ఉత్సవాలు |
|---|---|---|---|
| 24-09-2025 | బుధవారం | ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 25-09-2025 | గురువారం | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 26-09-2025 | శుక్రవారం | సింహవాహనం | ముత్యపుపందిరి వాహనం |
| 27-09-2025 | శనివారం | కల్పవృక్ష వాహనం | సర్వభూపాల వాహనం |
| 28-09-2025 | ఆదివారం | పల్లకీలో మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం |
| 29-09-2025 | సోమవారం | హనుమద్వాహనం, సా॥ వసంతోత్సవం స్వర్ణరథరంగ డోలోత్సవం | గజవాహనం |
| 30-09-2025 | మంగళవారం | సూర్యప్రభ వాహనం | చంద్రప్రభ వాహనం |
| 01-10-2025 | బుధవారం | రథోత్సవం | అశ్వవాహనం |
| 02-10-2025 | గురువారం | చక్రస్నానం | ధ్వజావరోహణం |



# గీతాశ్లోకార్థసారం

శ్లో : స్వధర్మమపి చావేక్ష్య న వికమ్పితు మర్హసి ।
ధర్మ్యాద్ధి యుద్ధా చ్ఛ్రేయో౽ న్యత్ క్షత్రియస్య న విద్యతే ॥

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-31వ శ్లోకం)

ప్రతిపదార్థం: చ= మఱియు; స్వధర్మమ్= స్వకీయ (క్షత్రియ) ధర్మాన్ని; అవేక్ష్య అపి= చూచైనా; వికమ్పితుమ్= చలించుటకు; న అర్హసి= తగవు; క్షత్రియస్య= క్షత్రియునకు; ధర్మ్యాత్= ధర్మయుతమైన; యుద్ధాత్= యుద్ధంకంటె; అన్యత్= ఇతరమైన; శ్రేయః= మేలు; న విద్యతే హి= లేదుగదా!

భావం: ఓ అర్జునా! స్వకీయమైన క్షత్రియధర్మాన్ని విచారించుకున్నా యుద్ధానికి వెనుదీయడం నీకు సరియైంది కాదు. ఎందుకంటే, క్షత్రియునకు ధర్మయుద్ధంకంటే శ్రేయస్కరమైంది మరొకటి లేదు కదా!

---

## గోవిందుఁడ యింక మేలుకొనవయ్యా!

మిన్నక వేసాలుమాని మేలుకోవయ్యా
సన్నల నీయోగనిద్ర చాలు మేలుకోవయ్యా

ఆవులు పేయలకుఁగా నఱచీఁ బిదుకవలె
గోవిందుఁడ యింక మేలుకొనవయ్యా
ఆవలీవలిపడుచు లాటలు మరిగివచ్చి
త్రోవగాచుకున్నారు ప్రొద్దున మేలుకోవయ్యా

వాడల గోపికలెల్లా వచ్చి నిన్ను ముద్దాడఁ
గూడియున్నా రిదే మేలుకొనయ్యా
తోడనే యశోద గిన్నెతోఁ బెరుగు వంటకము
యీడకుఁ దెచ్చి పెట్టె నిఁక మేలుకోవయ్యా

పిలిచీ నందగోపుఁడు పేరుకొని యదె కన్నుఁ
గొలుకులు విచ్చి మేలుకొనవయ్యా
అలరిన శ్రీవేంకటాద్రిమీఁది బాలకృష్ణ
యిల మామాటలు వింటి విఁక మేలుకోవయ్యా

ఆధ్యాత్మసంకీర్తన సంపుటం 01- సంకీర్తన 374





ఊరికే వేషాలు వేయడం మాని మేలుకోవయ్యా కృష్ణా! నువ్వు నిజంగా నిద్రపోవడం లేదు. నిద్రిస్తున్నట్లు వేషం వేస్తున్నావు. నీ సైగలు ఈయోగనిద్ర ఇంక చాలు మేలుకోవయ్యా!

తెల్లవారింది. గోవులన్నీ వాటి దూడలకు పాలివ్వడానికి అరుస్తున్నాయి. పాలుపితకాలి మేలుకో, గోవిందుడా! మేలుకోవయ్యా! ఇరుగు పొరుగు కుఱ్ఱాళ్లు, నీతో ఆడుకోవడానికి అలవాటుపడ్డవాళ్లు త్రోవకాచి ఉన్నారు. ఎప్పుడు లేచి ఆడుకోవడానికి బయటకు వస్తావా అని ఎదురుచూస్తున్నారు.

రేపల్లెవాడలోని గోపిక లందరూ నిన్ను ముద్దాడడానికి కూడి ఉన్నారు, మేలుకోవయ్యా! కృష్ణా నువ్వు లేవగానే నీకు ఆకలి వేస్తుందని మీ అమ్మ యశోదాదేవి గిన్నెలో పెరుగు వంటకం (దధ్యోదనం) నీ మంచం దగ్గరకే తెచ్చిపెట్టిందయ్య ఇక మేలుకో!

ఇదుగో చూడు కృష్ణా నందగోపుడు మీ తండ్రి నిన్ను పేరుపెట్టి పిలుస్తున్నాడు. కనురెప్పలు విప్పి మేలుకోవయ్యా! శ్రీవేంకటాద్రి మీది ప్రకాశిస్తున్న ఓ బాలకృష్ణా! నువ్వు మా మాటలన్నీ విన్నావులే ఇక మేలుకోవయ్యా! అని అన్నమయ్య వేంకటాద్రి మీది బాలకృష్ణుని మేలుకొలుపుతున్నాడు.



వినాయకచవితి,
శ్రీకృష్ణాష్టమి,
రాఖీపూర్ణిమ
పర్వదినోత్సవాల
సందర్భంగా...
'సప్తగిరి' పాఠకులకు,
ఏజంట్లకు, రచయితలు,
రచయిత్రులకు
మా శుభాకాంక్షలు!





ఆరుభాషల్లో వెలువడుతూ
లక్షలాది ప్రతులు ముద్రితమౌతూ
వడివడిగా అడుగులు వేస్తున్న
**సప్తగిరి**

**సప్తగిరి**
తిరుమల శ్రీవారికి అక్షరహారతి
సనాతన ధార్మికసాహిత్య
పాఠకలోక హృదయనేత్రి

భక్తి, ఆధ్యాత్మికం, వేదాంతం,
పురాణం, నైతిక వికాసం
ఆలయవీక్షణానికి అక్షరగవాక్షం
**సప్తగిరి**

**సప్తగిరి**
ఈ పత్రిక మీదే!
చదవండి! చదివించండి!
చందాను కట్టించండి!!
మీ చందాను పొడిగించండి!!!
శ్రీవారి అక్షరార్చనలో భాగస్వాములు కండి...!!

స్వామివారిని 'సప్తగిరి' నేత్రాల ద్వారా
దర్శించండి! తరించండి!!
ప్రతిమాసం శ్రీవారి దర్శనం
'సప్తగిరి' పఠనం వల్లే సాధ్యం!
**సప్తగిరి**




తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 56 ఆగష్టు, 2025 సంచిక : 03


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| ఈ మూర్తిని తలచుకుని నమస్కరిస్తే చాలు... | బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ | 07 |
| చిన్ని చిన్ని కన్నయ్య..! | శ్రీమతి చెవుటూరి కుసుమకుమారి | 10 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 12 |
| వెలిగింపుమయ్యా జ్ఞానజ్యోతీ... | డా॥ కప్పగంతు రామకృష్ణ | 13 |
| చిన్నికృష్ణా! నిన్నుచేరికొలుతూ... | శ్రీమతి రమా శాండిల్య | 15 |
| దారితప్పిన భక్తుని చేరదీసిన దేవుడు | డా॥ ముక్తేవి భారతి | 16 |
| విశ్రాంతి కావాలి! | శ్రీమతి కె.ఎస్.వి.కె.స్రవంతి | 19 |
| దేశసేవే దేవతార్చన | శ్రీ రసరాజు | 20 |
| ఓనమాలు రావంటూనే... | డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ | 24 |
| తిరువరగుణమంగై (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| శ్రీసిద్ధివినాయక వ్రతకల్పం | | 27 |
| సత్యప్రమాణాల దేవుడు.. | శ్రీ గాజుల మంజునాథ | 35 |
| పిల్లలు బాగుంటే చాలు... | శ్రీమతి కె.యస్.యల్.కె. చైతన్యశ్రీ | 37 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 39 |
| సౌభాగ్యాన్నిచ్చే శ్రావణశోభ | శ్రీమతి పి.రమాదేవి | 40 |
| చెప్పడుమాటలు వినరాదు (వేమన శతకం) | కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు | 41 |
| మా కృష్ణయ్య పుట్టిన దినమూ.. కిలకిల నవ్వెను జగమూ.. | డా॥ ఆకెళ్ళ సూర్యకనకదుర్గ | 42 |
| ప్రకృతి ఒడిలో కొలువైన 'శ్రీకుక్కె సుబ్రహ్మణ్యం' | కుమారి ఆర్.జయశ్రీ కాశీకర్ | 44 |
| లవంగాల వైద్యం | శ్రీ ఆర్.సి.కృష్ణస్వామి రాజు | 45 |
| పురాణాలను గౌరవించాలి!! | శ్రీమతి నల్లాని రాజేశ్వరి | 46 |
| మొదటి నమస్కారం చేయకపోతే.. (చిత్రకథ) | కథ: 'కళారత్న' డా॥ కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు: శ్రీ తుంబలి శివాజీ | 48 |
| ఉండ్రాళ్లు - మోదకాలు | డా॥ జి.వి.పూర్ణచందు | 50 |
| క్విజ్ | | 51 |
| బాలవినోదం | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| శ్రీపదకేళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : రావమ్మా! శ్రావణలక్ష్మి
వెనుకచిత్రం: జయగణ వినాయక!

చిత్రసౌజన్యం
శ్రీ పంచకర్ల రమేష్

వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥


**గౌరవ సంపాదకులు**
శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-సంపాదకులు,**
**ప్రధాన సంపాదకులు** (ఎఫ్.ఏ.సి.)
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
'కళారత్న' డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., తెలుగు & ఇంగ్లీషు, ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకులు**
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఎడ్.,
ఉపకార్యనిర్వహణాధికారి, (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.


24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.

0877 2277777 / 2233333


ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

# ప్రకృతి పరిరక్షణే... పండుగ పరమార్థం

వినాయకచవితి అనేక సందేశాల్ని మానవాళికి పంచే పండుగ. ప్రకృతిపరంగా మనకు స్పష్టమైన సందేశాన్ని ఈ పండుగ ఇస్తుంది. కొన్ని పండుగలు భక్తిశ్రద్ధలతో ఇంటికి మాత్రమే పరిమితమై జరుపుకుంటారు. అయితే, సామాజికంగా అందరూ కలిసిచేసుకునే అతికొద్ది పండుగల్లో వినాయకచవితి అతిముఖ్యమైంది.


ప్రకృతిమాత అంటే పార్వతీదేవి కుమారుడు వినాయకుడు. ప్రకృతిమాత దివ్యశరీరానికి నలుగుపెట్టిన ఓషధులమయమైన నలుగుపిండితో ప్రాణంపోయించుకున్న దేవుడు వినాయకుడు. పంటల్ని చెరగడానికి చేటలు వాడతారు. ఆ చేటలంత చెవులు, బాగా పండితే పెద్దగా అని చెప్పటానికి గజపంట పండింది అంటారు. బాగా పంట పండినందుకు చిహ్నంగా వినాయకుడు గజతలను ధరించాడు. పండిన పంటల్ని పెద్దపెద్ద గాదెలలో దాచుకుంటారు. ఆ గాదెల వలే పెద్దశరీరం కలవాడు. ఏకదంతం నాగలికి చిహ్నంగా నిలిచింది. ఉండ్రాళ్ళు, కుడుములు, పంట వచ్చిన క్రొత్తలో భగవంతునికి నైవేద్యం పెడుతున్నాం. ధాన్యపు గాదెలకు చుట్టూ గడ్డితో పేలిన త్రాడును చుడతారు. ఈ లంబోదరుని ఉదరం చుట్టూ నాగపాశం బంధించి ఉంటుంది. గణేశ నిమజ్జనం చేసి అక్కడి మట్టిని కొద్దిగా తెచ్చుకుని ధాన్యపు గాదెల్లో, పంటపొలాల్లో, దుకాణాల్లో రైతులు వ్యాపారస్తులు,  చల్లుకుంటారు. వినాయకుడు పంటలకు, ప్రకృతికి ప్రతిరూపంగా ఆరాధించబడుతున్నాడు. వర్షాకాలం ప్రారంభమై చెట్లకు చిగురులు పట్టి పర్యావరణం ఆకుపచ్చచీర కట్టుకున్నట్లు ఉండేకాలంలో ఈ పండుగ వస్తుంది. వేసవికాలం మండుటెండకు బోసిపోయినట్లుండే చెట్లు చిగురులువేసి కొత్త లేతాకుపచ్చతో కళకళలాడుతుంటాయి.

వినాయకచవితి అటు వ్యవసాయరంగానికి, ఇటు ప్రకృతి పరిరక్షణకు ఉపయోగపడే విధంగా మన పూర్వీకులు తీర్చిదిద్దారు. తొలకరివర్షాలతో చెరువులు, కుంటల్లో నేల తడిగా మారుతుంది. ఆ మట్టిని గ్రామస్తులు తీసుకువచ్చి వినాయకుడి ప్రతిమలు చేసి పూజలు చేస్తారు. దీంతో మొత్తం గ్రామం తమ సమీపంలోని చెరువులు, కుంటల వద్దకు వెళ్లి ప్రతికుటుంబం ఎంతో కొంతమట్టి తవ్వి ఇంటికి తీసుకువెళ్లేవారు. ఇది కాకుండా ప్రతి ఊర్లో వీధుల్లో యువకులు భారీమొత్తంలో మట్టిని పోగుచేసి పెద్ద పెద్ద వినాయకవిగ్రహాలు ప్రతిష్ఠించేవారు. దీంతో చెరువుల్లో పూడికను ఎవరికి వారు తీసేసి నీరు నిల్వ ఉండడానికి ఆయా చెరువులకు జీవం పోసేవారు. వినాయకుడిని పత్రితో పూజిస్తారు కనుక వివిధరకాల చెట్ల నుంచి ఆకుల్ని కోసి ఇంటికి తెచ్చుకునేవారు. దీనివల్ల కొత్త ఆకులు మళ్లీ చిగురించి చెట్టుకు జీవకళ వచ్చేది. కాలం మారుతుండటం, లేత ఆకులు ఉండటంతో చీడపరుగులు ఆకులకు పట్టేవి. ఈ సమయంలో ఆకులను తెంపుకోవడం వల్ల చీడపురుగుల నుంచి చెట్లకు విముక్తి లభించేది. దీనివల్ల భాద్రపద, ఆశ్వయుజమాసాల్లో కురిసే వర్షాలకు చెట్లు మరింత ఏపుగా పెరిగి పర్యావరణాన్ని సమతుల్యం చేసే అవకాశం  కలుగుతుంది.

తొమ్మిదిరోజుల పాటు వినాయకుడి పూజలు ముగించి అందరూ కలిసి వినాయకప్రతిమల్ని సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేసేవారు. దీనివల్ల చెరువుల్లో మట్టి పునరుపయోగానికి అనువు అయ్యేది. చెరువుగట్లు పటిష్టంగా మారేందుకు అవకాశం కలిగేది. వినాయకుడిని పూజించిన పత్రి చెరువుల్లో వేయడం వల్ల ఆయా ఆకుల నుంచి వచ్చే రసాలు ప్రకృతిపరంగా నీటికి కొన్ని ఔషధగుణాల్ని కల్పించేవి. నీటిలో కరిగిన ఈ ఆకులపసరు, రసాలు నీటిని శుద్ధిచేయడంతో పాటు వ్యవసాయానికి ఉపయోగించే నీటికి కొత్తశక్తిని ఇస్తాయి. ఇవన్నీ ఒకప్పటి విషయాలు. ప్రస్తుతం అందుకు భిన్నమైన వాతావరణం వినాయకచవితి రోజున కన్పిస్తోంది. విగ్రహాలను ఎత్తుపెంచడం కోసం మట్టికి బదులు పర్యావరణానికి హాని కలిగించే కృత్రిమ మృత్తికను ఉపయోగిస్తున్నారు. ఇది మంచిదికాదు. అదేవిధంగా విగ్రహాలు ఆకర్షణీయంగా కన్పించేందుకు ప్రమాదకారులుగా ఉండే రంగులను వాడుతున్నారు. వీటి స్థానంలో సంప్రదాయ బద్ధమైన రంగులను ఉపయోగించేందుకు ప్రయత్నించాలి. పర్యావరణ పరిరక్షణదిశగా మన ఆలోచనలు ఉండాలి. ఇది అతిసున్నితమైన విషయం గనుక మనలోనే మార్పులు రావాలి. వినాయకుడు భక్తులనుంచి కోరుకునే పర్యావరణానికి చేరువుగా ఉంటూ భక్తిశ్రద్ధలతో పూజలు చేసి గణేశుని ఆశీస్సులు పొందడంతో పాటు భావితరాలకు ప్రకృతిఫలాలు సజావుగా అందించడానికి ప్రతి ఒక్కరూ ఆలోచించాలని ఆకాంక్ష!!

# ఈ మూర్తికి... నమస్కరిస్తే చాలు

– బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ



ఈ నెల 25వ తేదీన శ్రీవరాహ జయంతి

ఒకప్పుడు పరమాత్మ వరాహఅవతారాన్ని స్వీకరించాడు. ఒకసారి చాలా ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది. శ్రీవైకుంఠంలో జయవిజయులు లోపలకు ఎవరూ వెళ్లకుండా కాపుకాస్తుంటారు. స్థానబలం విచిత్రమైన అహంకారాన్ని తీసుకు వస్తుంది. “శ్రీమహావిష్ణువు ఏకాంతవాసాన్ని రక్షించేవాళ్లం మేమే. మా అనుమతి ఉంటే తప్ప విష్ణుదర్శనం అవదు” అని అహంకరించారు.

ఒకసారి సనకసనందనాదులు శ్రీమహావిష్ణుదర్శనానికి వచ్చారు. వారిని జయవిజయులు అడ్డగించారు. వారు “మాకూ, విష్ణువుకీ అరమరికలు లేవు. ఎప్పుడైనా వెళ్లి దర్శనం చేసుకోగలిగినవాళ్లం. మేము లోపలకు వెళ్లడానికి అనుమతి ఎందుకు? మేము ఆయన కోసం ఎదురుచూస్తాం, ఆయన మాకోసం ఎదురుచూస్తాడు. స్వేచ్ఛగా వెళ్లవచ్చు అడ్డుపడకండి. అంటే, “మా అనుమతి ఉండవలసిందే. మీరు వెళ్లడానికి వీలు లేదు” అన్నారు.

“మీరు ధూర్తత్వంతో మీ పరిధి అతిక్రమించారు. ఈ పదవికి మీరు పనికిరారు. ఈ పదవిని విడిచిపెట్టి భూలోకంలో రాక్షసులుగా జన్మించ” మని శాపమిచ్చారు. జయ విజయులు సనకసనందనాదుల కాళ్ల మీద పడ్డారు. శ్రీమహావిష్ణువు సర్వజ్ఞుడు. అన్నీ తెలిసినా “ఏమైంది, ఎందుకు అరుస్తున్నారు?” అన్నాడు. సనకసనందనులు “మేము ఇలా శాపమిచ్చాం. మాయందు ఏదైనా దోషం ఉన్నదా?” అని అడిగారు. “మీ దోషం ఏమీలేదు” అని, జయవిజయుల వంక తిరిగి ఇన్నాళ్లనుండీ పని చేస్తున్నా ఒక చిన్నతప్పు చేస్తే మా యజమాని మమ్ము వెనకేసుకుని రాలేదు అంటారని ఒక గొప్ప సిద్ధాంతం చెప్పాడు.

నల్లగా శరీరం ఉన్న వ్యక్తికి తెల్లగా ఉండాలని కోరిక. ఆ శరీరానికి కుష్ఠవ్యాధి వచ్చి తెల్లటిమచ్చలు వస్తే తెల్లగా ఎంత బాగున్నానో అని అట్టిపెట్టుకుంటే, వేళ్లు ఊడిపోతాయి. తనశరీరంలోనే పుట్టిన కుష్ఠవ్యాధికి పుళ్లు పుట్టి చీము, నెత్తురు కారి, పురుగులు వాలేటట్టుగా చేసినట్లు, నా భృత్యులేకదా అని తప్పుచేసినా వెనకవేసుకుని రావడం అలవాటయితే ఆ ప్రభువు చివరికి అపకీర్తి పొందుతాడు. తప్పుచేస్తే తప్పు చేశావు అని చెప్పవలసిందే. లేకపోతే నా ధర్మం పోతుంది. వాళ్లకి అవమానం జరగడానికి కారణం మీరు. భృత్యులని వెనకేసుకుని వస్తే ఒంట్లో పుట్టిన కుష్ఠరోగాన్ని అట్టిపెట్టుకున్నవాడిని అవుతాను. ఇప్పుడు మిమ్ములను వెనకేసుకుని రాకపోతే మీకూ, లోకానికి బుద్ధివస్తుంది. అహంకారం ఎంత ప్రమాదకరమో తెలుసుకుంటారు. మూడుజన్మలు అనుభవించవలసిందే. మీ పాపంపోయిన తర్వాత, నా చేత సంహరింపబడి తిరిగి మీ స్థానాలను మీరు అలంకరిస్తారు.” అన్నాడు.

అహంకారం అంత తేలికగా పోదు. అది పోవడానికి ఆయన ఎన్నో అవతారాలు స్వీకరించాల్సి వచ్చింది. తప్పు వాళ్లది, అవతారాలు ఆయనవి. సీతమ్మతల్లిని పోగొట్టుకుని ఒక అవతారం, శిశుపాల, దంతవక్రులను చంపడానికి, సభలో నానామాటలు అనిపించుకుని ఒక అవతారం... ఇన్ని అవతారాలను ఎత్తి తన భృత్యులను తాను

తెచ్చుకున్నాడు. స్వామి ఎంతోదయ కలిగినవాడు. వాళ్లు రాక్షసయోనులయందు జన్మించడానికి కారణం కల్పించబడాలి.

ఒకనాడు కశ్యపప్రజాపతి ప్రదోషవేళలో జపం చేసు కుని అగ్నికార్యం చేసుకుంటున్నాడు. ఆయనకు దితి, అదితి ఇద్దరు భార్యలు. అదితియందు దేవతలు, దితియందు దైత్యులు పుడతారు. దితికి ప్రదోషవేళలో కామాతురత కలిగి భర్త దగ్గరకు వెళ్లి, అద్భుతమైన మాట అంది.

"భర్త తేజస్సు భార్యయందు ప్రవేశించి కొడుకుగా పుడుతుంది. భర్తే కొడుకురూపంలో ఆమె శరీరంనుండి బయటికి వస్తాడు. అది భార్య హక్కు. నన్ను అనుగ్రహించి నేను తల్లి అయ్యేటట్లుగా అనుగ్రహించ"మని అడిగింది. ఆయన "ఇది భార్యాభర్తల సంగమసమయం కాదు. ఓ దితీ! ఇది ప్రదోషవేళ. ఈ సమయంలో భార్యాసంగమం చేస్తే లోక కంటకులైన బిడ్డలు కలుగుతారు. అధర్మాన్ని చేయడమెందుకు?" అన్నాడు. ఆమె వినలేదు.

ఆయన వెంటనే వెళ్ళి ఆమెను అనుగ్రహించాడు. కొంతకాలం తరువాత ఆమె గర్భం ధరించింది. ఆయన దివ్యదృష్టితో చూచి రమించకూడని వేళలో నన్ను నిగ్రహించి రమించావు. నీ కడుపున పుట్టే సంతానం లోకాన్ని రక్షించేది కాదు. లోకభయంకరులైన ఇద్దరు జన్మిస్తారు. వారు లోకంలో ఉన్నవి అన్నీ మేమే అనుభవించాలని అంటారు. ఆ కారణం వల్ల విష్ణువుకి విరోధులు అవుతారు. శ్రీమహావిష్ణువు సుదర్శన చక్రధారల చేత తరగబడి శిరస్సులు క్రిందపడిపోతాయి" అని చెప్పాడు.

ఆమె చాలా రోదించింది. ఆమెకు కవలపిల్లలు ఇద్దరు కుమారులు కలిగారు. ముందు పుట్టినవాడు హిరణ్యాక్షుడు, వెనకపుట్టినవాడు హిరణ్యకశిపుడు. హిరణ్యాక్షుడు అంటే హిరణ్యకశిపుడికి అమితమైన ప్రేమ. హిరణ్యాక్షుడు అంటే పేరులోనే తెలుస్తుంది. పేరు పెట్టేటప్పుడు పెద్దవాళ్లని సంప్రతించి పెట్టాలి. స్వతంత్రించి పెట్టకూడదు. పనికిమాలిన పేర్లు పెడితే ఆ పేరుతో పిలవగా పిలవగా అదే భావాలతో తయారవుతారు. హిరణ్యం అంటే బంగారం. అది లోభానికి ప్రతీక. హిరణ్య కశిప్ అంటే పడక అనుభవానికి గుర్తు. మంచం భోగానికి గుర్తు. పవిత్రమైన వస్తువులను మంచం మీద పెట్టరు. హిరణ్యాక్షుడు తెచ్చి దాస్తే, హిరణ్యకశిపుడు అనుభవిస్తాడు.

ఒకప్పుడు కల్పాంతంలో ప్రళయజలాలలో భూమి అంతా నీటిలో అడుగుకు వెళ్లి పాతాళలోకాన్ని చేరుకుంది. భూమి లేదు. శ్రాద్ధదేవుని మనువుని చేసి భూమిని ధార్మికంగా పరిపాలించి సంతానోత్పత్తి చెయ్యమని అంటే ఆయన "భూమి ఉంటే కదా పరిపాలనచెయ్యడానికి! అది పాతాళలోకం దగ్గరకు వెళ్లిపోయింది. దాన్ని తీసుకుని పైకి ఎత్తితే కదా నేను పరిపాలన చెయ్యడం! ఎవరు తీసుకుని వస్తారు?" అన్నాడు. ఆయన అలా అనగానే చతుర్ముఖబ్రహ్మకు తుమ్ము వచ్చి తుమ్మగానే ఆయన ముక్కులోనుండి ఒకాయన కిందపడ్డాడు.

చిన్నగా కిందపడ్డ అతడు భూమి, ఆకాశాలు నిండిపోయేంతగా పెరిగిపోయాడు. అది వరాహ అవతారం. యజ్ఞవరాహమూర్తిగా వచ్చాడు. అనగా యజ్ఞంలో వాడే పదార్థాలు ఏవి ఉంటాయో సుక్కు, స్రువం, ఆజ్యపాత్ర ఇటువంటివన్నీ ఆయన శరీరభాగాలుగా మారిపోయి, మంగళకరమైన స్వరూపాన్ని పొందాడు. భూమి సముద్రం లోపల ఉండిపోయింది. లోభం గల హిరణ్యాక్షుడు "వెళ్లిపోయిన ఆ భూమి నాదే" అన్నాడు. ఎవ్వరూ అక్కడకు రావడానికి వీలులేదు. లోభబుద్ధి ఎక్కడ ఏమి ఉన్నా, ఎందుకూ పనికి రాకపోయినా కావాలి అంతే. అదొక అవగుణం, దాస్తాడు.

ఆ లక్షణం చేత భూమి నాదని సముద్రంలో తిరుగుతున్నాడు. అంత భూమి ఏమి చేసుకుంటావు అంటే కావాలి అంతే. శ్రీమహావిష్ణువు భూమ్యాకాశాలు నిండిపోయేంత పెద్ద యజ్ఞవరాహావతారం పొందాడు. పెద్దరోమాలు గల అది సముద్రంలోకి దిగినప్పుడు ఒక చమత్కారం జరిగింది. భూమి ఎక్కడ ఉంది? పైకి ఎత్తుదామని ముట్టె పెట్టి వెతుకుతున్నాడు. ఆ వెతుకుతున్నప్పుడు సముద్రంలోని నీళ్లన్నీ ఆయన రోమకూపాలలోకి వెళ్లి సముద్రంలోని నీళ్లు తగ్గిపోయాయి. ఆయన వెతికివెతికి పైకి లేచి తలని ఇటూ అటూ ఊపాడు. అప్పుడు చెవులలోని నీళ్లు జూలు మీదనుండి పైకి చల్లబడ్డాయి. అభిషేకం చేసిన జలాలు పాత్రలో పట్టుకుని మామిడిమండతో చల్లుతుంటే మనమందరం తలలు పెట్టినట్లుగా బ్రహ్మాదిదేవతలు "ఇది శ్రీమహావిష్ణువు అవతారం. ఆయన ఒంటికి తగిలి,

మీదపడుతున్న నీళ్లు" అని అందరూ వెళ్లి తలలు వంచి నమస్కరిస్తూ ఆ నీళ్లన్నీ వాళ్లమీద పడేటట్లుగా నిలుచున్నారు. ఆయన సముద్రంలోనుండి పైకి లేచి తలని ఊపితే ఆయన రోమాల మీద నుండి పడ్డ నీళ్లు మీద పడితే చాలని కోట్ల మంది దేవతలు శిరసువంచి నిలుచున్నారు. కృష్ణకర్ణామృతంలో లీలాశుకుడు–

"ఓ శ్రీమహావిష్ణుదేవా! మీరు యజ్ఞవరాహమూర్తిగా సముద్రంలో దిగితే సముద్రంలోని నీళ్లన్నీ మీ రోమకూపాలలోకి వెళ్లిపోయాయి. స్నానానికి సరిపోలేదు. ఒళ్లు, బట్ట తడవనే లేదు. శ్రీకృష్ణపరమాత్మగా వస్తే మా మోచెయ్యి అంత ఉండి గోపకాంత తొడలమీద పడుకోబెట్టుకుని యశోదాదేవి దోసిటితో నీళ్ళు తీసి మీ ఒంటిమీద పోస్తే సరిపోయాయి. ఎంత విచిత్రం! ఒక అవతారంలో సముద్రజలాలు సరిపోలేదు, ఒక అవతారంలో గోపకాంత దోసిలి నీళ్లు సరిపోయాయి. మహానుభావా! ఏదైనా మీకే చెల్లింది" అన్నాడు. ఆయన తన ముట్టెతో తడిమి పాతాళంతో కలసిపోయిన భూమిని తన దంష్ట్రల మీద నిలపెట్టి భూమిని సముద్రజలాలనుండి పైకి



తెస్తుంటే ఒక అద్భుతమైన స్వరూపం కనిపించింది. వేంకటాచలంలోని ఆదివరాహమూర్తి అపురూపమూర్తి. ఈ ఆదివరాహమూర్తి మీద ఒక ప్రత్యేకమైన, శక్తిమంతమైన స్తోత్రం ఉంది. ఆ స్తోత్రాన్ని నియమబద్ధంగా చదివితే తీరనికోరిక ఉండదు.

తన కోరమీద భూగోళాన్ని నుంచోపెట్టి అడుగులు పైకి వేస్తూ వస్తుంటే హిరణ్యాక్షుడు చూసి, వాడికి అన్నీ నాది నాదన్నభావన కదా, "నువ్వు ఎవరవు? ఎత్తుకుని పోతున్నావు" అన్నాడు. ఆయన ఏమీ మాట్లాడక వస్తుంటే భూకాంత ఆయనని గట్టిగా కౌగలించుకుంది. హిరణ్యాక్షుడు గదలతో, త్రిశూలాలతో ప్రహారం చేశాడు. ఇద్దరిమధ్యా ఘోరమైన యుద్ధం జరుగుతోంది. ఆదివరాహస్వరూపం ఎంతో దయ కలిగిన స్వరూపం. అవతారమనగానే పక్కన దయ అన్న మాట ఉంటుంది. హిరణ్యాక్షుడు యుద్ధం చేస్తుంటే ప్రదోషవేళ అయింది. బ్రహ్మాదిదేవతలు చీకటిపడితే వాడి శక్తి పెరుగుతుంది "మహానుభావా! సంహరించ"మని అన్నారు.

హిరణ్యాక్షుడు విసిరిన గదని తప్పించి ఒక్కసారి రెండు కోరలు విదల్చి, చేతిని ఎత్తి గుండెల మీద ప్రహారం చేస్తే నెత్తురుకక్కుకుని వెంటనే శరీరాన్ని విడిచిపెట్టాడు. అక్కడతో హిరణ్యాక్షుని సంహారం పూర్తయిపోయింది. హిరణ్యాక్షుని సంహరించడంలో దయ ఉంది. అహంకారంతో ప్రవర్తించిన జయవిజయులలో రాక్షసయోనులలో పుట్టిన ఒక జన్మ హిరణ్యాక్షుడు. వాడు శరీరం వదలిపెట్టాడు అంటే భగవంతుని వ్రోల ద్వారపాలకుడుగా వెళ్లిపోవడానికి ఒక అడుగు ముందుకు వేసినట్లు. భగవంతుడే సంహరించి మళ్లీ తన అక్కున చేర్చుకున్నాడు. సంహారప్రక్రియలో దయ ఉంది. హిరణ్యాక్షుని సంహరించిన పరమోత్కృష్టమైంది యజ్ఞవరాహావతారం.


ఆ అవతారాన్ని స్మరిస్తే రక్షణ కలుగుతుంది. యజ్ఞస్వరూపమైన యజ్ఞవరాహావతారాన్ని తలచుకుంటే చాలు, మంగళం కలుగుతుంది. యజ్ఞసాధనాలతో అమరికతో కూడుకున్న యజ్ఞవరాహస్మరణ మంగళాలకు దారి తీస్తుంది. ఆ మూర్తిని స్మరించుకుని నమస్కరిస్తే చాలు!

శూరసేన మహారాజు పుత్రుడు వసుదేవునకు, మధురా నగర రాజు కూతురు దేవకీదేవికీ వివాహం జరిగింది. దేవకికి తోడబుట్టిన వాడు రాక్షసాంశ సంభూతుడైన కంసుడు. చెప్పరాని మురిపెంతో అరణాలతో, ఆభరణాలతో, గజ, తురగ, వస్తు, వాహనాలతో వారి దాంపత్యం వెయ్యేళ్ల పంట కావాలనే కాంక్షతో రథం మీద చెల్లెలిని మెట్టినింట దింప బయలుదేరాడు కంసుడు. కాని విధివ్రాత తప్పదన్నట్లు రథం కొంచెం దూరం సాగగానే ఆకాశవాణి ఇలా వినిపించింది.

"ఓయీ కంసా! వల్లమాలిన ముచ్చటగా చెల్లిని మెట్టినింట దింపబోతున్నావా? ఈమె అష్టమగర్భ సంజనితుడైన పుత్రుడే నీపాలిటి మృత్యువు కాగలడు". ఆ పలుకులు విన్న కంసుడు భయవిహ్వలుడై, వెంటనే కత్తిదూసి దేవకి తలను తెగవేయబోగా వసుదేవుడు వారించి "బావా! నవవధువు అయిన నీచెల్లిని చంపు టెందుకు? ఆమె అష్టమ గర్భంలో పుట్టినవాడు కదా నీశత్రువు. ఆమెకు పుట్టిన సంతానాన్నంతా నీకర్పిస్తాను" అని మాట ఇచ్చి దేవకిని కాపాడాడు. ధర్మాధర్మవిచక్షణా రహితంగా రాజ్యపాలన చేయసాగాడు కంసుడు. నారదుడు ధర దుఃఖాన్ని మరొకసారి హరికి విన్నవించాడు.

శ్రావణ బహుళాష్టమి రోహిణీ నక్షత్రాన లోకాలన్నీ గాఢనిద్రలో మునిగిన వేళ, మధురానగర చెఱసాలలో ఒక చీకటిగది అట్టడుగున దేవకి అష్టమగర్భాన ఒక మహాద్భుత తేజం శిశువుగా ఆవిర్భవించింది. ఆ విశ్వమోహనాకారుడైన బాలుణ్ణి చూచిన దేవకి మాతృవాత్సల్యంతో, వసుదేవుడు పుత్రోత్సాహంతో పొంగిపోయారు. కానీ వారి ఆనందాన్ని తృటిలో విషాదచ్ఛాయలు క్రమ్మివేశాయి. "అయ్యో తండ్రీ! ఎన్నోజన్మల నోములపంటగా నిన్ను కన్నాం. కాని ఆ దుర్మార్గుడైన కంసుడు నిన్ను మాకెక్కడ మిగులనీయునురా"! అని విలపించసాగారు. అంతట వెంటనే దేవకీ వసుదేవుల కళ్లు మిరుమిట్లు కొలుపునట్లు, చతుర్భుజాలతో, శంఖచక్రాది ఆయుధాలతో శ్రీవత్సాంకిత వక్షుడు, పీత కౌశేయ వాసుడు అయిన శ్రీమన్నారాయణుడు ఎదుట నిలిచాడు. "తల్లీ! దేవకీ! తండ్రీ! వసుదేవా! మీకు వచ్చిన భయమేమీ లేదు. మూడు జన్మలుగా మీరు నాకు మాతాపితలు. మొదటిజన్మలో, స్వాయంభువ మన్వంతరాన, ఈ వసుదేవుడు "సుతపుడు" అనే ప్రజాపతి. నీవు "పృశ్ని" అని అతని భార్యవు. మీరు సృష్టి ప్రారంభంలో శీత, వాత, ప్రకోపాలను లెక్కచేయక పన్నెండువేల సంవత్సరాలు జప, తప, ధ్యానాదులతో నన్ను అర్చించి, మూడుజన్మలకూ నన్ను పుత్రునిగా కోరారు. అందుచేత మొదటిజన్మలో "పృశ్నిగర్భుడ"నే

ఈ నెల 16న శ్రీకృష్ణాష్టమి సందర్భంగా...



# చిన్ని చిన్ని కన్నయ్యా..!!

– శ్రీమతి చెవుటూరి కుసుమకుమారి

పేర బాలకుడనై మీకు జన్మించాను. రెండవజన్మలో మీరు "అదితి–కశ్యపులు" కాగా, నేను "వామను"డనై జన్మించి బలిని అణచాను. ఈ జన్మలో మీరు దేవకీవసుదేవులు కాగా నేను "శ్రీకృష్ణ" నామధేయుడనై కంసాది దైత్యులను వధించి భూభారాన్ని తగ్గించ గలను. ధర్మసంస్థాపన నా అవతారలక్ష్యం.

జ్ఞానమూర్తివైన తండ్రీ! నన్ను వెనువెంటనే నంద గోకులానికి చేర్చుము. నందగోపుడు తొలిజన్మలో ద్రోణుడు అనే వసువు. తొల్లి జన్మమున అతని భార్య "ధర" నందుని భార్య యశోద. వారు నిరంతరం నా సాన్నిధ్యాన్ని కోరి నాకోసం భూలోకంలో జన్మించ నంగీకరించారు. వారి కోర్కె మీద నేను నందుని ఇంట పెరుగ గలను" అని చెప్పుతూ దేవకీ గర్భం తనకు జన్మస్థలమనీ, నంద గేహం తనకు లీలానాటకరంగస్థల మనీ, తాను పరబ్రహ్మమూర్తి అని పలికి రెప్పపాటున మాయను తలపించి, నీలగగన శ్యామదేహుడైన పసిపాపడైనాడు పరమాత్మ. వసుదేవుడు హరి ఆదేశాన్ని అనుసరించి బ్రహ్మాండమే తొట్టిగా శయనించే ఆ బాలపరమాత్మను చిన్న తట్టలో తన హృదయాన్నే పాన్పుగా చేసి, తన సుతిమెత్తని చేతులనే గొలుసులుగా వేసి పదిలంగా గుండెలకు హత్తుకుని, వివశమైన మనసును విష్ణు పదాయత్తం చేసి, తట్టను తలనిడుకుని, చెఱసాల బయటకు అడుగిడబోగానే ఆశ్చర్యంగా కవాటాలు తెరుచుకున్నాయి. కావలి వాళ్లంతా విధులను విస్మరించి గాఢనిద్రలో ఉన్నారు. మధురానగర వాసుల మీద మాయ వర్షిస్తోందా! అన్నట్లు జోరున వర్షం కురుస్తూ ఉండగా వసుదేవుడు వడివడిగా అడుగులు వేస్తూ యమునా నదివైపు నడుస్తున్నాడు.

యమునాతీరం చేరగానే బాల ముకుందుని అడుగులకు యమున మడుగులొత్తుతున్నదా! అన్నట్లు ప్రవాహం రెండు పాయలుగా విడిపోయింది. ఆకాశంలో తారకలు దేదీప్యమానంగా వెలుగుతుంటే ప్రతిఫలించే కాంతి దారిని జలతారులా ధగద్ధగాయ మానం చేస్తుండగా, తట్టను కప్పిన ఆదిశేషుని సహస్రశిరసులు ఉయ్యాలపందిరి కాగా, కదులుతున్న అతని నాల్కలు ఉయ్యాల పందిరికి కట్టిన ఆటబొమ్మల్లా, అనంతుని ఉచ్ఛ్వాస నిశ్వాసాల బుసలు "లీలామానుష వేష వినోదా! కొంచెం ఓపిక పడితే నీ "ఆనంద నంద గోకులం" వస్తోంది అని గుసగుసలాడుతున్నాయా అన్నట్లు తలపిస్తూ ఉండగా నందగోకులం చేరి ఆ పరమాద్భుత శిశువును యశోద ప్రక్కన పరుండచేసి, బాలికగా జన్మించి యశోదప్రక్కలో నున్న యోగమాయను దేవకి చెంతకు చేర్చాడు వసుదేవుడు. అదే "శ్రీకృష్ణజన్మాష్టమి"

శ్రీ మహావిష్ణువు ధరించిన అవతారాలన్నీ పరిపూర్ణ అవతారాలు కావు. ఎవరో ఒక రాక్షసవధ కోసం, ఏదో ఒక కార్యం నిర్వర్తించటానికి అవతరించినవే. కానీ శ్రీకృష్ణావతారం పరిపూర్ణ అవతారం. నేను భగవంతుడిని అంటూనే సర్వప్రాణిసఖు డైనాడు గోవిందుడు.


పృశ్ని– సుతపులు దేవతలు, కంసుడు మేనమామ దైత్యుడు, మేనబావ అర్జునుడు నరుడు, పిల్లనిచ్చిన జాంబవంతుడు భల్లూకం, కరుణించిన కాళియుడు పాము, గోవులు, గోపాంగనలూ సరేసరి. ఇలా దేవ, దానవ, మానవ, పశుపక్ష్యాదులతో స్నేహ బాంధవ్యాన్ని శ్రీహరి నవనీతామృతమనస్కుడై నెరపాడు. గీతాచార్యుడు కృష్ణుడు లీల అమానుష విగ్రహుడు (లీలామానుష విగ్రహుడు) తాను అమానుషుడై కూడ, శిశువై, గోపాలుడై, శిష్యుడై, గృహస్థు అయి, భక్తానుగ్రహమూర్తి అయి, నరుడికి సారథి అయి మురిపించి, మరపించి, ఝుడిపించి, లాలించి, కరుణించి సమస్త వర్ణాశ్రమధర్మాలనూ ఆచరించాడు. నరుడికి సారథి అయి కామ, క్రోధ, లోభ, మోహాలనే పగ్గాలు చేతపట్టాడు. ధర్మాధర్మాలకు సరిహద్దురేఖను గీచి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసి, మానవుల "నుదుటిగీత"ను చాటి, "భగవద్గీతను" లోకానికి అందించి ....

అటువంటి "శ్రీకృష్ణజన్మాష్టమి" ఒక యుగానిది కాదు. దానికి కాలనియమం లేదు. ఆ 'నందగేహ' దీపమైన ఆ పరమాత్మకు మన దేహమే గేహంగా, మనస్సు ప్రమిదగా, ఇంద్రియాలు వత్తులుగా (మెలిపి), భక్తి చమురుగా ఆత్మజ్యోతిని సిద్ధం చేసి, మధుర భావోద్వేగంతో వెన్న, పాలు, పంచభక్ష్యపరమాన్నాలూ వండి పెట్టి, తడిపిండితో చిన్ని చిన్ని కన్నయ్య పాదాలను ఇంటి ముంగిలి నుండి పూజగది దాకా ఇంటింటావేసి "కన్నయ్యా! నీ కోసమే మేం ఎదురుచూస్తున్నాం. నీవు మా ముంగిటిముగ్గుల మీదుగా బుడిబుడి నడకలతో నడచి వచ్చి మా దేవతా పీఠాన్ని అధివసించు. కన్నా! మా నివేదనను మా ఆత్మార్పణగా గ్రహించు. నీ చిన్నిపాదాల ముద్రలు మా మనస్సుల మీద శాశ్వతంగా జన్మజన్మలకూ నిలచిపోనీరా చిన్నితండ్రీ, నీవు నడచిన ఇంట బాలపరమాత్మ లాంటి పసివాళ్లు కళకళలాడేలా అనుగ్రహించు" అని వేడుకుంటూ కంటికి రెప్ప అడ్డుపడేలోగా మాయ క్రిష్ణయ్య మరుగవుతాడేమోనని రాత్రంతా భజన చేస్తూ మనస్సును పావనగంగను కన్న ఆ విష్ణుపదాయత్తం చేసి ధన్యులౌతారు ఇల్లాళ్లు.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000



గతసంచిక తరువాయి..

"నదీతీరంలో నవనవలాడే నీ అందాన్ని చూశాను. నీ పొందుకోసం కోరి కోరి వచ్చాను. నన్ను అనాదరించకు. నీ తోడి కామసుఖం నాకు దక్కనీ" అని మరీ దగ్గరికి వచ్చాడు. చివరిసారిగా ఆమె "కామసుఖంకోసం నీవు రావడం సరి కాదు. ఈ సుఖాన్ని భార్య ద్వారా కూడా ధర్మబద్ధంగా పొందవచ్చు. అది దోషము కానే కాదు. శాస్త్ర సమ్మతం కూడా. నీకు కాదు, బ్రాహ్మణకులానికంతా అపఖ్యాతి. మోహంలో నన్ను అంటకు, అంటకు" అని బ్రతిమాలాడుతున్నా ఆమెను మాధవుడు తనదిగా చేసుకున్నాడు. నిస్సహాయ అయిన ఆమె "విప్రా! నీవు కులభ్రష్టుడయ్యావు. ఇంక నీ మెడలో పవిత్రయజ్ఞోపవీతమెందుకు? ఆహారవిహారాదులతో జీవితమంతా అధమ జీవనం కొనసాగించు" అన్నది. మాధవుడు ఆమె చెప్పినట్లుగానే ముందు యజ్ఞోపవీతం త్యజించాడు. బ్రాహ్మణాచారాలను సహజంగానే వదులుకున్నాడు. నిత్యనూతనకాంక్షలతో కుంతలతో పన్నెండుసంవత్సరాలు కృష్ణానదీతీరంలో కాలం గడిపాడు. కుంతల మరణించింది. ఆమె లేని జీవితం అతనికి వ్యర్థమనిపించింది. "సర్వజనులూ గౌరవించే బ్రహ్మకులంలో పుట్టినా నేను చేయరానిపాపాలు చేశాను. శ్రీహరి ఒక్కడే నాకు రక్షకుడ"ని కుమిలిపోసాగాడు.

సరిగ్గా, అదే సమయంలో కొందరు రాజులు పరివారంతో వేంకటాద్రికి వెళ్లడాన్ని మాధవుడు గుర్తించాడు. ఆ గుంపులో మాధవుడు కలిసిపోయాడు. వారు తినగా పారవేసిన అన్నాన్ని అడుక్కుని తాను తిన్నాడు. దేహాభిమానం వదులుకున్నాడు. చివరకు కపిలతీర్థంలో రాజపరివారం పవిత్రస్నానం చేస్తూంటే తానూ స్నానం చేయాలనుకున్నాడు. వాళ్లలాగే అక్కడ తలనీలాలు సమర్పించాడు. స్నానానంతరం వాళ్లలాగే పిండప్రదానాలు చేశాడు. తన పితృదేవతలు సంతోషిస్తారని ముచ్చటపడ్డాడు. ఈ వృత్తాంతాన్ని కులపురోహితుడైన శతానందుడు జనకమహారాజుకు చెబుతుంటే విదేహాధిపతి ఒక ప్రశ్నవేశాడు.

"స్వామీ! మాధవుని జీవితం దోషభూయిష్టం, పాపసంకలితం. అలాంటి వాడు పితృదేవతలకు పిండప్రదానం చేస్తే, ఆ పితృదేవతలు సంతోషపడటమేమిటని కుతూహలంతో అడిగాడు, జనకుని సందేహాన్ని తీర్చడం కోసం పురోహితుడు- "జనకా! మాధవుడు చండాలంగనను చేపట్టడం, చిరకాలం ఆమెతో కలిసి జీవించడం, కేవలం కాముకుడిగానే వ్యవహరించడం అన్నీ పాపకృత్యాలే. కానీ కపిలతీర్థంలో స్నానం చేయడంతో అతని పాపాలు నశించాయి. అంతేకాదు శ్రద్ధతో తనకు తోచిన రీతిలో మృత్పిండం సమర్పించడంతో మృత్యుదేవతలు సంతోషించారని" చెప్పాడు.

మరుసటి రోజు మాధవుడు రాజపరివారంతో వేంకటగిరి ఎక్కుతుంటే ఆ గిరిస్పర్శ వల్ల బ్రాహ్మణునికి అంటిన పాపాలన్నీ వడకిపోతూ పారిపోయాయి. వేంకటాద్రిలోని అరణ్యాల దర్శన వీక్షణాదులతో అతని పాపారణ్యమంతా కాలిపోయింది. ఈ దృశ్యాన్ని బ్రహ్మ, వామదేవాదులు చూచి ఆశ్చర్యచకితులయ్యారు. ఇదంతా వేంకటాద్రిమహిమ అని పూలమాలలు కురిపించారు. చివరకు బ్రహ్మ భూమికి దిగి- "విప్రా! నీ పాపం పటాపంచలైంది. త్వరగా వేంకటాద్రి చేరుకో. స్వామి పుష్కరిణిలో మునుగు, భూవరాహస్వామికి పూజలు చేసి మొక్కి నీ మానుషదేహాన్ని త్యజించు. తదనంతరం భూతలంలో పాండవుల కుమార్తెలవంశంలోని సుపారుని కొడుకుగా జన్మించి, నారాయణ పురపాలకుడైన సుధర్మునికి ఆత్మబంధువవుతావు. హరి భక్తితో తొండమండలాన్ని పాలిస్తావు. నీకు లక్ష్మి అంశతో ఒక కుమార్తె జన్మిస్తుంది. ఆమెను శ్రీహరికి కన్యాదానం చేసి, ఆ తర్వాత వైకుంఠం చేరుకుంటావని" బ్రహ్మ దేవుడు వరాలిచ్చాడు. (ఇంకా ఉంది)

# వెలిగింపుమయ్యా జ్ఞానజ్యోతీ..

- డా॥ కప్పగంతు రామకృష్ణ, 90320 44115



శ్రీమహావిష్ణువు ధరించిన అవతారాల్లో హయగ్రీవ అవతారం ఒకటి. ఈ అవతారంలో స్వామి వేదాలను ఉద్ధరించాడు. అందువల్ల, వేదాలతో పాటు సమస్తమైన వాఙ్మయానికి, జ్ఞానానికి హయగ్రీవుడు అధిపతి అయ్యాడు. ఈ అవతారంలో స్వామి గుర్రం ఆకారపు ముఖం, మానవ శరీరంతో కలిసిన రూపులో దర్శనమిస్తాడు. స్వామి వామాంకం మీద లక్ష్మీదేవి ఆసీనురాలై ఉంటుంది. స్వామి తెల్లటి శరీర ఛాయ కలిగి ఉండి; శంఖం, చక్రం, చిన్ముద్ర, పుస్తకాలను నాలుగు చేతుల్లో ధరించి భక్తులకు దర్శనమిస్తాడు.

**ఈ నెల 9వ తేదీన శ్రీహయగ్రీవ జయంతి**

## హయగ్రీవోత్పత్తి

శ్రావణపూర్ణిమ రోజున హయగ్రీవ అవతారోత్పత్తి జరిగింది. దేవీభాగవతం, స్కందపురాణం, భాగవతం వంటి పురాణ, ఇతిహాసాల్లో హయగ్రీవ అవతారోత్పత్తికి సంబంధించి అనేక అంశాలు వర్ణితమై ఉన్నాయి.

మధుకైటభులనే రాక్షసులు వేదాలను అపహరించి, పాతాళంలో దాచిపెడతారు. వేదాలు లేనిదే సృష్టికార్యం



చేయలేనని బ్రహ్మదేవుడు విష్ణుమూర్తికి విన్నవించుకుంటాడు. వెంటనే, శ్రీమహావిష్ణువు హయగ్రీవ అవతారంలో పాతాళానికి చేరి, మధుకైటభులను వధించి, వేదాలను రక్షించి, బ్రహ్మదేవునకు తిరిగి అప్పగిస్తాడు.

మరొక కథప్రకారం, దానవులతో యుద్ధంచేసి, అలసిన విష్ణువు అల్లెతాటిని గడ్డం కింద ఉంచుకుని నిద్రపోతున్నాడు. దేవతల కోరికమేరకు, శివుడు భ్రమర రూపం ధరించి, అల్లెతాటిని కొరుకుతాడు. చివాలున తెగిన అల్లెతాటి వేగానికి విష్ణువు శిరస్సు శరీరం నుంచి వేరుపడుతుంది. విచారపడ్డ దేవతలు, గుర్రపుతల తీసుకువచ్చి, విష్ణువుకు

## 2025, సెప్టెంబరు నెల ఉత్సవాలు, పర్వదినాలు

**04** వామనజయంతి
**04- 07** శ్రీపద్మావతీతాయార్ల పవిత్రోత్సవం, తిరుచానూరు
**05** ఉపాధ్యాయ దినోత్సవం
**06** అనంతపద్మనాభవ్రతం
**21** మహాలయ అమావాస్య
**సెప్టెంబరు 24 నుండి అక్టోబరు 02 వరకు**
శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవం, తిరుమల;
శ్రీపద్మావతిఅమ్మవారి నవరాత్రిఉత్సవం, తిరుచానూరు
**28** శ్రీవారి గరుడోత్సవం, తిరుమల
**29** శ్రీవారి స్వర్ణరథరంగడోలోత్సవం, తిరుమల;
సరస్వతీపూజ
**30** దుర్గాష్టమి

అతికించి, ఆయనను పునర్జీవితుడిని చేస్తారు. ఈవిధంగా స్వామి హయగ్రీవుడయ్యాడు.

### వేదమూర్తి హయగ్రీవుడు

హయగ్రీవుడు పరిపూర్ణవేదమూర్తి. స్వామి రూపం సకలవిద్యలకు నిలయం. అంతేకాదు, హయగ్రీవుడు సకల దేవతాస్వరూపం కూడా. హయగ్రీవునివల్లనే ఈ లోకానికి లలితాసహస్రనామం, త్రిశతి మొదలైన విద్యలు అందాయి. సాక్షాత్తు హయగ్రీవస్వామి అగస్త్యమహర్షికి శక్తి ఉపాసనా రహస్యాలు బోధించాడు. ఆధ్యాత్మికప్రపంచంలో అత్యంతప్రాచుర్యం పొందిన లలితాసహస్రనామం హయగ్రీవుడి వల్లనే లోకంలో వ్యాప్తిలోకి వచ్చింది.

వేదసాహిత్యంలో ప్రతి ఒక్క శబ్దానికి, ప్రతి ఒక్క రూపానికి అంతరార్థం ఉంటుంది. హయగ్రీవ అవతారం కూడా ఈకోవలోకి వస్తుంది. హయగ్రీవస్వరూపం జ్ఞానానికి, శబ్ద బ్రహ్మతత్త్వానికి ప్రతీక.

వేదాలు హయగ్రీవుణ్ణి "శబ్దబ్రహ్మ"గా భావిస్తాయి. వేదాల్లో ప్రాణం శబ్దమైతే, శబ్దానికి రూపం హయగ్రీవుడు. ఉపనిషత్తుల్లో హయగ్రీవతత్త్వాన్ని గంభీరంగా వివరించిన ఉపనిషత్తు... హయగ్రీవ ఉపనిషత్తు. ఇందులో హయగ్రీవుడు "జ్ఞానస్వరూపుడు, సత్యస్వరూపుడు"గా వర్ణించబడ్డాడు. ఆయన రూపం మనస్సుకు ఆహ్లాదాన్ని, జ్ఞానానికి మార్గ దర్శకత్వాన్ని కలిగించే శక్తిగా భావించబడుతుంది.

మహోన్నత అవతారమూర్తి అయిన హయగ్రీవస్వామిని అర్చించిన ఎందరో ఋషులు ఆత్మజ్ఞానాన్ని సంపాదించి, తిరిగి ఆ విజ్ఞానాన్ని సమాజ పునరుద్ధరణ కోసం వినియోగించారు. సాక్షాత్తు పరమేశ్వరస్వరూపమైన ఆదిశంకరులు, విశిష్టాద్వైత మత సిద్ధాంతకర్త రామానుజాచార్యులు హయగ్రీవోపాసన చేసి, సర్వోన్నతజ్ఞానాన్ని సంపాదించారు. హయగ్రీవోపాసన పుణ్య ఫలితం వల్ల 'శ్రీపాదరాజతీర్థుడ'నే పండితుడు రాజాస్థానంలో జరిగిన పాండిత్యసభలో విజయం సాధించాడు. గాలవుడనే మహర్షి హయగ్రీవోపాసన చేయటం వల్లనే వేదవిద్యా పారంగతుడయ్యాడు. సూర్యునితో సహా దేవతలందరూ హయగ్రీవుని ఉపాసన చేసినట్లు హయగ్రీవోపనిషత్ చెబుతోంది.

వేదాలు, ఉపనిషత్తులు చెప్పిన హయగ్రీవతత్త్వం ఆధునిక విద్యార్థులకు కూడా వర్తిస్తుంది. బాహ్యవిద్యతో పాటు ఆంతరికజ్ఞానం ప్రతివిద్యార్థికీ అవసరం. ఆ జ్ఞానాన్ని వెలిగించే వాడే హయగ్రీవుడు. ఆయన రూపాన్ని ఆరాధిస్తూ, ఆయన తత్త్వాన్ని మనజీవన విజ్ఞానంగా స్వీకరిద్దాం!

### శ్రీపదకేళి
### :: 115 – సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 శ్రీ | వ | ర | 2 ల | క్ష్మీ | వ్ర | తం | | 3 ఋ | | 4 సా |
| హ | | | క్ష | | | | | షి | | రం |
| య | | 5 ర | ణ | ము | | 6 రా | ఖీ | పం | డు | గ |
| గ్రీ | | | | | 7 బా | ధ | | చ | | డు |
| 8 వ | ర్ణం | | 9 అ | | ణం | | 10 సు | మి | త్ర | |
| జ | | 11 అ | న్న | ద | | | మం | | | |
| యం | | | పూ | | 12 పా | | | | 13 శ్ర | |
| తి | | 14 అ | ర్ణ | 15 వ | ము | | 16 సం | జీ | వ | ని |
| | 17 సా | | | ర్ష | | 18 కా | | | ణం | |
| 19 ప | వి | త్ర | | | | టి | | 20 ర | | |
| | త్రి | | 21 వి | నా | య | క | చ | వి | తి | |

# చిన్నికృష్ణా నిన్నుచేరికొలుతూ...

– శ్రీమతి రమా శాండిల్య, 96187 66600



కేరళలోని తిరువెంబాడి గ్రామంలో శ్రీమహావిష్ణువు బాలకృష్ణుని రూపంలో దర్శనమిస్తాడు.

కేరళరాష్ట్రం, త్రిసూర్‌కు సమీపంలో వాయువ్య దిశగా, 'ఎడక్కలొత్తూర్' అనే గ్రామంలో ఒకప్పుడు ఈ ఆలయం ఉండేది. ఆ ఆలయం శిథిలమౌతున్న సమయంలో, అంటే, 16వ శతాబ్దంలో సంతానంలేని స్వామినాథన్ అనే పుణ్య దంపతులు శిథిలావస్థలో ఉన్న ఆలయంలోని చిన్ని కృష్ణుని మూర్తిని తీసుకొచ్చి, వారి ఇంటిలోనే ప్రతిష్ఠించి, పూజలు చేస్తుండేవారు. ఆ మూర్తిని చూస్తూ, అదే లోకంగా ఉండేవారు. వృద్ధాప్యం కారణంగా ఇక వారివల్ల కాక, అక్కడి రాజుగారితో మొరపెట్టుకోగా, 18వ శతాబ్దంలో త్రిసూర్ రాజైన, శక్తి తంపూరణ్ 'తిరువెంబాడి' అనే చిన్న గ్రామంలో, కేరళ దేశపు శిల్పశైలిలో అతిపెద్ద ఆలయనిర్మాణంచేసి, దానిలో ఈ బాలకృష్ణునిమూర్తిని ప్రతిష్ఠించాడు. అలాగే, 'యోగమాయమూర్తిని' చిన్ని కృష్ణుని ఎడమప్రక్కన ప్రతిష్ఠించాడు. ఈ యోగమాయనే బాలకాళీగా పిలుస్తూ భక్తులు కొలుస్తున్నారు.



**భారతదేశం మొత్తంలో ఇలా, ఇద్దరు బాలమూర్తులు ఒకే గర్భగుడిలో పూజలందుకోవటం మరెక్కడా లేదు. అదే ఇక్కడి విశేషం కూడా!**

ఒక చేతిలో మురళితో ముగ్ధమోహనరూపంతో దివ్యతేజోమూర్తిగా దర్శనమిస్తాడు. ఇక్కడ ప్రతినెలా ఏదో ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం సంవత్సరకాలం జరుగుతూనే ఉంటుంది. తిరువెంబాడిలో శ్రీకృష్ణస్వామి అభ్యంగనస్నానం చాలా ఘనంగా జరుగుతుంది. పునుగు, జవ్వాది, కస్తూరి తైలాలతో ఒళ్లంతా పూసి, గంధంముద్దతో ఒళ్లంతా అలది చేసే ఆ అభిషేక మహోత్సవం చాలా గొప్పగా జరుగుతుంది. అభిషేకానంతరం అనేక సుగంధపుష్పాలతో జరిగే అలంకరణ, పుష్పయాగం చూడాలంటే ఎన్నోజన్మలపుణ్యం ఉండాలి.

ఇక్కడ జరిగే, అనేక సాంస్కృతిక కార్యక్రమాలలో కేరళదేశపు ప్రముఖకళారూపమైన మోహినీహట్టం, శ్రీకృష్ణ హట్టం చూచి తీరాల్సిందే! సంవత్సరానికి రెండుసార్లు ఇక్కడ భాగవతసప్తాహం చేస్తారు. ధనుర్మాసమంతా నారాయణీయ సప్తాహాలు నిర్వహిస్తారు. జూలైనెలంతా రామాయణపారాయణం ఉంటుంది. తిరువెంబాడి శ్రీకృష్ణాలయంలో, మన ఇంట చంటి పిల్లలు పుడితే ఎలా ఉత్సవాలు చేసుకుంటామో అలాగే బాలకృష్ణుడికి సంవత్సరం పొడుగునా ఉత్సవాలు, ఊరేగింపులు, అన్నదానాలు జరుగుతూనే ఉంటాయి.

ఉదయం నాదస్వరమేళంతో ఆలయసేవలు మొదలై, రాత్రి ఎనిమిది గంటలకు మళ్లీ నాదస్వరమేళంతో ముగుస్తాయి. ప్రతిరోజు అభిషేక, అర్చనలతో పాటు, ఉంఛపూజ కూడా ఉదయం పదిగంటలు నుంచి పదిన్నరవరకూ జరుగుతుంది. ఆ సమయంలో బాలకృష్ణుడు ఆలయంలో పరుగులు తీస్తున్నట్లు ఉంటుంది. పెద్ద ఉత్సవాలలో ఏనుగుల మీద బాలకృష్ణుడు ఊరేగుతూ ఉంటాడు. తిరువెంబాడి శ్రీకృష్ణాలయం ఉదయం ఆరునుంచి పదకొండు వరకు తెరిచి ఉంటుంది. తిరిగి సాయంత్రం నాలుగునుంచి ఎనిమిది వరకూ తెరిచి ఉంటుంది.

కేరళలో అన్ని బస్సులు త్రిసూర్ వరకూ ఉంటాయి. రైలు మార్గం కోజికోడ్ వరకూ మాత్రమే ఉంటుంది. అక్కడి నుంచి నలభై అయిదు కిలోమీటర్ల దూరంలో తిరువెంబాడి ఉంటుంది. విమానమార్గం తిరుచ్చి వరకు ఉంది. అక్కడి నుంచి కారు, బస్సుల్లో వెళ్లాలి.





# దారితప్పిన భక్తుని చేరదీసిన దేవుడు

- డా॥ ముక్తేవి భారతి

చిన్నవయసులోనే కొందరు మహాభక్తులు కావడం లోకంలో చూస్తూనే ఉంటాం. కానీ ఆ భక్తులు కొన్ని సమయాలలో, భక్తిని వదిలి రక్తులైపోతే, రాజ్య భోగాసక్తులైతే, భగవంతుడు ఆ భక్తుణ్ణి అలా వదిలేస్తాడా, తిరిగి తన వైపు త్రిప్పు కుంటాడా! ఒకసారి తన హృదయంలో స్థానం సంపాదించుకున్న భక్తుడు, ఏ ప్రలోభాలతో తనకు దూరమైనా, అతణ్ణి చేయిపట్టిలాగి తన దగ్గరకు వచ్చేటట్టు చేసుకోటంలోనే భగవత్తత్త్వం ఇమిడి ఉంది. భక్తితో ముక్తిని సాధించడం మత సారాంశం. ఈ విషయం గ్రహించలేని సామాన్య మానవులు, అనేక అపోహల్లో ఉంటారు. ఒకే కుటుంబంలో ఒక వ్యక్తి ఒక మతం, మరోవ్యక్తి మరోమతం నమ్ముతారు. భార్య ఒక దేవుణ్ణి పూజిస్తే, భర్త మరో దేవుణ్ణి పూజిస్తాడు. ఇద్దరిలోనూ భక్తి ఏకసూత్రంగా ఉంటుంది.

యామునాచార్యుడు విష్ణుభక్తుడు. బ్రహ్మచారి. బాల్యంలోనే వేదశాస్త్రముఖ్య విద్యలు అభ్యసించాడు. వైష్ణవభక్తి ప్రచారమే లక్ష్యంగా జీవిస్తున్న ఆబ్రహ్మచారి యామునాచార్యునికి పాండ్యదేశరాజు గుర్తుకు వచ్చాడు. ఆ రాజు మహాశివభక్తుడు. రాజు పట్టమహిషి విష్ణుభక్తురాలు.

ఆమె ఉత్తమురాలు, భర్త భక్తిమార్గం వేరైనా ఆమె ఏనాడూ భర్తను సేవించటం మానలేదు. తాను పట్టమహిషి అయినా, భగవత్కైంకర్యమంతా తన చేతిమీదుగానే జరిపించేది.

ముంగిటనున్న బృందావనికి ముగ్గు తానే పెట్టేది. దశమినాడు ఏకభుక్తం చేసేది. విష్ణుపూజలతో, దానధర్మాలతో కాలంగడిపేది. ఆ సమయంలో శివకేశవ అభేదాన్ని పాటించాలనే విషయాన్ని విష్ణు మూర్తి లక్ష్మీదేవికి వివరిస్తూ, ఆ పనిలో తన భక్తుణ్ణి ఎలా నియమించబోతున్నాడో తెలిపాడు.

ఈశ్వరుడు, బ్రహ్మ, విష్ణువుకంటె వేరుకాదని, ఎవరిని పూజించినా ఆ పూజ తనకూ చెందుతుందని చెప్పి, అయినా,

"కేవల శరీరదృష్టిన
దేవతల న్వేఱ కలుగ తెలిసినజడులన్
నా వాసుదేవతాస్థితి
భావింపనిపూజ సాంతఫలమై త్రిప్పున్"
(ఆముక్త మాల్యద 4-52)

'సమస్తమూ నేనే' అనే తత్త్వం అంతుపట్టని మూఢ జనులు దేవతల మధ్య తేడాలు సృష్టిస్తున్నారని విష్ణుమూర్తి లక్ష్మీదేవితో చెప్పి, ఆ పాండ్యరాజుకూడా అలాంటి అజ్ఞానంతోనే భక్తులను బాధిస్తు న్నాడనీ, అందుకే తన భక్తుని ప్రేరేపించి పాండ్యరాజుసభకు పంపించానని పలి కాడు. లక్ష్మీదేవి చాలా సంతసించింది. లక్ష్మీనారాయణులదయతో యామునా చార్యుడు ముందుగా పాండ్యరాజ పట్ట మహిషి వద్దకు వెళ్లాడు.

ఆమె అనుమతితో సభలో ప్రవేశించి పాండ్యరాజును ఒప్పించి, వాదంలో గెలిచి, రాజును విష్ణుభక్తునిగా మార్చాడు

**ఈ నెల 8న**
**ఆళ్వందార్ల వర్షతిరునక్షత్రం**



వినాయకచవితిరోజు చంద్రుణ్ణి చూడకూడదు

యామునాచార్యుడు. కానీ అంత గొప్ప విష్ణుభక్తుడైన యామునాచార్యుడు కాంత, కనకాలభ్రాంతిలో పడిపోయాడు. భక్తి తెరమరుగైంది కూడా. ఏ పనిమీద తాను పాండ్యరాజ్యానికి వెళ్లాడో, ఆ కార్యం సాధించాడు కానీ, తన జీవిత చరమ లక్ష్యం మరచిపోయాడు. కానీ భగవంతుడు తన భక్తుడు చేజారిపోయి, ఇహ లోకసుఖాలవైపు మళ్లితే ఎలా ఊరుకుంటాడు? ఎలాగైనా దారికి తెస్తాడు కదా!

యామునాచార్యుని విష్ణుభక్తి వాదనకు మెచ్చి, పాండ్యరాజు సాష్టాంగ దండప్రణామం చేశాడు. తన చెల్లెలి నిచ్చి పరిణయం చేశాడు. అర్ధరాజ్యం ఇచ్చాడు. శత్రురాజ్యాలు గెలిచి రాజ్యవిస్తరణకు పాటుపడవలసిందని ప్రోత్సహించి దండయాత్రకు సిద్ధం చేశాడు.

కానీ, అది వర్షాకాలం కావటంతో, శరత్కాలంవరకు ఆగడం అవసరమని మంత్రి, పురోహితులు హితవు చెప్పారు యామునాచార్యునికి. రాజ్యవైభవంతో పరవశిస్తున్నాడు అతడు.

శరత్కాలం రాగానే యామునాచార్యుడు దిగ్విజయ యాత్రకు బయలుదేరాడు. విజయపరంపరలతో ఆనంద వర్ధిలో మునిగితేలుతున్నాడు. సర్వసంపదలతో తులతూగుతూ, భోగపారవశ్యంతో కాలం గడిపేస్తున్నాడు.

ఒకనాటి వైష్ణవబ్రహ్మచారి యామునాచార్యునికీ నేడు మహారాజై, భోగియైన యామునాచార్యునికీ మనసులో కలిగిన మార్పును భగవంతుడు గమనించాడు. యామునుని ప్రవర్తన, భోగలాలసత విష్ణుభక్తులకు బాధ కలిగిస్తోంది. భగవన్నామస్మరణమే విస్మరించాడు. భగవదారాధనే పరిత్యజించాడు.

యామునుని భక్తిరహితజీవితవిధానాన్ని చూచి చాలా విచారించాడు అతని పితామహుడగు నాథముని ప్రియశిష్యుడైన శ్రీరామమిశ్రుడు. భగవంతునివైపు యామునుని మనసు ఎలా తిప్పాలి అని ఆలోచించాడు. ఈ భవబంధాలలో చిక్కుకున్న అతణ్ణి బయటకు లాగటం తనవల్ల అవుతుందా అని చింతించాడు. తన పరమగురువు యొక్క మనుమనికి ఈ దీనస్థితి ఏమిటని ఆవేదన చెందాడు. శ్రీరామమిశ్రుడు.

'యోగసామ్రాజ్యంబు మఱచి సామ్రాజ్యంబు నందాసక్తుఁడయ్యె' అని బాధపడ్డాడు. అంతేకాక,

**"వసుధం పుత్త్రాదికదు**
**ర్వ్యసనముసైతమును దండ్రి వారించుటకున్**
**వసపడ దఁట, మరి రాజ్య**
**వ్యసనము వారింప నెంతవాఁ డెవ్వాఁడున్"** **(ఆముక్తమాల్యద 4-192)**

కనుక, ఈ రాజ్యవ్యసనం నుంచి తప్పించడం ఎవరికీ తరంకాదని వదిలేస్తే ఎలా– ఏదో ఉపాయంతో భక్తిమార్గంవైపు లాక్కురావాలని పట్టుబట్టి శ్రీరామమిశ్రుడు, భోజనప్రియుడైన యామునాచార్యునికి అలర్కశాకాన్ని (ముళ్ల ఉచ్చింతకూర) రోజూ వండిపెట్టే ఏర్పాటు చేశాడు మొదటి ఉపాయంగా, అది అతని మనసును



మారుస్తుందనే నమ్మకంతో. ఒకరోజున భోజనం చేస్తూ, రోజూ ఈ అలర్కశాకం ఎవరు తెస్తున్నారో వారిని పిలవండన్నాడు యామునాచార్యుడు. ఒక మహావిష్ణుభక్తుడు తెస్తున్నాడని తెలియగానే అతని మనసు క్షణాలలో మారిపోయింది. భక్తుడు అనేమాటే అతణ్ణి గత జీవితంలోకి తీసుకువెళ్లింది.

ఆ భక్తుడు రాజు ముందు నిలిచాడు. "మీ పెద్దలు సంపాదించిన నిక్షేపం చూపిస్తాను. మీరు రాజులు కనుక ఈ నిధినిక్షేపాలన్నిటిమీద అధికారం మీదే. ఆ నిధి అనంతమైంది, అక్షయమైంది. ఆ నిధి మీకొక్కరికే ఏకాంతంలో చూపిస్తాను" అన్నాడు భక్తుడైన శ్రీరామమిశ్రుడు.

ఆ మాటలు విన్న రాజు ఆలోచనలోపడ్డాడు- అక్షయం, అనంతం, ఆద్యం అయిన నిధిని తాను ఏకాంతంగా చూడాలా! ఏమో! ఏ భోగభాగ్యాలు ఇంకా తనకు రానున్నవో అనే ఉత్సాహంతో సేనాసమేతుడై శ్రీరామమిశ్రునితో బయలు దేరాడు.

వెళ్లివెళ్లి అందరూ శ్రీరంగానికి చేరారు. యామునా చార్యుడు కావేరీపుష్కరతీర్థంలో స్నానమాచరించాడు. రంగనాథుని సేవించుకున్నాడు. దగ్గరున్న శ్రీరామమిశ్రుడు ఎక్కడ ఏ నిధి చూపిస్తాడో అన్న ఆత్రుతతో అతని వంక చూశాడు.

"మీ పెద్దలు గూర్చిన ని
క్షేప మ్మిది గొ"మ్మటంచు శ్రీరంగపతి
శ్రీపదయుగ్మము చూపిన
నాపృథివీపతి, హఠదపాస్తభ్రముఁడై"

(ఆముక్తమాల్యద 4-202)

'- *గ్రక్కున తన పూర్వదశ తలంచి, ఇన్నాళ్లు తన ప్రమాదంబునకు పరమనిర్వేదం'* పొందాడు యామునా చార్యుడు. స్వామి పాదపద్మాలు దర్శించటంతో అతని అజ్ఞానం ఛిన్నా భిన్నమైంది. తన పూర్వదశను, నేటి భోగజీవితాన్ని తలచుకుని పశ్చాత్తప్తుడయ్యాడు.

శ్రీరామమిశ్రునికి సాష్టాంగదండప్రణామం చేశాడు. తనను భగవంతుడు విష్ణుభక్తిప్రచారానికి పంపితే, తాను అది వదిలి రాజ్యవైభవసంపదల్లో మునిగిపోయినందుకు చాలా దుఃఖించాడు. **విష్ణుదేవుడే పరతత్త్వమని పాండ్యునిసభలో వాదించి గెల్చిన తను, ఆ భక్తితత్పరతకు ఎలా దూరమై పోయాడో, భోగలాలసత ఎలా తన జీవితాన్ని పక్కదారి పట్టించిందో తలచుకుని కుంగిపోయాడు.**

కానీ, భగవంతుడు తన భక్తుణ్ణి వదులుకోడు కనక, శ్రీరామమిశ్రుని రూపంలో యామునాచార్యునికి తిరిగి భక్తి, జ్ఞానమార్గాలను బోధించేలా చేశాడు. పశ్చాత్తప్తుడైన యామునా చార్యుడు రాజ్యాన్ని తన కుమారునికి అప్పగించి, చతుర్థపురు షార్థం కోసం అన్వేషిస్తూ సన్యాసాశ్రమాన్ని స్వీకరించాడు. భక్తుడు ఏ ప్రలోభాలకు లోనైనా చివరికి తిరిగి తిరిగి, ఆ భక్తిమార్గంలోనే మోక్షం సాధిస్తాడు.

బాలుడు నూతిలో పడుతుంటే తండ్రి చేయి అందించి పైకి తీసినట్లు, భక్తవత్సలుడైన శ్రీమన్నారాయణుడు భవ సాగరంలో మునకలేస్తున్న యామునాచార్యుని ఇలా ఉద్ధరించాడు.

## జూన్ నెల క్విజ్-35 సమాధానాలు

| | |
|---|---|
| 01) సుందరరాజస్వామి | 11) విష్వక్సేనుడు |
| 02) వేదవిద్వాంసులకు | 12) కరతాళధ్వని |
| 03) అహోబిలం | 13) శ్రీకరవిమానం |
| 04) మోక్షము | 14) అప్పలాయగుంట |
| 05) శ్రీకొలువుశ్రీనివాసమూర్తి | 15) వృషభం |
| 06) మహావేది మహోత్సవం | 16) విష్ణుపురాణం |
| 07) ఘోష, గరుడధ్వజ | 17) పుష్కరముని |
| 08) 43 అడుగులు | 18) గర్వం |
| 09) 56 రకాలు | 19) గంధర్వుణ్ణి |
| 10) ఇంద్రద్యుమ్నుడు | 20) యోగమాయదుర్గ |

### సరైన సమాధానాలు వ్రాసినవారు-

1)వెలిచేటి ఉమారత్న తన్మయి, రాజమహేంద్రవరం 2)జీ.వి.యస్. పవన్ కుమార్, యానం 3)పులికంటి చైత్ర, హనుమకొండ 4)సుదీప్తి, ఖమ్మం 5)కె.వ్యాస, విజయవాడ 6)కె.భీష్మ, విజయవాడ 7)చిప్పాడ వేదాంశు సంపత్, విశాఖపట్నం 8)క్రిష్టిపాటి భార్గవ్, హైదరాబాదు 9)యామర్తి శ్రీనివాస సత్కృత్, బెంగళూరు 10)భట్టిప్రోలు షణ్ముఖవిరాట్, బెంగళూరు 11)ఎం.షణ్ముఖజశ్వంత్, పెద్దాపురం 12)వి.బి.రోషిణి, కుప్పం 13)గొలివి కౌండిన్య కృష్ణంనాయుడు, పూడివలస 14)వై.సాయివాణి, బెంగళూరు 15)శ్రీపర్ణ, హైదరాబాదు 16)మేడపాటి కార్తిక, కుతుకులూరు 17)అప్పికట్ల వెంకటసాయి ధన్వి, మచిలీపట్నం 18)సిహెచ్.కార్తికేయ, విజయవాడ 19)కె.అభయకృష్ణ, హైదరాబాదు 20)కె.పూజిత, మధిర 21)చిప్ప చిన్మయి, పోచారం 22)బలివాడ సాధ్విక, రెడ్డిపేట 23)పర్వతం వెంకటభరద్వాజ్, సికింద్రాబాదు 24)దాసరి రిషికావేష్, మందమర్రి 25)సుంకరి సాత్త్విక, ఫతేనగర్ 26)విష్ణువందన, విజయవాడ 27)జె.లక్ష్మణ్ వీర్, కుప్పం 28)ఎస్.ఎ.ఖాదర్‌వలి, వెట్టపాలెం

# విశ్రాంతి కావాలి!

- శ్రీమతి కె.ఎస్.వి.కె.స్రవంతి



భాద్రపదశుక్లపంచమిని 'ఋషిపంచమి' అని అంటారు. ఇది కేవలం స్త్రీలవ్రతం. స్త్రీలకు అశుచికాలంలో కలిగే దోష నివారణకు, వారికి ఆ సమయంలో విశ్రాంతి కలిగించాలనేది ఈ వ్రతనేపథ్యం.

ఉద్దాలకమహర్షికి వివాహమైంది. ప్రతిరోజూ రాత్రి అతని భార్య శరీరం నిండుగా క్రిమికీటకాలతో తీవ్రదుఃఖాన్ని అనుభవిస్తూంది. ఒకరోజు ఉద్దాలకుడు బ్రహ్మను గూర్చి తపస్సు చేయగా, ఆయన ప్రత్యక్షమై "నీ భార్య పూర్వజన్మలో చేసిన తప్పు. ఏ స్త్రీ కూడా ప్రతినెలా 'అశుచి'గా ఉన్న ఆ మూడు రోజులపాటు ఇంట్లో ఉన్న ఏ వస్తువులను, వ్యక్తులను తాకకూడదు. అలా కాకుండా నీ భార్య ఇంట్లో ఉన్న భాండాల్ని తాకడమే కాక ఏ విధమైన అంటు దోషాన్నీ పాటించలేదు. ఆ కారణంగా ఇలా బాధపడుతోంది. ఋషిపంచమివ్రతాన్నీ ఆచరిస్తే ఆమెకు కల్గిన బాధ తొలగిపోతుందని" చెప్పాడు. అలాగే ఆమె ఋషిపంచమివ్రతాన్ని ఆచరించి, బాధలనుండి విముక్తురాలైంది.

స్త్రీలు రజస్వలయైన మూడురోజులవరకు ఎవ్వరూ చూడకూడదు. మాట్లాడకూడదు. కనీసం ముట్టకూడదు అనే నియమాన్ని మన మహర్షులు విధించారు."

దీని గురించి భవిష్యోత్తరపురాణంలో ఓ కథ ఉంది. విదర్భదేశంలో ఉత్తంగుడు అనే బ్రాహ్మణుడుండేవాడు. అతని భార్య సుశీల. వారికి ఒక కొడుకు, కూతురు సంతానం. కూతురు బాలవింతువైంది. ఈ బాధ కలిగిన ఉత్తంగుడు గంగాతీరవాసియై బ్రహ్మచారులకు వేదం చెబుతూ ఉండేవాడు. అతని కూతురు తండ్రికి శుశ్రూష చేస్తూండేది.

ఒకరోజు ఆ కూతురు శరీరంనుండి పురుగులు పడ్డాయి. దాని వల్ల ఆమె స్పృహతప్పి పడిపోయింది. ఉత్తంగుడు దివ్యదృష్టి వల్ల ఆమె పూర్వజన్మలో బ్రాహ్మణబాలికై ఉండి రజస్వల అయిన రోజునే ఇంట్లో గిన్నెలు ముట్టుకుని ఉండటం తెలుసుకున్నాడు. అంతేకాక ఈ జన్మలో కూడా ఆమె ఋషిపంచమీవ్రతం చేసుకునే వాళ్లను చూచి నవ్వింది. అందువల్ల కూడా ఆమె శరీరం క్రిములతో కూడి ఉంది అని ఉత్తంగుడు భార్య సుశీలకు చెప్పాడు. 'ఋషిపంచమీ' వ్రతం చేస్తే ఈ దోషం పోతుంది. ఈ వ్రతాచరణ వల్ల రజస్వలగా ఉండి, అజ్ఞాతంగా చేసే తప్పులు కూడా పోతాయని చెప్పాడు

ఈ వ్రతవిధానాన్ని ధర్మరాజుకు శ్రీకృష్ణుడు చెప్పాడు. ఇది ప్రాయశ్చిత్తాత్మకమైన వ్రతం. తెల్లవారుఝామునే అభ్యంగన స్నానం చెయ్యాలి. ఈనాడు ఉత్తరేణిచెట్టుకు పూజచేసి దాన్ని సమూలంగా పెరికి దాని వేరుతో ముఖం కడుక్కోవాలి. తర్వాత పుణ్యస్త్రీ ఈనాడు నూనె (నల్ల నువ్వుల నుండి తీసిన తైలం)ను రాసుకుని అభ్యంగనం చేయాలి. స్నానానంతరం పసుపు కుంకుమలు ధరించాలి. వితంతు స్త్రీలు భస్మం, గోపిచందనం, పంచగవ్యాలుపయోగించి స్నానం చేయాలి. స్నానాంతరం తిరిగి గోపీచందనం వాడాలి. స్నానానంతరం ధవళవస్త్రాలుధరించి అరుంధతితో కూడిన సప్తమహాఋషులకు పూజచేయాలి.

పూజానంతరం భోజనాలు పెట్టాలి. ఈనాడు సాతాళించిన శనగలు, గేదెపెరుగు, నాటకుండా పెరిగిన కూర తినాలి. సప్తర్షులచరిత్రలను తప్పని సరిగా వినాలి. ఋషిపంచమి మధ్యాహ్నకాలవ్యాపిని అయి ఉండాలి. ఆ పంచమితిథి ఉభయ దినవ్యాపినిగా ఉంటే మొదటిరోజునే వ్రతం చేయాలి. ఈ ఋషిపంచమీవ్రతం ప్రతిస్త్రీ తప్పక ఆచరిస్తే మంచిది.

**ఈ నెల 28న ఋషిపంచమి**

ఈ నెల 15వ తేదీన భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా...



# దేశసేవే దేవతార్చన

- శ్రీ రసరాజు, 82474 85457

ఇక్కడ నిలబడి ఎక్కడో అదృశ్యంగా ఉన్న "స్వర్గం" గురించి ఉన్నతంగా ఊహించుకుంటూ ఉంటాం. దానికి మించి మరొకటిలేదన్న భ్రమలో ఉండిపోతాం. అది సరికాదు.

ఆనాడు రాముడేమన్నాడు- "జననీజన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి..." అనలేదూ! జనని, జన్మభూమికంటే స్వర్గమేమీ గొప్పదికాదని నొక్కివక్కాణించడం మనకు తెలిసిందే! అటువంటి తల్లి గురించి కాని, మాతృభూమి గురించి కాని ఎవరేమైనా కించిత్తు పరుషంగా మాట్లాడితే భారతీయుడనే వాడు ఒక్కడు గూడా చిత్తమంటూ నోరుమూసుకుని కూర్చో లేడు. అలాగే మన జన్మభూమిపై నాదే పెత్తనమంటూ ఎవరో పరాయివాళ్లు వచ్చి మనల్ని బానిసలుగా చూస్తుంటే, మన రక్తం మరిగిపోదూ! అలా నెత్తురు ఉడుకెత్తినపుడు ఆ అరాచక త్వాన్ని ప్రతిఘటించడానికి భారతీయులు అనేకమార్గాలలో ముందుకొచ్చారు. 'ఆయుధాలతో కొందరు, అహింసతో కూడిన ఆధ్యాత్మికచింతనతో కొందరు' తమ శక్తి చూపించారు.

ఆ ఆధ్యాత్మికతలోని భాగాలే సత్యం, అహింస, ధర్మం మొదలైనవి. స్వరాజ్యసాధనలో అవే అంతర్లీనశక్తులుగా దోహదపడ్డాయి. దేశాన్ని ఒక మాతగా, దేవతగా భావించటం స్వరాజ్యసాధనకు పరాకాష్ఠ. ఈ భావనకు ప్రేరణ వందేమాతరం గీతం.

స్వాతంత్ర్యానికి ముందు ఆధ్యాత్మిక చింతన అనేది స్వరాజ్యసాధనలో అనేక విధాలుగా కీలకమైన పాత్రనే పోషించింది. ప్రజలను ఏకం చేయటానికి, నైతికబలాన్ని అందించడానికి పరదేశీయులపై వ్యతిరేకంగా పోరాడటానికి ఎంతో స్ఫూర్తి రగిలించింది. భజనలు, కీర్తనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, ప్రార్థనలు, అశేష ప్రజానీకాన్ని సమీకరించడానికి మాధ్యమాలుగా ఉపయోగపడ్డాయి. మానసిక స్థైర్యాన్నీ, ఓదార్పునీ ఈ కార్యక్రమాలు అందిస్తూ పరదేశీయపాలకులపై పోరాటానికి బలాన్ని చేకూర్చాయి. కష్ట సమయంలో దృఢంగా నిలబడడానికి సహకరించాయి.

వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత మొదలైనవి స్వేచ్ఛ, ధర్మం, ఆత్మగౌరవాలప్రాధాన్యతను తెలిపాయి. స్వరాజ్యసాధనలో ఆధ్యాత్మికచింతన ఒక శక్తిమంతమైన చోదకశక్తిగా పనిచేసింది. యువకులలో నూతనోత్తేజం, దేశసేవాభావాన్ని నింపింది.

స్వరాజ్యం అనగానే మనకు గుర్తుకువచ్చేది గాంధీ మహాత్ముడే! "అహింసా పరమోధర్మః" అని కదా ఆర్యోక్తి. ధర్మమనేది ఏన్నో రూపాల్లో ఉన్నా, ఒక్క అహింసకే ఆ స్థాయి లభించింది. భారతీయుల్ని బానిసలుగా చూస్తున్న పరదేశీయులపై గాంధీ కత్తి పట్టలేదు. సిద్ధాంతాలకు రక్తపురంగు పులమలేదు. అహింసనే ఆధ్యాత్మిక ఆయుధంగా స్వీకరించాడు. అహింస, సత్యాగ్రహం మొదలైన ఆధ్యాత్మికసూత్రాలను స్వరాజ్యసాధనకు మూలస్తంభాల్ని చేయటంలో మహాత్ముడు కృతకృత్యుదయ్యాడు. ఉపవాసాలు, దైవప్రార్థనలు మొదలైనవి ఉద్యమకారుల్లో ఆత్మస్థైర్యాన్ని కలిగించాయి.

మహాత్ముడికి భగవద్గీత అంటే పరమప్రాణం. ఉపనిషత్‌సారాన్ని తెచ్చి అచ్చుపోయగా గీత రూపొందింది. భగవద్గీతా ముఖంగా ఏర్పడ్డ ఆధ్యాత్మికచింతన అనేక సామాజిక

దురాచారాలను నిర్మూలించడానికి, ప్రజలలో ఐకమత్యాన్ని కలిగించడానికి ఎంతగానో దోహదపడింది. ఈ చింతనా ప్రభావంతో సత్యం, అహింస అనే రెండింటిని గాంధీ తన స్వరాజ్యసిద్ధాంతానికి రెండుపార్శ్వాలుగా వినియోగించుకున్నారు. శారీరకబలం కంటే ఆధ్యాత్మికబలం గొప్పదిగా నిరూపించారు.

సత్యంకంటే మించి మరో భగవంతుడు ఉన్నాడనే అనుభవం ఆయనకు కలుగలేదు. "నేను సత్యస్వరూపుడగు పరమేశ్వరుని పూజారిని. అతడొక్కడే సత్యం. మిగిలినదంతా మిథ్య" అనే భావన మహాత్ముణ్ణి అజేయునిగా నిలిపింది.

"ఒడలు దేశసేవ- కెడద రాముని సేవ" అని తుమ్మల రాసిన పద్యంలో భౌతికంగా పైకి కనిపిస్తున్న దేశసేవలో ఏది అంతర్గతంగా దాగి ఉందో, ఆ రాముని సేవను వ్యక్తపరిచారు. ఇక్కడ ఆధ్యాత్మికకోణం నూటికి నూరుపాళ్లూ ఆవిష్కరింప బడింది. మహాత్ముడు తన ప్రధానదైవంగా శ్రీరాముణ్ణి ఎన్నుకున్నాడు. పరాయిపాలకుల పాలనను తుదముట్టించి శ్రీరామరాజ్యం నెలకొల్పాలనుకున్నాడు.

సత్యపదార్థమైన భగవంతునితో సదా ప్రత్యక్షానుబంధం కలిగి ఉంటూ ఆధ్యాత్మికానుభూతిని అణువణువునా నింపుకున్న కారణజన్ముడు వివేకానందుడు. స్వరాజ్యోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనకపోయినా పరోక్షంగా ఆయన బోధనలు యువతలో ఆత్మవిశ్వాసాన్నీ, దేశభక్తినీ రగిలించాయి. హిందూమతం, భారతీయతలో గల విలువల్ని చాటి చెప్పడంలో స్వామీజీ కృతకృత్యులయ్యారు.

"లేవండి! మేల్కొనండి! గమ్యం చేరేవరకు ఆగకండి!" అంటూ ఆయనుపదేశించిన మంత్రమే ప్రజలలో జాగృతి కలిగించటానికి, సత్యసాధనకు బీజమైంది. స్వరాజ్యపోరాటంలో భిన్నవైఖరులున్నా నాటి నాయకులు, ప్రజలు స్వామీజీ మంత్రంతో ప్రేరణ పొందారు. భారతీయులు తమ పారం పర్యాన్నీ, ఘనతనూ మరచిపోయి తామే బానిసలమనుకుంటూ పరాయిపాలనలోనే మనగలమనే అజ్ఞానాంధకారంలో మునిగి పోయిన తరుణంలో భారతీయులను నిద్రనుండి మేలొల్పటానికి స్వామీజీ సుప్రభాత ప్రేరణమై పలు ప్రాంతాల్లో ప్రసంగిస్తూ వచ్చాడు. ఆ కాలంలో భారతీయుల దురవస్థకు ఆయన ఎంతగా కుమిలిపోయారో ఆయన రాసిన లేఖలు వివరిస్తాయి. "అధఃపతితమైయున్న సోదరభారతకోటిని సముద్ధరించటానికి మనమందరం అహర్నిశం ఆ దేవదేవుని ప్రార్థించెదము గాక! వంగయువకుల ఎముకలనుండి వజ్రాయుధాలు స్వాతంత్ర్య సముపార్జనకై తయారుకావాలి!!" అంటూ వివేకానందుడు తన సందేశాల్ని గుప్పించాడు.

వేదాలు, ఉపనిషత్తులు చూపిన ఆధ్యాత్మికతత్త్వాల ప్రాతిపదిక మీద హిందూమతం వెలిసింది. "శాశ్వతమైంది" అనే అర్థంతో "సనాతనధర్మం"గా పేరుగాంచిన మతమిది. మానవునిలో అంతర్గతంగా ఉన్న దివ్యత్వాన్ని అభివ్యక్తం చేయడమే మతం అన్నారు స్వామీజీ. ధ్యాన, ధర్మమార్గాన్ని అనుసరించిన యువయోధులు కొందరు స్వరాజ్యసాధనలో భాగస్తులయ్యారు. "ఓ భారతమా! నీ ఆధ్యాత్మికతతో ప్రపంచాన్ని జయించు!" అనే వివేకానందుని పలుకు రవిఅస్తమించని పరాయిసామ్రాజ్యాన్నే పారద్రోలడానికి సాయపడింది.

రవీంద్రుని రచనలలో దేశభక్తి సరే! ఆధ్యాత్మికచింతన సైతం అంత ప్రకాశవంతంగానూ ద్యోతకమౌతుంది. ఆయన గొప్ప తత్త్వవేత్త కావడంతో ఆయనరచనలు దేశభక్తినీ, ఆధ్యాత్మికతనూ పడుగుపేకలై ఏకంచేశాయి.

"గీతాంజలి" అనే కవితలో ఆత్మాభిమానంతో రవీంద్ర నాథఠాగూర్ ఇలా ప్రార్థిస్తాడు. ఇందులో స్వాతంత్ర్య భావన కొట్టొచ్చినట్లు వెల్లడౌతుంది.

"బ్రతుకుటే చాలునని తలవంచలేను
స్వేచ్ఛను గడించుకొనగల్గు చేవ నిమ్ము!"

"భారతసవిత్రి" అనే మరో కవితాఖండికలో స్వదేశీ యుల బానిసత్వాన్ని పారద్రోలమంటూ కరుణామయుడైన ఆ భగవంతుణ్ణి ఇలా ప్రార్థిస్తాడు-

వైభవము గోలుపడి, గౌరవమ్ము వాసి
బేలయై కుందుచున్నది ధూళి గూలి;
ఆమె సంతాపముడిపి, సమాదరించి
మానవకుటుంబమందు సుస్థానమొసగి
ఉద్ధరింపుము కరుణావిశుద్ధతేజ!

(కొంగర జగ్గయ్య అనువాదం)

విశ్వకవిలోని స్వరాజ్యకాంక్ష ఇక్కడ దేవునిముందు ప్రార్థనాపూర్వకంగా ప్రకటింపబడటం మనం గమనించవచ్చు.

దేశసేవను దేవసేవగా భావించిన మరొక మహ నీయుడు అరవింద ఘోష్. స్వరాజ్యం అనేది ఆయుధాలతోనే

కాదు, ఆధ్యాత్మికమైన విలువలతో కూడా సాధ్యమౌతుందని నిరూపించిన తాత్త్వికసంపన్నుడీయన. తన రచనల ద్వారా ఆధ్యాత్మిక ఆలోచనల భావాజాలాన్ని వ్యాప్తి చేశాడు. భారతీయ ఆత్మశక్తిని జాగృతంచేశాడు. ఆధ్యాత్మికవికాసం ద్వారా స్వరాజ్యం లభిస్తుందని గాఢంగా విశ్వసించాడు. "జాతీయత ఒక లౌకికతత్త్వమే కాదు! ఆధ్యాత్మికతత్త్వం కూడా" అని నిర్ద్వంద్వంగా తేల్చిచెప్పాడు. జాతీయత అనే పదానికి దేశమాతయే దైవమన్నాడు.

బంకిమ్‌చంద్ర ఛటోపాధ్యాయ 'ఆనందమఠ్' అనే నవలలో రాసిన గీతమే "వందేమాతరం". ఇందులో భారత మాత ముగ్గురమ్మలతో పోల్చబడింది. అసలు దేశాన్ని ఒక మాతగా సంభావించడం స్వరాజ్యసాధనకే ఒక కలికితురాయి అని చెప్పాలి. ఈ భావనకు ప్రేరణ ఈ గీతమే! ఇద్దరు దేశభక్తులు ఎదురైతే నమస్కారానికి బదులుగా "వందేమాతరం" అనటం రివాజైంది. విదేశీపాలకులను ఎదిరించడానికి అదే ప్రేరణతో "భారతమాతాకి జై!" అనే మరో నినాదం పుట్టు కొచ్చింది. ఒక రకంగా దేశభక్తిలో దైవభక్తి ప్రవేశించింది. రెండూ కలసిపోయాయి. "దేశం" అనే పదంలోనే "దైవపథం" కనిపించింది.

బాలగంగాధర తిలక్ 'స్వరాజ్యం నా జన్మహక్కు' అని నినదిస్తూ జాతీయుల్ని ప్రభావితం చేశాడు. గణేశ్ ఉత్సవాలు నిర్వహిస్తూ ప్రజల్ని ఆధ్యాత్మికంగా ఏకంచేశాడు. ఈ ఉత్సవాలతో జాతీయభావన ప్రజ్వరిల్లింది. ఆయన 'భగవద్గీత' పై రాసిన 'గీతారహస్యం' కర్మయోగాన్ని, నిష్కామకర్మను బోధిస్తూ స్వాతంత్ర్య సముపార్జనలో ప్రజల్ని చురుగ్గా పాల్గొనేలా చేసింది.

దేశాన్ని దేవతాస్వరూపంగా భావించి ఎవరే మార్గాల్లో పరదేశీయుల్ని ఎదిరించినా అది ధర్మబద్ధమైన ఆధ్యాత్మిక కోణమే అవుతుంది. స్థూలంగా చెప్పాలంటే భారత స్వాతంత్ర్యోద్యమం రెండుపాయలుగా ప్రవహించింది. ఆధ్యాత్మికస్ఫూర్తితో, అహింసాయుతపద్ధతులలో సాగిన ఒక తరహా ఉద్యమానికి మహాత్మాగాంధీ నాయకత్వం వహించగా, తాడో పేడో తేల్చుకోవాలనే తీవ్రధోరణిలో రెండోతరహా సమరం సాగింది. దేశభక్తులు చాలామంది ఆధ్యాత్మికస్ఫూర్తితో సాగిన ఉద్యమాన్నే స్వీకరించారు.

ఇక తెలుగువారి విషయానికి వస్తే, ఆధ్యాత్మిక కోణంలో స్వరాజ్యసాధనకై పటుతరదీక్షతో కృషి సల్పిన నాయకమణులు, కవి మూర్ధన్యులు ఎందరో ఉన్నారు. స్వరాజ్యసాధనలో అల్లూరి సీతారామరాజు ఆయుధాల్ని చేబట్టినా ఆధ్యాత్మికచింతన అతని నరనరాల్లో ప్రవహిస్తూనే ఉంది. ఆయన జీవితం భగవద్భక్తి, జాతీయభావాలమధ్య ఊగిసలాడింది. "స్వరాజ్యమంటే రాజకీయ విముక్తి మాత్రమే కాదు, సామాజిక ఆధ్యాత్మిక వికాసం" అంటూ రఘుపతి వెంకయ్య ప్రబోధించాడు.




ఆధ్యాత్మిక కోణాన్ని దుర్భాక రాజశేఖర శతావధాని రాసిన 'రాణా ప్రతాప చరిత్ర' కావ్యంలో మనం గమనించగలం. స్వాతంత్ర్యకాంక్షా పూరితమైన సందేశం ధర్మబద్ధమై దైవపరంగా ఇలా ప్రకటింపబడింది.

"ధర్మమే దైవమను బుద్ధి తొలగరాదు
నిఖిలజగములు మారొడ్డి నిలుచుగాత
దేశభక్తిని విడనాడి తిరుగరాదు.."

ఈ భావాలు స్వరాజ్యకాంక్షను మరింత ఉద్దీపింపజేశాయి.

గడియారం వేంకటశేషశాస్త్రి రచించిన 'శివభారతం' కావ్యంలోనూ ఆధ్యాతికాంశం మనకగుపిస్తుంది. పరమతస్తుల సామ్రాజ్యాన్ని ఎదిరించి హైందవధర్మపతాక ప్రతిష్ఠించిన వీరకేసరి ఛత్రపతి శివాజీ. ఆయన యుద్ధానికి సన్నద్ధుడై వెళుతున్నప్పుడు "హరహర మహదేవ్" అంటూ శివభక్తుడై ముందుకురికిన ఆధ్యాత్మికవీరుడు.

"దేశభక్తుల కీర్తి వర్ధిల్లుగాక
దేశచరిత్రలు రక్తి సంధించు గాక
కవులుకందును విజయంబు కలుగుగాక
నీ దయ భవాని! అమృతమై నెగడు గాక!"

అంటూ భవానీమాతను ఆధ్యాత్మికహృదయంతో ప్రార్థించటం ఈ కావ్యంలో కన్పిస్తుంది. ఎంతో ప్రాచుర్యం పొందిన వేదుల వారి 'దీపావళి' ఖండకావ్యంలో కూడా అంతర్లీనంగా కొన్ని ఖండికలో దేశభక్తితో కూడిన తాత్త్విక స్పృహ కన్పిస్తుంది. అసలు ఆనాటికవులలో చాలామందికి ఆంతర్యమంతటా ఆధ్యాత్మికమే! గీతాసార సాధనమే!

ఇక్కడొక విషయం చెప్పాలి.

బహుశః 'వందేమాతరం' గీతం రాకముందే ఈ దేశాన్ని తల్లిగా భావించి ప్రార్థించే సంప్రదాయం తెలుగు వాళ్లలోనే ఉందేమో! ఈ గీతానికి ముందే విజయవాడలో జరిగిన ఒకానొక సభలో (25-06-1919) రుక్మిణమ్మ అనే మహిళ ఈ క్రింది గీతం పాడింది.

"అమ్మా! భారతనారీ! మంగళదాయినీ!
లక్ష్మీపార్వతి వాణీరూపిణి!
బ్రహ్మవిష్ణుపరమేశ్వర రూపిణి! శివుని రాణివి!
................
నిలుపగదే అమ్మా! నా జాతి భోగభాగ్యములు"

ఇదంతా ఒక ఎత్తు! సమున్నతమైన మరో తెలుగు శిఖరం గురించి ఎవరైనా సరే విధిగా, ప్రస్తావించవలసిందే! ఆ శిఖరమే 'ఆంధ్రరత్నం'.




'ఆంధ్రరత్న' దుగ్గిరాల గోపాలకృష్ణయ్య "శ్రీరాముని దయచేతను నేను భారతీయునిగా జన్మించాను. నా జాతికి దాస్యశృంఖలాలు తగుల్కొన్నవి. వాటిని ఛేదించుట నా ధర్మం. నాకు తోడుగారండి! దండు కడదాం రండి! శ్రీరాముడు మనకు అండగా ఉండగా, ఆంజనేయుడు మనకు తోడురాగా శ్రీరామ నామ మహిమతో స్వాతంత్ర్యం సాధించుట సులభం.." అంటూ ఊరూవాడా చిడుతలు చేబూని రామనామసంకీర్తన చేస్తూ ప్రజలలో స్వరాజ్యకాంక్ష కలిగించిన ఒక ఆధ్యాత్మికోద్యమ శిఖరం దుగ్గిరాల. ఆయన అనుచరగణం పేరు 'రామదండు'. ఆయన దేశాన్ని భగవద్భక్తితో సమానంగా పూజించాడు. ఆధ్యాత్మిక జిజ్ఞాసువులు సైతం ఆయనకు నమస్కరించకుండా ఉండలేక పోయారు. దేశభక్తి, దైవభక్తి ఆయనకు రెండు నేత్రాలయ్యాయి. గీతాప్రభావం ఈయనపై పుష్కలంగా పని చేసింది. కర్మయోగాన్ని ఆచరణలో చూపించాడు. ఆయన ప్రసంగాల్లో భారతీయతత్త్వశాస్త్రం, ధార్మికవిలువలు ప్రస్తావన కొచ్చేవి.

ఇలా మరెన్నో రత్నాలున్నాయి. స్వరాజ్యసాధనలో ఆధ్యాత్మికకోణాలు రేఖామాత్రంగా కొన్నిమాత్రమే ఇవి.

# ఓనమాలు రావంటూనే...

ఈ నెల 2వ తేదీన
వెంగమాంబ వర్ధంతి

- డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ



ప్రాచీనపద్యకవులలో కడపటి కాంతిదీపం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. "తెలుగుమీరా"గా ఈ భక్తశిరోమణిని విమర్శకులు కీర్తిస్తారు. మూడుశతాబ్దాలపూర్వం శ్రీనివాసునిసేవలో, భక్తజనసేవలో, భక్తిసాహిత్య సేవలో తరించిన పుణ్యశీల ఈమె. వాయల్పాడు దగ్గర తరిగొండ గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ముంగిట మొలచిన తులసిమొక్క. ఆజీవనం యోగినిగా గడిపిన కవయిత్రి. ఒంటరిగా తిరుమలకు వెళ్లిన వేంగమాంబను ఆదరించిన వారిలో మహంతులు, తాళ్లపాక కవులు ముఖ్యులు.

తిరుమలలో వేంగమాంబ నివసించిన స్థలం ఉత్తరమాడవీథిలో తాళ్లపాకవారి ఇంటిలో ఒక భాగం. ఆ ఇంటికి కొంతదూరంలో తులసీవనం. ఆ వనంలో "గుండుబావి". ఆ బావికి కొద్దిదూరంలో పాపవినాశతీర్థం వెళ్లే కాలి బాటలో అమ్మోరు బావి. దానికి ఆనుకుని ఉన్న బాటగంగమ్మకు ఎదురుగా జామతోట. తులసీవనంలో నేటికీ భక్తకోటి వందనాలు అందుకునే వేంగమాంబ సమాధి. ఇవన్నీ స్మరిస్తే చాలు మనస్సు భక్తితో నిండిపోతుంది.

తిరుమలలో వేంగమాంబ భక్తిని గుర్తించిన నాటి ఉన్నతాధికారులు, పాలకులు, అర్చకులు, స్వామివారి ఏకాంత సేవలో ముత్యాలహారతి కైంకర్యభాగ్యాన్నిచ్చారు. నేడు తి.తి.దే అధికారులు ఆ సేవను కొనసాగించి వేంగమాంబ పట్ల ఆదరాన్ని ప్రపంచీకరించారు. కాలాంతరంలో తాళ్లపాకవారి లాలి, తరిగొండవారిహారతి అన్న నానుడి ప్రసిద్ధి నొందింది.

అక్షరశారదాసాక్షాత్కారాన్ని పొంది అనేకకృతుల్ని రచించిన కవితాకల్పవల్లి వెంగమాంబ. ఈమె సహజప్రకృతిలో, ఎక్కువగా కొండ కోనల్లో సంచరించింది. సుందరప్రకృతిని, సహజభాషను తన రచనల్లో పొందుపరిచింది. ఓనమాలు రావంటూనే వివిధ సాహిత్యప్రక్రియల్లో అష్టాదశకృతులు రచించింది. వేంగమాంబ చెబుతూంటే ఘంటికలతో ఎనిమిది మంది వ్రాయసగాళ్లు తాళపత్రాలమీద వ్రాసుకునేవారు.

ద్విపదభాగవతం, వేంకటాచలమాహాత్మ్యంవంటివి వ్యాసమహర్షిరచనలకు సరళ అనువాదాలు. వేంగమాంబ రచనల్లో యక్షగానాలు, శతకాలు, ద్విపదకావ్యాలు, పద్యకావ్యాలు, తత్త్వకీర్తనలు వంటి ప్రక్రియావైవిధ్యాలున్నాయి. రచనల ద్వారా భక్తిచైతన్యాన్ని నాటి సమాజంలో తీసుకువచ్చిన నారీశిరోమణి ఈమె.

వేంగమాంబ నిరతాన్నదాత్రి. ఆమె జీవనప్రస్థానంలో 31 దానాలు ఆమె మఠానికి అందాయి. ఆ దానాల్లో 23 దానపత్రాలకు గుండేపల్లి కుప్పయ్యశర్మ 1946సం॥లో నకళ్లు రాసిపెట్టారు. కానీ సాధుసుబ్రహ్మణ్యశాస్త్రిగారు తిరుపతి వేంకటేశ్వర పుస్తకంలో 31 దానాలుగా తీర్మానించారు. తక్కిన 8 దానపత్రాల్లో డబ్బు, బియ్యంలాంటి దానాలుండటంతో కుప్పయ్యశర్మ వాటిని వదిలిపెట్టారు. వేంగమాంబ సమాధిస్థిత అయిన వందేళ్లకు రెండు దానాలు అందాయి. మాతృశ్రీ తరిగొండ వేంగమాంబ జీవనంలో కొన్ని అవమాన సంఘటనలు ప్రసిద్ధిలో ఉన్నాయి. కానీ ఆ తల్లి రచనలకు, అన్నదానానికి నాటిసమాజంనుండి అందిన వెలలేని సహకారాన్ని గుర్తించాలి.

వేంగమాంబ రచనల్లో వేంకటాచలమాహత్మ్యం మహోన్నతమైంది. ముఖ్యంగా వేంగమాంబ తరిగొండ నృసింహునికి, తిరుపతిదేవునికి అభేదాన్ని సంభావించింది. ఈ రచనలో పద్మావతీశ్రీనివాసకల్యాణం, బ్రహ్మోత్సవాలవర్ణన, తిరుమలవర్ణన, శంఖణుడు, ఆత్మారాముడు, కుమ్మరిభీముడు, వకుళమాలికవంటి భక్తుల పాత్రచిత్రణ అపూర్వం. ఈ రచనలోని వర్ణనలు, అలంకారాలు ప్రాచీనకవులస్థాయికి ఏమాత్రం తక్కువకాదు. విశేషించి ఐదవ అధ్యాయంలో అష్టాంగయోగాలు, మంత్రయోగ, లయయోగాలు, హఠయోగం, రాజయోగంవంటివి ఆమెను గొప్పయోగినిగా నిరూపిస్తాయి. వేంగమాంబ 1730లో జన్మించి 1817 ఈశ్వరనామసంవత్సరం, శ్రావణశుద్ధనవమినాడు విష్ణుసాయుజ్యాన్ని పొందినట్లు చారిత్రకులు తెలియజేస్తున్నారు.

## 108 దివ్యదేశాలు

### నవతిరుపతులు - 2

# తిరువరగుణమంగై

### (నత్తం విజయాసనప్పెరుమాళ్ కోయిల్)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

ఈ దివ్యదేశం తిరునల్వేలినుండి తిరుచ్చెందూర్ వెళ్లే మార్గంలో ఇరవైఎనిమిదికిలోమీటర్లదూరంలో తామ్రపర్ణీ నది ఉత్తరదిక్కున ఉన్న 'నత్తం' అనే ఊర్లో తూర్పుదిక్కున రెండు ప్రాకారాలతో, ఐదుగదుల రాజగోపురంతో ఈ దివ్యదేశం అలరారుతోంది. ఈ దివ్యదేశాన్ని 'వరగుణమంగై' అని చెబితే ఎవరికీ అర్థంకాదు. కారణం 'నత్తం విజయాసనప్పెరుమాళ్ కోవిల్' లేక 'నత్తంప్పెరుమాళ్ కోవిల్' అని చెబితేనే ఈ దివ్యదేశం గురించి అందరికీ తెలుస్తుంది. ఇక్కడ ఉన్న మూలవర్లు ఆదిశేషుడు గొడుగుపట్టగా విజయాసనప్పెరుమాళ్ అనే దివ్యనామంతో తూర్పుదిక్కున నిలుచున్న భంగిమలో భక్తుల్ని అనుగ్రహిస్తున్నాడు. ఈ అద్భుతమైన మూలమూర్తిని ఇక్కడ తప్ప మరెక్కడా చూడలేం. వరగుణవల్లి తాయార్, వరగుణమంగై తాయార్ అని ఉభయనాచ్చియార్‌లు కూడా భగవంతునితో పాటే వేంచేసి ఉన్నారు. ఇక్కడ అమ్మవారికి ప్రత్యేకసన్నిధి లేదు. అగ్నితీర్థం, దేవతీర్థం అని ఈ ఆలయ తీర్థాలు. విమానం విజయకోటివిమానం. నమ్మాళ్వార్లు ఒకే పదంతో మంగళాశాసనం చేసి ఉన్నారు. అనేకజన్మల్లో చేసిన క్రూర పాపాల్ని పోగొట్టి భక్తులకు ముక్తిని ఇచ్చేవాడు ఈ స్వామి అని స్థలపురాణం.

| | | |
|---|---|---|
| స్వామివారు | : | విజయాసన పెరుమాళ్ |
| అమ్మవారు | : | వరగుణమంగై నాచియార్, వరగుణవల్లి తాయార్ |
| పుష్కరిణి | : | దేవపుష్కరిణి, అగ్నితీర్థం |
| క్షేత్రం | : | చంద్రక్షేత్రం |
| విమానం | : | విజయకోటి విమానం |
| ప్రత్యక్షం | : | అగ్నిహోత్రునికి |
| హస్తము/ముద్ర | : | వరదహస్తం, ఆజ్ఞముద్ర |
| ముఖము/స్థితి | : | తూర్పు / కూర్చున్న సేవ |
| మంగళాశాసనం | : | నమ్మాళ్వార్ (1) |



### స్థలపురాణం-1

రోమశముని శిష్యుడైన సత్యవంతుడు అన్ని పాపాల్ని పోగొట్టే, వరగుణమంగైలోని అఘనాశ తీర్థంలో స్నానం చేస్తున్న సమయంలో ఆ నదీతీరంలో ఒక జాలరి చేపల్ని పట్టి ఆ నదీతీరంలో విసరి వాటి ప్రాణాలు తీస్తున్నాడు. ఇలా పదేపదే చేయసాగాడు. అప్పుడు ఒక పాము వచ్చి అతణ్ణి కాటేసింది. ఆ తర్వాత ఒక పుష్పకవిమానం దివ్యతేజస్సుతో ఆకాశం నుండి క్రిందికి వచ్చి, పాము కాటుకు గురైన ఆ మత్స్యకారుణ్ణి మోక్షసామ్రాజ్యానికి తీసుకువెళ్లసాగింది. ఇదంతా గమనిస్తున్న సత్యవంతుడు ఆశ్చర్యపోయాడు. ఇతడు అత్యాశతో మీనాల ప్రాణాల్ని ఒకసారి కాదు అనేకసార్లు తీశాడు. ఇలాంటి దుర్మార్గుడికి ఇలాంటి సద్గతి సంప్రాప్తించడమా! అని ఆశ్చర్యంతో చూడసాగాడు. ఇదే విషయాన్ని గురువు దగ్గర ప్రస్తావించాడు. రోమశ మహర్షి– "ఈ మత్స్యకారుడు పూర్వజన్మ పుణ్య కర్మలవల్ల ఈ దివ్యదేశంలో పుట్టే భాగ్యాన్ని పొందాడు. ఎవరైతే ఈ దివ్యదేశంలో జన్మను పొందుతారో వాళ్లకు మోక్షం నిశ్చయం అన్నమాట. ఎన్ని పాపాలు



## స్థలపురాణం-2

వేదవిదుడు అనే ఒకమహాభక్తుడు తన తల్లిదండ్రులకు, గురువులకు సేవచేసి ఆ తర్వాత భగవంతుని గూర్చి తపస్సుచేయాలని సంకల్పించుకున్నాడు. శ్రీమహావిష్ణువు ఒక వృద్ధునివలే వచ్చి "నీ తపస్సు నిర్విఘ్నంగా కొనసాగాలంటే తిరువరగుణమంగై దివ్యదేశానికి వెళ్లి తపస్సు కొనసాగించు. నీకు సమస్త సన్మంగళాలు లభిస్తాయి." అని చెప్పి అంతర్ధానమయ్యాడు. వేదవిదుడు కూడా ఈ దివ్యదేశానికి వచ్చి తపస్సుచేసి భగవదనుగ్రహం పొందాడు. అందువల్ల ఆనాటి నుండి ఈనాటివరకు ఆదిశేషుడు గొడుగుపట్టగా తూర్పుదిక్కున స్వామి అద్భుతంగా వేంచేసి విజయాసనప్పెరుమాళ్ అనే పేరుతో భక్తులకు దర్శన భాగ్యాన్ని కలిగిస్తూ, దేహావసానంలో మోక్షం ప్రసాదిస్తూ అందరినీ అనుగ్రహిస్తున్నాడు. కనుక భక్తులందరూ ఈ దివ్యదేశాన్ని చేరుకుని యథాశక్తి నామ సంకీర్తనం చేసి పాపాల్ని పోగొట్టుకుని భగవదనుగ్రహంతో మోక్షసామ్రాజ్యాన్ని పొంది తరించాలని ఆకాంక్ష!!

చేసినా భగవంతుని అనుగ్రహం వాళ్లకు ఉంటుంది" అని ఈ దివ్యదేశవైభవాన్ని ఆయన తన శిష్యుడికి తెలియజెప్పాడు.

## గ్రంథసమీక్ష

### సకలకళాకేళి - శ్రీకృష్ణలీలారింఛోళి

**కవి**-డి.వి.యం. సత్యనారాయణ; **పుటలు**- 206కు కలర్ ప్రింటు, ఆర్టుపేపరు; **ధర**- రూ.200/-; **సైజు**-1/8 డెమ్మీ; **ప్రతులకు**- డి.సుమమాల, 32-99-4, వాసవినాగర్, విశ్వభారతి స్కూలు దగ్గర, అద్దంకి, బాపట్లజిల్లా-523 201. సెల్ : 98858 46949 / 70130 87845

భగవంతుని పరిపూర్ణావతారమైన శ్రీకృష్ణుని గూర్చి విస్తారమైన సాహిత్యం వెలువడింది. కొందరికి భాగవతకృష్ణుడు ఆరాధ్య దైవమైతే, మరికొందరు గీతాకృష్ణుణ్ణి అనుసరిస్తారు. భక్తి ఉద్యమాన్ని నడిపించడానికి రాధాకృష్ణుడు ప్రధాన ఆలంబనగా నిలిచాడు. కృష్ణనామసంకీర్తనద్వారా భక్తిఉద్యమాన్ని నడిపించిన రూపగోస్వామి చక్కని, చిక్కని శ్లోకరచనతో శ్రీకృష్ణ లీలామృతాన్ని లోకానికి పంచాడు. ఆ గ్రంథం ఆధారంగా, స్వతంత్ర భావాలతో రచించిన గ్రంథం. శ్రీకృష్ణ లీలారింఛోళి.

ఈ గ్రంథ రచయిత సుప్రసిద్ధ కవి, పండితులు శ్రీ డి.వి.యం. సత్యనారాయణ. ఇందులో 152 పద్యాలున్నాయి. ప్రతిపద్యానికి చక్కని చిత్రం, సులభశైలి వచనంలో భావాలు ఉన్నాలు. ఆకర్షణీయమైన ఆర్టుపేపరు మీద రంగులతో ముద్రించబడ్డ చక్కని బైండు గ్రంథమిది. ఆకర్షణీయమైన విషయాన్ని ఎంత అందంగా ముద్రించాలో తెలియజేసే నికషం ఈగ్రంథం. పేరెన్నిక గన్న పండితోత్తముల 'కితాబు'లతో విషయ వైశిష్ట్యాన్ని తెలియజేస్తోంది.

ఇందులోని ప్రతి పద్యంలోను ఏదో ఒక అద్భుత కల్పన ఉంది. పాఠకుని ముందు ఒక చలనచిత్రం ప్రత్యక్షమయ్యే విధంగా రచన సాగింది. సరళ పదాల సంవిధానంతో సాగిన పద్యరచన అహ్లాదాన్ని కలిగిస్తుంది. శబ్దార్థసమన్వయం క్లిష్టం కాదు. శ్రీకృష్ణుడెంత సుందరుడో ఈ కావ్యం అంత సుందరంగా ఉంది. శ్రీకృష్ణ తత్త్వాన్ని అనుభూతించడానికి ఈగ్రంథం మధుర రసాయనంలా ఉపయోగపడుతుంది.

నిరంతరం శ్రీకృష్ణుని సాన్నిధ్యంలో గడిపిన వేణువులా భక్తుల అంతరంగాన్ని కట్టివేయగల శక్తి సామర్థ్యాలు గల ఈ గ్రంథం ఆస్తికలోకానికి సత్యనారాయణగారు వ్రాసి యిచ్చిన ఆస్తి.

– 'శతావధాని' అముదాల మురళి

# శ్రీసిద్ధివినాయక వ్రతకల్పం



'శ్రీవినాయకచవితి' సందర్భంగా శ్రీ సిద్ధివినాయకవ్రతకల్పం.. 'సప్తగిరి' పాఠకుల కోసం...!!

**పూజాసన్నాహం** - వినాయకచవితి రోజున ఉదయాన్నే ఇంటిని శుభ్రం చేసుకుని మామిడాకుల తోరణం కట్టుకోవాలి. వాకిళ్లను అలంకరించుకోవాలి. కుటుంబసభ్యులంతా తలంటుకొని స్నానం చేయాలి. దేవుని గది ఉంటే అందులో లేదా పరిశుభ్రమైన ప్రదేశంలో ఒక పీటవేసి, దానిపై వినాయకుడి విగ్రహాన్ని ఉంచాలి. పూజాసామాగ్రిని కూడా అందుబాటులో ఉంచుకోవాలి. వినాయకుడికి ఉండ్రాళ్లు చాలా ఇష్టం. మిగిలిన భక్ష్యాలున్నా, లేకున్నా వీటిని తప్పనిసరిగా తయారుచేసుకోవాలి. వినాయకుడి విగ్రహం ఎదుట పీటపై కొంచెం బియ్యం పోసి దానిపై రాగి లేదా వెండి లేదా మట్టిపాత్రను ఉంచాలి. దానికి పసుపు రాసి బొట్లు పెట్టాలి. దానిలో కొన్ని అక్షతలు, పూలు వేసి దానిపై మామిడాకులు ఉంచి ఆపై కొబ్బరికాయతో కలశం ఏర్పాటు చేసుకోవాలి. ఆ తర్వాత పసుపుముద్దతో చిట్టి పసుపు గణపతిని తయారు చేసుకోవాలి. పూజకు ముందు ఒక గ్లాసులో చెంచా లేదా ఉద్ధరణి ఉంచుకుని పక్కన మరో చిన్న కంచం పెట్టుకోవాలి. పూజ చేస్తున్నప్పుడు చేతికి పసుపు, కుంకుమలు అంటుతాయి కాబట్టి చేతికింద ఒక శుభ్రమైన గుడ్డను ఉంచుకుంటే బాగుంటుంది.

*ముందుగా కుంకుమబొట్టు పెట్టుకుని, నమస్కరించుకుని, ఈ విధంగా ప్రార్థించుకోవాలి.*

## ప్రార్థన

ఓం శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్।
ప్రసన్నవదనం ధ్యాయేత్సర్వ విఘ్నోపశాంతయే॥
అయం ముహూర్తస్సుముహూర్తోస్తు॥

తదేవలగ్నం, సుదినం తదేవ, తారాబలం చంద్రబలం తదేవ।
విద్యాబలం దైవబలం తదేవ, లక్ష్మీపతే తేంఘ్రి యుగంస్మరామి॥

లాభస్తేషాం, జయస్తేషాం కుతస్తేషాం పరాభవః
యేషా మిందీవరశ్యామో హృదయస్థో జనార్దనః॥

ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదాం
లోకాభిరామం శ్రీరామం భూయోభూయో నమామ్యహం॥

సుముఖశ్చైకదంతశ్చ కపిలో గజకర్ణకః,
లంబోదరశ్చ వికటో విఘ్నరాజో గణాధిపః

ధూమకేతుర్గణాధ్యక్షః ఫాలచంద్రో గజాననః,
వక్రతుండ శ్శూర్పకర్ణో, హేరంబః స్కందపూర్వజః

అష్టావష్టౌ చ నామాని యః పఠేచ్ఛృణుయాదపి
విద్యారంభే వివాహేచ ప్రవేశ నిర్గమేతథా

సంగ్రామే సర్వకార్యేషు విఘ్నస్తస్య న జాయతే
అభీప్సితార్థ సిద్ధర్థ్యం, పూజితో యస్సురైరపి,
సర్వవిఘ్నచ్ఛిదే తస్మై గణాధిపతయే నమః॥

## ఆచమనం

*(నమస్కరించుకుని ఆచమనం చేయాలి. ఎడమచేతితో ఉద్ధరణి పట్టుకుని, నీటి పాత్ర నుంచి మూడుసార్లు నీటిని కుడిచేతిలో వేసుకుంటూ ఓం కేశవాయ స్వాహా, ఓం నారాయణాయ స్వాహా, ఓం మాధవాయ స్వాహా అంటూ నీటిని చప్పుడు కాకుండా కింది పెదవితో స్వీకరించాలి. హస్తం ప్రక్షాళ్య అంటూ ఉద్ధరణితో నీటిని తీసుకుని చేతిని కడుక్కోవాలి.)*

ఓం గోవిందాయ నమః *అంటూ ఉద్ధరణితో నీరు కుడి చేతిలోకి వేసికొని, వేరొకపాత్రలోకి వదలాలి. ఆచమనం చేసిన నీటిని పూజలో దేనికీ ఉపయోగించకూడదు. తర్వాత చేతులు జోడించి, నమస్కరించి* ఓం విష్ణవే నమః, ఓం మధుసూదనాయ నమః, ఓం త్రివిక్రమాయ నమః, ఓం వామనాయ నమః, ఓం శ్రీధరాయ నమః, ఓం హృషీకేశాయ నమః, ఓం పద్మనాభాయనమః, ఓం దామోదరాయ నమః, ఓం సంకర్షణాయ నమః, ఓం వాసుదేవాయ నమః, ఓం ప్రద్యుమ్నాయ నమః, ఓం అనిరుద్ధాయ నమః, ఓం పురుషోత్తమాయ నమః, ఓం అధోక్షజాయ నమః, ఓం నారసింహాయ నమః, ఓం అచ్యుతాయ నమః, ఓం జనార్ధనాయ నమః, ఓం ఉపేంద్రాయ నమః, ఓం హరయే నమః, ఓం శ్రీకృష్ణాయ నమః *అని చెప్పాలి. తర్వాత...*

## భూతో చ్చాటనం

ఉత్తిష్ఠంతు భూతపిశాచాః యే తే భూమిభారకాః
ఏతేషాం అవిరోధేన బ్రహ్మకర్మ సమారభే.

*అని చెప్పి ఉద్ధరణితో నీళ్లు కుడిచేతిలోకి వేసుకుని, ఆ నీటిని అన్నివైపుల చల్లాలి.*

## ప్రాణాయామం

ఓం భూర్భువస్సువః దైవీ గాయత్రీ ఛందః. ప్రాణాయామే వినియోగః

*(ప్రాణాయామం చేయాలి. నాసిక ఎడమరంధ్రం నుంచి గాలి పీలుస్తూ, గాయత్రీమంత్రాన్ని ఉచ్చరించాలి)*

ఓం భూః, ఓం భువః, ఓం సువః, ఓం మహః,
ఓం జనః తపః ఓగ్ మ్ సత్యం, ఓం తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్.
ఓమాపో జ్యోతీరసోఽమృతం

*(ఇలా మూడుసార్లు ప్రాణాయామం చేయాలి.)*

బ్రహ్మ భూర్భువస్సువరోమ్.

*(దీపారాధన చేసి ఈ విధంగా సంకల్పం చెప్పుకోవాలి)*

## సంకల్పం

ఓం మమోపాత్త సమస్త దురితక్షయద్వారా శ్రీపరమేశ్వరం ఉద్దిశ్య, శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం. శుభేశోభనే ముహూర్తే అద్య

బ్రహ్మణః ద్వితీయపరార్థే శ్వేత వరాహకల్పే వైవస్వతమన్వంతరే, అష్టావింశతి తమే, కలియుగే, ప్రథమపాదే, జంబూద్వీపే, భరతవర్షే భరతఖండే, మేరోర్దక్షిణ దిగ్భాగే, శ్రీశైలస్య... ప్రదేశే *(శ్రీశైలానికి ఏ దిక్కులో ఉంటే ఆ దిక్కు పేరు చెప్పుకోవాలి),* అస్మిన్ వర్తమానే వ్యావహారిక చాంద్రమానేన ప్రభవాది షష్టి సంవత్సరాణాం మధ్యే శ్రీవిశ్వావసు నామసంవత్సరే, దక్షిణాయనే, వర్షఋతౌ, భాద్రపద మాసే శుక్లపక్షే చతుర్థ్యాం తిథౌ సౌమ్యవాసరే యుక్తాయాం, శుభ నక్షత్రే, శుభయోగే, శుభకరణే ఏవంగుణవిశేషణ విశిష్టాయాం, అస్యాం శుభతిథౌ, శ్రీమాన్.... గోత్రః.... నామధేయః, శ్రీమతః.... గోత్రస్య..... నామ ధేయస్య *(పూజ చేసేవారు గోత్రం, పేరు చెప్పుకోవాలి. పూజకు కూర్చున్న చిన్నారుల పేర్లు కూడా చెప్పాలి)*

ధర్మపత్నీసమేతస్య అస్మాకం సహకుటుంబానాం క్షేమ స్థైర్య ధైర్య విజయాయురారోగ్యైశ్వర్యాభివృద్ధ్యర్థం, చతుర్విధ ఫలపురుషార్థ సిద్ధ్యర్థం, ఇష్టకామ్యార్థసిద్ధ్యర్థం, మనోవాంఛాఫల సిద్ధ్యర్థం, సమస్త దురితోపశాంత్యర్థం, సమస్త మంగళావాప్త్యర్థం, వర్షేవర్షే ప్రయుక్త శ్రీవరసిద్ధి వినాయకచతుర్థీ ఉద్దిశ్య, శ్రీవరసిద్ధి వినాయకస్వామిదేవతా ప్రీత్యర్థం కల్పోక్తప్రకారేణ యావచ్ఛక్తి ధ్యానావాహనాది షోడశోపచార పూజా విధానేన శ్రీవరసిద్ధి వినాయక వ్రత పూజాం కరిష్యే *(అంటూ కుడిచేతి మధ్య వేలితో నీళ్లు ముట్టుకోవాలి)* ఆదౌ నిర్విఘ్నేన పరి సమాప్త్యర్థం శ్రీగణాధిపతి పూజాం కరిష్యే, తదంగ కలశపూజాం కరిష్యే ।

## కలశపూజ

కలశం గంధ పుష్పాక్షతై రభ్యర్చ్య। తస్యోపరి హస్తంనిధాయ।

*(కలశం ఉంచేచోట పసుపుకుంకుమలు పెట్టి, దానిపై నీటి కలశాన్ని ఉంచి, ఆ కలశానికి గంధాక్షతలు పెట్టి, అందులో తులసీపత్ర పుష్పాల్ని వేసి కుడిచేతిని కలశంపై ఉంచాలి) తర్వాత..*

కలశస్యముఖే విష్ణుః కంఠే రుద్ర స్సమాశ్రితః
మూలే తత్ర స్థితో బ్రహ్మ, మధ్యే మాతృగణాస్స్మృతాః,
కుక్షౌ తు సాగరాస్సర్వే సప్తద్వీపా వసుంధరా
ఋగ్వేదోஉథ యజుర్వేద స్సామవేదో హ్యథర్వణః
అంగైశ్చ సహితాస్సర్వే కలశాంబు సమాశ్రితాః
ఆయాంతు దేవపూజార్థం దురితక్షయకారకాః

*ఈ శ్లోకం చదువుతూ ఆకును నీటిలో సవ్యపద్ధతిలో తిప్పాలి)*

ఓం గంగేచ యమునేచైవకృష్ణే గోదావరి సరస్వతి।
నర్మదే సింధు కావేరీ జలేஉస్మిన్ సన్నిధింకురు॥
కలశోదకేన పూజాద్రవ్యాణి దేవం ఆత్మానం చ సంప్రోక్ష్య

*తమలపాకుతో కలశంలోని నీటిని పూజాద్రవ్యాల మీదా, దైవం మీద చల్లి, తమ మీద కూడా కొద్దిగా చిలకరించుకోవాలి. అనంతరం పసుపు గణపతిని పూజించాలి.*

## మహాగణపతి పూజ

గణానాంత్వాం గణపతిగ్ం హవామహే,
కవిం కవీనా ముపమశ్రవస్తవమ్
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణ్యస్పత్యః
ఆనశృణ్వన్నూతిభిస్సీద సాధనం॥
శ్రీ మహాగణాధిపతయే నమః॥
ధ్యానావాహనాది షోడశోపచార పూజాం కరిష్యే

*(మధ్యవేలితో నీటిని తాకాలి)*

## ధ్యానం

ఓం శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే ॥

*అనే శ్లోకం చదువుతూ పూలూ అక్షతలూ కలిపి పసుపు గణపతి పాదాల చెంత ఉంచాలి. పూజను దేవుని పాదాల వద్ద మాత్రమే చేయాలి. శిరసుపైన పూలు కానీ అక్షతలు కానీ చల్లరాదు.*

ఓం శ్రీ మహాగణపతిం ధ్యాయామి ధ్యానం సమర్పయామి, ఓం శ్రీ మహాగణపతిం ఆవాహయామి, ఓం శ్రీ మహాగణపతే నమః ఆసనం సమర్పయామి *(పూలు, అక్షతలు వేసి నమస్కరించాలి) (తర్వాత) (ఉద్ధరణితో నీరు చూపించి అర్ఘ్యపాత్రలోకి వేస్తూ)* పాదయోః పాద్యం సమర్పయామి, హస్తయోః అర్ఘ్యం సమర్పయామి, ముఖే శుద్ధ ఆచమనీయం సమర్పయామి। *అని చెబుతూ ఉద్ధరణితో నీటిని పసుపు గణపతికి చూపించి ఆ నీటిని చిన్న పళ్లెం వేయాలి.*

*(పసుపు గణపతిని గంధం, అక్షతలు, పసుపు, కుంకుమ, పూలతో పూజించాలి. అగరువత్తులు వెలిగించి, బెల్లం లేదా పండ్లు నైవేద్యం పెట్టి షోడశోపచారపూజ చేయాలి.)*

యథాభాగం గుడం నివేదయామి।
శ్రీ మహాగణాధిపతి స్సుప్రసన్నో, సుప్రీతో, వరదో భవతు।
శ్రీ మహాగణాధిపతి ప్రసాదం శిరసా గృహ్ణామి

*అంటూ పూజ చేసిన అక్షతలు రెండు తీసుకుని తలపై ఉంచుకోవాలి.*

శ్రీ మహాగణాధిపతియే నమః యథాస్థానం ప్రవేశయామి
శోభనార్థే క్షేమాయ పునరాగమనాయచ

*అంటూ పసుపు గణపతిని కొద్దిగా తూర్పువైపుకు కదిలించి.. అక్షతలు వేసి నమస్కారం చేయాలి. మరలా ఆచమనం చేసి పైన సూచించిన విధంగా మరల సంకల్పం చెప్పుకోవాలి.*

అథ శ్రీ వరసిద్ధి వినాయక పూజాం కరిష్యే,
తదంగ ప్రాణప్రతిష్ఠాపనం కరిష్యే-

*అంటూ కుడిచేతి మధ్యవేలితో నీటిని తాకాలి*

## శ్రీ వరసిద్ధి వినాయక ప్రాణప్రతిష్ఠ

*(విగ్రహంపై పువ్వుతో కొంచెం పంచామృతాలను చిలుకరించి)*

ఓం ఆం హ్రీం క్రోం యం రం లం వం శం షం సం హం- ఇత్యాద్యేన ప్రాణప్రతిష్ఠాపనం కృత్వా, నమస్కృత్వా *(నమస్కారం చేస్తూ)* ఓం శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః

ఓం స్వామిన్! సర్వజగన్నాథ! యావత్పూజావసానకమ్
తావత్త్వం ప్రీతిభావేన బింబేஉస్మిన్ సన్నిధింకురు ॥

అవాహితో భవ, స్థాపితోభవ, సుప్రసన్నోభవ, వరదోభవ, అవకుంఠితోభవ, వరదోభవ, స్థిరాసనంకురుప్రసీదప్రసీదప్రసీద

*(అంటూ వినాయకుడివిగ్రహం పాదాలవద్ద అక్షతలు, పూలువేసి నమస్కరించాలి)*

## షోడశోపచార పూజ

భవసంచిత పాపౌఘ విధ్వంసన విచక్షణమ్।
విఘ్నాంధకార భాస్వంతం విఘ్నరాజ మహం భజే॥

ఓం ఏకదంతం శూర్పకర్ణం గజవక్త్రం చతుర్భుజమ్।
పాశాంకుశధరం దేవం ధ్యాయేత్సిద్ధి వినాయకమ్॥

ఉత్తమం గణనాథస్య వ్రతం సంపత్కరం శుభం।
భక్తాభీష్టప్రదం తస్మాత్ ధ్యాయేత్తం విఘ్ననాయకం॥

ధ్యాయేద్గజాననం దేవం తప్తకాంచన సన్నిభం।
చతుర్భుజం మహాకాయం సర్వాభరణభూషితం॥

శ్రీ వరసిద్ధి వినాయకస్వామినే నమః ధ్యాయామి ॥

(వినాయకుడి విగ్రహం పాదాల వద్ద పూలు, అక్షతలు వేసి నమస్కరించాలి)

## ఆవాహనం

ఓం అత్రాగచ్ఛ జగద్వన్ద్య సురరాజార్చితేశ్వర ।
అనాథనాథ సర్వజ్ఞ గౌరీగర్భ సముద్భవ ।
ఓం శ్రీవరసిద్ధి వినాయకస్వామినే నమః ఆవాహయామి

(మరల అక్షతలు వేయాలి)

## ఆసనం

మౌక్తికైః పుష్యరాగైశ్చ నానారత్నైర్విరాజితమ్
రత్నసింహాసనం చారుప్రీత్యర్థం ప్రతిగృహ్యతామ్
ఆసనం సమర్పయామి ॥

(అక్షతలు లేదా పూలు వేయాలి)

## అర్ఘ్యం

గౌరీపుత్ర నమస్తేఽస్తు శంకరప్రియనందన ।
గృహాణార్ఘ్యం మయాదత్తం గన్ధపుష్పాక్షతైర్యుతమ్ ॥
అర్ఘ్యం సమర్పయామి ॥

(ఉద్ధరణితో నీరును స్వామికి చూపించి పక్కన ఉంచుకున్న పాత్రలో వేయాలి)

## పాద్యం

గజవక్త్ర నమస్తేఽస్తు సర్వాభీష్టప్రదాయక।
భక్త్యాపాద్యం మయాదత్తం గృహాణ ద్విరదానన॥
పాద్యం సమర్పయామి ॥

(మరలా కొంచెం నీటిని స్వామికి చూపించి స్వామి పాదాల ముందుంచాలి)

## ఆచమనీయం

అనాథనాథ సర్వజ్ఞ గీర్వాణ గణపూజిత।
గృహాణాచమనం దేవ తుభ్యం దత్తం మయాప్రభో॥
ఆచమనీయం సమర్పయామి ॥

(కొంచెం నీటిని స్వామికి చూపించి పాత్రలో వేయాలి)

## మధుపర్కం

దధిక్షీరసమాయుక్తం మధ్వాజ్యేన సమన్వితమ్।
మధుపర్కం గృహాణేదం గజవక్త్ర నమోఽస్తుతే॥
మధుపర్కం సమర్పయామి ॥

(స్వామికి మధుపర్కాన్ని సమర్పించాలి)

## పంచామృతస్నానం

ఓం స్నానంపంచామృతైర్దేవ గృహాణ గణనాయక।
అనాథనాథ సర్వజ్ఞ గీర్వాణగణపూజిత॥
పంచామృతస్నానం సమర్పయామి ॥

(ఆవుపాలు, పెరుగు, నెయ్యి, పంచదార, తేనెలు కలిపిన మిశ్రమాన్ని ఒక పువ్వుతో అద్ది స్వామి విగ్రహంపై చల్లాలి)

## శుద్ధోదకస్నానం

ఓం గంగాది సర్వతీర్థేభ్యః ఆహృతై రమలైర్జలైః।
స్నానం కురుష్వ భగవన్నుమాపుత్ర నమోఽస్తుతే॥
శుద్ధోదకస్నానం సమర్పయామి

(కలశంలో ఉన్న నీటితో స్నానం)

## వస్త్రం

ఓం రక్తవస్త్రద్వయం చారు దేవయోగ్యం చ మంగళం।
శుభప్రదం గృహాణత్వం లంబోదర హరాత్మజ॥
వస్త్రయుగ్మం సమర్పయామి ।

(స్వామికి వస్త్రాలు లేదా ఇంట్లో పూజ చేసుకునేట్లయితే పత్తికి పసుపు, కుంకుమ రాసి దాన్ని వస్త్రంగా సమర్పించవచ్చు)

## యజ్ఞోపవీతమ్

రాజితం బ్రహ్మసూత్రంచ కాంచనంచోత్తరీయకమ్।
గృహాణ దేవ! సర్వజ్ఞ భక్తానామిష్టదాయక ॥
ఉపవీతం సమర్పయామి ॥

(యజ్ఞోపవీతాన్ని సమర్పించాలి)

## గంధం

ఓం చందనాగరుకర్పూర కస్తూరీకుంకుమాన్వితమ్।
విలేపనం సురశ్రేష్ఠ! ప్రీత్యర్థం ప్రతిగృహ్యతామ్॥
దివ్యపరిమళగంధం సమర్పయామి ।

(కొంచెం గంధాన్ని స్వామికి అలంకరించాలి)

## అక్షతలు

ఓం అక్షతాన్ ధవళాన్ దివ్యాన్ శాలీయాన్ తండులాన్ శుభాన్।
గృహాణ పరమానంద! శంభుపుత్ర! నమోఽస్తుతే॥
అక్షతాన్ సమర్పయామి ।

(స్వామికి అక్షతలు సమర్పించాలి)

## పత్రపుష్పాలు

ఓం సుగంధిని చ సుపుష్పాణి జాజీకుందముఖాని చ।
ఏకవింశతిపత్రాణి, సంగృహాణ నమోఽస్తుతే ॥
పత్రపుష్పాణి పూజయామి ।

(స్వామిని పూలతో పత్రాలతో పూజించాలి)

## అథా అంగపూజ

(కింద ఉన్న నామల్ని ఒకరు చదువుతూ ఉంటే మిగిలినవారు అక్షతలతో పూజించాలి)

| | | |
|---|---|---|
| ఓం గణేశాయ నమః | పాదౌ పూజయామి ॥ | (స్వామి పాదాలపై అక్షతలు వేయాలి) |
| ఓం ఏకదంతాయ నమః | గుల్ఫౌ పూజయామి ॥ | (మడిమలు) |
| ఓం శూర్పకర్ణాయ నమః | జానునీ పూజయామి ॥ | (మోకాళ్లు) |
| ఓం విఘ్నరాజాయ నమః | జంఘే పూజయామి ॥ | (పిక్కలు) |
| ఓం ఆఖువాహనాయ నమః | ఊరూ పూజయామి ॥ | (తొడలు) |
| ఓం హేరంబాయ నమః | కటిం పూజయామి ॥ | (నడుము) |
| ఓం లంబోదరాయ నమః | ఉదరం పూజయామి ॥ | (బొజ్జ) |
| ఓం గణనాథాయ నమః | నాభిం పూజయామి ॥ | (బొడ్డు) |
| ఓం గణేశాయ నమః | హృదయం పూజయామి ॥ | (రొమ్ము) |
| ఓం స్థూలకంఠాయ నమః | కంఠం పూజయామి ॥ | (గొంతు) |
| ఓం స్కందాగ్రజాయ నమః | స్కంధౌ పూజయామి ॥ | (భుజాలు) |
| ఓం పాశహస్తాయ నమః | హస్తౌ పూజయామి ॥ | (చేతులు) |
| ఓం గజవక్త్రాయ నమః | వక్త్రం పూజయామి ॥ | (ముఖం) |
| ఓం విఘ్నహంత్రే నమః | నేత్రే పూజయామి ॥ | (కళ్లు) |
| ఓం శూర్పకర్ణాయ నమః | కర్ణౌ పూజయామి ॥ | (చెవులు) |
| ఓం ఫాలచంద్రాయ నమః | లలాటం పూజయామి ॥ | (నుదురు) |
| ఓం సర్వేశ్వరాయ నమః | శిరః పూజయామి ॥ | (తల) |
| ఓం విఘ్నరాజాయ నమః | సర్వాణ్యంగాని పూజయామి॥ | (శరీరమంతా) |

*(అని చెప్పి, దోసిటితో పూలు తీసుకుని, వినాయకుని శిరస్సు నుండి పాదాల వరకూ పద్దేట్లుగా వేయాలి)*

## ఏకవింశతి పత్రపూజ

*(ఒక్కొక్క నామం చదువుతూ బ్రాకెట్లో పేర్కొన్న పత్రాలు తీసుకుని స్వామిని పూజించాలి)*

| | | |
|---|---|---|
| ఓం సుముఖాయ నమః | మాచీపత్రం పూజయామి | (మాచిపత్రి) |
| ఓం గణాధిపాయ నమః | బృహతీపత్రం పూజయామి | (వాకుడాకు) |
| ఓం ఉమాపుత్రాయ నమః | బిల్వపత్రం పూజయామి | (మారేడాకు) |
| ఓం గజాననాయ నమః | దూర్వాయుగ్మం పూజయామి | (రెండు గరికలు) |
| ఓం హరసూనవే నమః | దత్తూరపత్రం పూజయామి | (ఉమ్మెత్త) |
| ఓం లంబోదరాయ నమః | బదరీపత్రం పూజయామి | (రేగు ఆకు) |
| ఓం గుహాగ్రజాయ నమః | అపామార్గపత్రం పూజయామి | (ఉత్తరేణి) |
| ఓం గజకర్ణాయ నమః | తులసీపత్రం పూజయామి | (తులసి) |
| ఓం ఏకదంతాయ నమః | చూతపత్రం పూజయామి | (మామిడి) |
| ఓం వికటాయ నమః | కరవీరపత్రం పూజయామి | (గన్నేరు) |
| ఓం భిన్నదంతాయ నమః | విష్ణుక్రాంతపత్రం పూజయామి | (దింటెన) |
| ఓం వటవే నమః | దాడిమీపత్రం పూజయామి | (దానిమ్మ) |
| ఓం సర్వేశ్వరాయ నమః | దేవదారుపత్రం పూజయామి | (దేవదారు) |
| ఓం ఫాలచంద్రాయ నమః | మరువకపత్రం పూజయామి | (మరువం) |
| ఓం హేరంబాయ నమః | సింధువారపత్రం పూజయామి | (వావిలాకు) |
| ఓం శూర్పకర్ణాయ నమః | జాజీపత్రం పూజయామి | (జాజి) |
| ఓం సురాగ్రజాయ నమః | గండకీపత్రం పూజయామి | (గడ్డి తెల్లిగరిక) |
| ఓం ఇభవక్త్రాయ నమః | శమీపత్రం పూజయామి | (జమ్మి) |
| ఓం వినాయకాయ నమః | అశ్వత్థపత్రం పూజయామి | (రావి) |
| ఓం సురసేవితాయ నమః | అర్జునపత్రం పూజయామి | (మద్ది) |
| ఓం కపిలాయ నమః | అర్కపత్రం పూజయామి | (తెల్లజిల్లేడు) |
| ఓం శ్రీగణేశ్వరాయ నమః | ఏకవింశతిపత్రాణి పూజయామి. | |

*(అనంతరం శ్రీ వినాయక అష్టోత్తరశతనామాలు చదువుతూ స్వామికి పూలతో లేదా అక్షతలతో పూజ చేయాలి.)*

## -: శ్రీ వినాయక అష్టోత్తర శతనామావళి :-

*(ఈ నామాలు చదువుతూ స్వామిని పూలతోగాని, అక్షతలతో గాని పూజించాలి. ఒకరు నామాలు చదువుతుండగా మిగిలిన వారు ఓమ్ అనుకుంటూ పూజ చేయాలి.)*

ఓం గజాననాయ నమః
ఓం గణాధ్యక్షాయ నమః
ఓం విఘ్నరాజాయ నమః
ఓం వినాయకాయ నమః
ఓం ద్వైమాతురాయ నమః
ఓం ద్విముఖాయ నమః
ఓం ప్రముఖాయ నమః
ఓం సుముఖాయ నమః
ఓం కృతినే నమః
ఓం సుప్రదీపాయ నమః 10
ఓం సుఖనిధయే నమః
ఓం సురాధ్యక్షాయ నమః
ఓం సురారిఘ్నాయ నమః
ఓం మహాగణపతయే నమః
ఓం మాన్యాయ నమః
ఓం మహాకాలాయ నమః
ఓం మహాబలాయ నమః
ఓం లంబజఠరాయ నమః
ఓం హేరంబాయ నమః
ఓం హ్రస్వగ్రీవాయ నమః 20
ఓం మహోదరాయ నమః
ఓం మదోత్కటాయ నమః
ఓం మహావీరాయ నమః
ఓం మంత్రిణే నమః
ఓం మంగళస్వరాయ నమః
ఓం ప్రమథాయ నమః
ఓం ప్రథమాయ నమః
ఓం ప్రాజ్ఞాయ నమః
ఓం విఘ్నకర్త్రే నమః
ఓం విఘ్నహంత్రే నమః 30
ఓం విశ్వనేత్రే నమః
ఓం విరాట్పతయే నమః
ఓం శ్రీపతయే నమః
ఓం వాక్పతయే నమః
ఓం శృంగారిణే నమః
ఓం ఆశ్రితవత్సలాయ నమః
ఓం శివప్రియాయ నమః
ఓం ప్రముఖాయ నమః
ఓం శీఘ్రకారిణే నమః
ఓం బలాయ నమః 40
ఓం బలోత్థాయ నమః
ఓం భవాత్మజాయ నమః
ఓం పురాణపురుషాయ నమః
ఓం పూష్ణే నమః
ఓం పుష్కరోక్షిప్తవారిణే నమః
ఓం అగ్రగణ్యాయ నమః
ఓం అగ్రపూజ్యాయ నమః
ఓం అగ్రగామినే నమః
ఓం మంత్రకృతే నమః
ఓం చామీకరప్రభాయ నమః 50
ఓం సర్వస్మై నమః
ఓం సర్వోపాస్యాయ నమః
ఓం సర్వకర్త్రే నమః

ఓం సర్వనేత్రే నమః
ఓం సర్వసిద్ధిప్రసాదాయ నమః
ఓం సర్వసిద్ధయే నమః
ఓం పంచహస్తాయ నమః
ఓం పార్వతీనందనాయ నమః
ఓం ప్రభవే నమః
ఓం కుమారగురవే నమః 60

ఓం అక్షోభ్యాయ నమః
ఓం కుంజరాసురభంజనాయ నమః
ఓం ప్రమోదాత్తాననాయ నమః
ఓం మోదకప్రియాయ నమః
ఓం కాంతిమతే నమః
ఓం ధృతిమతే నమః
ఓం కామినే నమః
ఓం కపిత్థపనసప్రియాయ నమః
ఓం బ్రహ్మచారిణే నమః
ఓం బ్రహ్మరూపిణే నమః 70
ఓం బ్రహ్మవిద్యాదిదానభువే నమః
ఓం జిష్ణవే నమః
ఓం విష్ణుప్రియాయ నమః
ఓం భక్తజీవితాయ నమః
ఓం జితమన్మథాయ నమః
ఓం ఐశ్వర్యకారణాయ నమః
ఓం జ్యాయసే నమః
ఓం యక్షకిన్నర సేవితాయ నమః
ఓం గంగాసుతాయ నమః
ఓం గణాధీశాయ నమః 80

ఓం గంభీరనినదాయ నమః
ఓం వటవే నమః
ఓం అభీష్టవరదాయ నమః
ఓం జ్యోతిషే నమః
ఓం భక్తనిధయే నమః
ఓం భావగమ్యాయ నమః
ఓం మంగళప్రదాయ నమః
ఓం అవ్యక్తాయ నమః
ఓం అప్రాకృత పరాక్రమాయ నమః
ఓం సత్యధర్మిణే నమః 90

ఓం సఖయే నమః
ఓం సరసాంబునిధయే నమః
ఓం మహేశాయ నమః
ఓం దివ్యాంగాయ నమః
ఓం మణికింకిణీమేఖలాయ నమః
ఓం సమస్తదేవతామూర్తయే నమః
ఓం సహిష్ణవే నమః
ఓం సతతోత్థితాయ నమః
ఓం విఘాతకారిణే నమః
ఓం విశ్వదృశే నమః 100

ఓం విశ్వరక్షాకృతే నమః
ఓం కళ్యాణగురవే నమః
ఓం ఉన్మత్తవేషాయ నమః
ఓం అపరాజితే నమః
ఓం సమస్త జగదాధారాయ నమః
ఓం సర్వైశ్వర్యప్రదాయ నమః
ఓం ఆక్రాంతచిదచిత్ప్రభవే నమః
ఓం విఘ్నేశ్వరాయ నమః 108
ఓం శ్రీవరసిద్ధివినాయకస్వామినే నమః

అష్టోత్తరశతనామపుష్పపూజాం సమర్పయామి

*(అక్షతలు, పూలు స్వామి పాదాల వద్ద ఉంచాలి)*

## ధూపం

దశాంగం గుగ్గులోపేతం సుగన్ధం సుమనోహరమ్।
ఉమాసుత నమస్తుభ్యం గృహాణవరదోభవ॥

దివ్యపరమళధూపమాఘ్రాపయామి

*(అగరువత్తి వెలిగించి ఆ ధూపాన్ని స్వామికి చూపించి పక్కన ఉన్న స్టాండులో కాని, అరటిపండుకు కానీ గుచ్చాలి.)*

## దీపం

ఓం సాజ్యం త్రివర్తిసంయుక్తం వహ్నినా ద్యోతితం మయా।
గృహాణ మంగళం దీపం ఈశపుత్ర నమోఽస్తుతే॥

దీపం దర్శయామి

*(దీపాన్ని స్వామికి చూపించాలి)*

## నైవేద్యం

*(కొబ్బరికాయలు ఇంకా ఉంటే వాటిని తలా ఒకటి కొట్టి నైవేద్యం పెట్టాలి. అంతకు ముందు స్నానం సమయంలో కొట్టిన కొబ్బరికాయ, పిండి వంటలు, పానకం, వడపప్పు, కుడుములు, ఉండ్రాళ్లు, పులిహోర, అరటిపండ్లు మొదలైన వాటిని స్వామి ముందుంచాలి)*

సుగంధాన్ సుకృతాం శ్చైవ మోదకాన్ ఘృతపాచితాన్।
నైవేద్యం గృహ్యతాం దేవ చణముద్గైః ప్రకల్పితాన్॥

భక్ష్యం, భోజ్యం చ లేహ్యం చ చోష్యం పానీయమేవ చ।
ఇదం గృహాణ నైవేద్యం మయాదత్తం వినాయక ॥

మహానైవేద్యం సమర్పయామి

*అంటూ ఆకుతో ఆ పదార్థాలన్నింటిపైనా కొద్దిగా నీరు చల్లాలి. ఆ తరువాత స్వామికి నైవేద్యం పెట్టాలి.*

## తాంబూలం

ఓం పూగీఫలసమాయుక్తం నాగవల్లీదళైర్యుతమ్ ।
కర్పూరచూర్ణసంయుక్తం తాంబూలం ప్రతిగృహ్యతామ్ ॥

తాంబూలం సమర్పయామి...

*(మూడు తమలపాకులు, మూడు వక్కలు, పండ్లు, దక్షిణతో కూడిన తాంబూలాన్ని వినాయకుడివిగ్రహం ముందు ఉంచి నమస్కరించాలి.)*

## పుష్పం

ఓం సచ్చిదానంద! విఘ్నేశ! పుష్కలాని ధనానించ।
భూమ్యాం స్థితాని స్వీకురుష్వ వినాయక॥

సువర్ణమంత్రపుష్పం సమర్పయామి

## నీరాజనం

ఘృతవర్తి సహస్రైశ్చ కర్పూరశకలైస్తథా।
నీరాజనం మయాదత్తం గృహాణ వరదోభవ ॥

నీరాజనం సమర్పయామి

*(కర్పూరం వెలిగించి స్వామికి హారతి ఇచ్చి, ఆ తర్వాత హారతి పళ్లె పై నీటిని ఉంచి చల్లి కళ్లకు అద్దుకోవాలి)*

## మంత్రపుష్పం

*(పుష్పం, అక్షతలు తీసుకొని నిలుచొని ఈ శ్లోకాన్ని పఠించాలి)*

సుముఖశ్చైకదంతశ్చ కపిలో గజకర్ణకః
లంబోదరశ్చ వికటో విఘ్నరాజో గణాధిపః

ధూమకేతుః గణాధ్యక్షో ఫాలచంద్రో గజాననః
వక్రతుండ మహాకాయ కోటిసూర్య సమప్రభ
అవిఘ్నం కురుమే దేవ సర్వకార్యేషు సర్వదా

**ప్రదక్షిణ**

యాని కాని చ పాపాని జన్మాంతరకృతాని చ।
తాన్యే తాని ప్రణశ్యన్తి ప్రదక్షిణ పదేపదే॥

పాపోహం పాపకర్మోహం పాపాత్మా పాపసమ్భవః।
త్రాహిమాం కృపయా దేవ శరణాగతవత్సల॥

అన్యథాశరణం నాస్తి త్వమేవ శరణం మమ।
తస్మాత్కారుణ్యభావేన రక్ష రక్ష గణాధిప॥

ఆత్మప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి

*(ప్రదక్షిణ చేసి నమస్కరించాలి. సాష్టాంగప్రణామం చేయడం సంప్రదాయం) ఆ తరువాత మరలా కూర్చొని, కొన్ని అక్షతలు చేతి లోకి తీసుకోవాలి. కొంచె నీటిని అక్షతలపై వేసుకొని ఈ శ్లోకం చెప్ప కోవాలి.*

**క్షమాప్రార్థన**

యస్య స్మృత్యాచ నామోక్త్యా తపఃపూజా క్రియాదిషు
న్యూనం సంపూర్ణతాం యాతి సద్యో వందే తం గణాధిపం
మంత్రహీనం క్రియాహీనం శక్తిహీనం మహాప్రభో
యత్పూజితం మయా దేవ! పరిపూర్ణం తదస్తుతే ॥
అనయా ధ్యానావహనాది షోడశోపచారపూజ యాచ,
అష్టోత్తర నామార్చనయాచ, అవసర, మహానివేదనయాచ
భగవాన్ సర్వాత్మకః సర్వం శ్రీ మహాగణాధిపతి దేవతార్పణమస్తు.
శ్రీ మహాగణాధిపతి దేవతా సుప్రీతః సుప్రసన్నో వరదో భవతు

*అంటూ అక్షతలు, నీటిని పళ్ళెంలో వదలాలి.*

(ఈ క్రింది కథను నిదానంగా, గట్టిగా, అందరికీ అర్థమయ్యేటుగా చదవాలి.)

**శ్రీవినాయకవ్రతకథ**

*గమనిక: (కథ చెప్పడానికి ముందుగా అక్కడ ఉండే భక్తులందరికీ కొద్దిగా పూలూ, అక్షతలు ఇచ్చి, నలపకుండా ఉంచు కోండని చెప్పి, కథ పూర్తి అయ్యాక వినాయకుని పాదాలవద్ద ఉంచి, నమస్కరించాలి అని చెప్పాలి.)*

**కథ**

శ్లో॥ ఓం గురుర్ బ్రహ్మ, గురుర్ విష్ణుః గురుర్ దేవో మహేశ్వరః।
గురు స్సాక్షాత్ పరబ్రహ్మ, తస్మై శ్రీగురవే నమః॥

శ్లో॥ ఓం శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే॥

శ్లో॥ ఓం సరస్వతి నమస్తుభ్యం వరదే కామరూపిణి।
విద్యారంభం కరిష్యామి సిద్ధి ర్భవతు మే సదా॥

పూర్వం చంద్రవంశంలో "ధర్మరాజు" అనే ప్రసిద్ధికెక్కిన మహారాజు ఉండేవాడు. అతనికి దైవబలం అనుకూలించక పోవడంతో దాయాదులవల్ల రాజ్యాన్ని కోల్పోయాడు. తమ్ముళ్లను, భార్యను వెంటబెట్టుకుని అరణ్యాలకు వెళ్లాడు.

ఆ అడవిలో బ్రహ్మజ్ఞానం కల్గిన మహర్షులు తపస్సు చేస్తూ ఉన్నారు. ఆ మహాత్ముల్ని చూచి, వాళ్లకు నమస్కరించి, అక్కడుండే సూతమహాముని ఆశ్రమానికి వెళ్లాడు. ఆ మునీశ్వరునికి నమస్కరించాడు.

ఆ ముని అనుమతితో కూర్చుండి, "మహాత్మా! మా దాయాదులైన కౌరవులు మాతో మోసపు జూదమాడి, మా రాజ్యమంతా తీసుకుని, మమ్మల్నీ, ద్రౌపదినీ చాలా బాధించారు. మాకు తీరనిదుఃఖం కల్గించారు. మా అదృష్టం బాగుండి, మిమ్మల్ని దర్శించేభాగ్యం మాకు కల్గింది. మా దుఃఖం తీరిందని విశ్వసిస్తున్నాం. మమ్మల్ని కరుణించి, మాకు మరలా మా రాజ్యం వచ్చేందుకై తగినట్టి ఒక గొప్పవ్రతాన్ని అనుగ్రహించండి" అని ప్రార్థించారు.

అప్పుడు సూతమహాముని "పాండవులారా! వినండి. చెప్తాను. అన్నివ్రతాల్లో ఉత్తమమైనవ్రతం ఒకటుంది. అది మానవులకు అన్ని సంపదలూ, భోగభాగ్యాలూ, సుఖాలూ చేకూరుస్తుంది. అన్నిపాపాలనూ పోగొట్టుంది. వంశాభివృద్ధి కల్గిస్తుంది. మునుపు ఈ వ్రతాన్ని పరమశివుడు తన కుమారుడైన కుమారస్వామికి ఉపదేశించాడు. ఆ విషయాలన్నీ మీకు చెప్తాను.

ఒకప్పుడు కైలాసంలో పరమేశ్వరుణ్ణి చూచి, నమస్కరించి, కుమారస్వామి "స్వామీ! మానవులు ఏవ్రతం చేస్తే సంపదలూ, మంచి సంతానం, వంశాభివృద్ధి, ధనధాన్యాలూ, కల్గి సుఖించగలరో దయఉంచి అనుగ్రహించండి" అని ప్రార్థించాడు. శివుడు సంతోషించి," కుమారా! నీవు అడిగినవన్నీ చేకూర్చే ఒక గొప్పవ్రతం ఉంది. అది 'వినాయకవ్రతం'. ఆ వ్రతాన్ని "భాద్రపదశుక్లచవితినాడు" భక్తిశ్రద్ధలతో ఆచరించాలి.

ఈ గొప్పవ్రతాన్ని పూర్వకల్పంలో దేవతలూ, మునులూ, గంధర్వులూ, కిన్నరులూ మున్నగువాళ్లందరూ భక్తితో ఆచరించారు.

కనుక ఓ ధర్మరాజా! నీవుకూడా ఈ వినాయకవ్రతాన్ని నియమంతో ఆచరించు. నీకు జయం, రాజ్యం, సంపదలూ అన్నీ లభిస్తాయి. ఈ వ్రతాన్ని ఆచరించి, దమయంతి నలుణ్ణి భర్తగా పొందింది. శ్రీకృష్ణుడు ఆచరించి, జాంబవతినీ, శమంతకమణినీ పొందాడు. ఆ వృత్తాంతం చెప్తాను వినుము.

పూర్వం 'సత్రాజిత్తు' అనేరాజు సూర్యుని వరప్రభావంతో రోజూ ఎనిమిదిబారువుల బంగారాన్ని కల్గించే 'శమంతకం' అనే దివ్యమణిని పొందాడు. సత్రాజిత్తు తమ్ముడైన ప్రసేనుడు ఈ మణిని తనకు ఇమ్మని కోరడంతో సత్రాజిత్తు అతనికి ఇచ్చాడు.


ఆమణిని ధరించి, తన దగ్గరకు వచ్చిన సత్రాజిత్తును చూచి, మణిని తనకిమ్మని శ్రీకృష్ణుడు కోరితే అతడు ఇవ్వనని చెప్పి, వెళ్లాడు. ఇలా ఉండగా ఒకరోజు ప్రసేనుడు ఈ మణిని ధరించి, వేటకు వెళ్లాడు. అక్కడ ఒక సింహం మణిని 'మాంసం ముక్క'గా అనుకుని, వాణ్ణి చంపి, మణిని తీసుకుని పోతుండగా, అక్కడ ఒక ఎలుగుబంట్లరాజు ఆ సింహాన్ని చంపి, ఆ మణిని తీసుకుని, తన కొండగుహలో ఉయ్యాలలో పరుండి ఉండే తన కుమార్తె జాంబవతికి ఆటవస్తువుగా ఇచ్చాడు. ఆ ఎలుగబంటే జాంబవంతుడు.

ప్రసేనుని మరణాన్ని విని, సత్రాజిత్తు "కృష్ణుడే మణిని తనకీయలేదని తనతమ్ముణ్ణి చంపా"డని ప్రకటించాడు. నిజానికి చంపింది సింహం! కానీ ఆ నింద కృష్ణునిపై పడింది. నింద పోగొట్టుకోవడానికై కృష్ణుడు మణిని వెదకడం కోసం అడవికి బయలుదేరాడు. అడవిలో పడి ఉండే ప్రసేనుణ్ణీ, సింహాన్నీ చూచి, అడుగుజాడల్నిబట్టి పోగా కొండగుహను చేరాడు కృష్ణుడు. అక్కడ మణితో బంతి ఆట ఆడుకుంటున్న జాంబవతిని (జాంబవంతుని కూతుర్ని) చూచాడు. కృష్ణుడు ఆ మణిని తీసుకొంటుండగా, అంతలో జాంబవంతుడు వచ్చి, అడ్డగించాడు. ఇద్దరికీ ఇరవైఎనిమిదిరోజులు పెద్దయుద్ధం జరిగింది. జాంబవంతుడు చివరకు బలం కోల్పోయాడు. తనను ఇలా చేసినవ్యక్తి ఆనాటి శ్రీరాముడే అని గ్రహించి, "స్వామీ! తప్పు చేశాను. క్షమించండి. ఆ కాలంలో వరం కోరుకోమంటే తెలియక, మీతో ద్వంద్వయుద్ధం కోరుకొన్నాను. మీరు "భవిష్యత్తులో నీ కోరికతీర్తుంది" అన్నారు. ఆనాటి నుండీ మీ నామాన్నే స్మరిస్తూ ఇట్లున్నాను. ఈ రోజుకు నా అదృష్టంవల్ల ఈవిధంగానైనా కోరిక ఫలించింది. నా దోషాన్ని క్షమించండి" అని ఎంతగానో ప్రార్థించాడు.


అందుకు శ్రీకృష్ణుడు సంతోషించి, "జాంబవంతా! శమంతకమణిని దొంగిలించాననే నిందను తొలగించుకొనేందుకై ఇలా వచ్చాను. ఆమణిని ఇచ్చేయ్! వెళ్తాను" అన్నాడు. జాంబవంతుడు చాలా సంతోషించి, శమంతకమణితో పాటు తన కూతురు జాంబవతిని కూడా కానుకగా ఇచ్చాడు.

కృష్ణుడు శమంతకమణితో, కన్యామణితో ద్వారకా నగరానికి వచ్చి, సత్రాజిత్తును పిల్పించి, జరిగిన వృత్తాంతమంతా సభలో వివరించాడు. అంతా విన్న సత్రాజిత్తు తాను చేసిన తప్పిదానికి పశ్చాత్తాపపడి, మణితోపాటు తన కూతురు సత్య భామనుకూడా ఇచ్చాడు. కృష్ణుడు మణి తనకు అవసరం లేదని చెప్పి, సత్యభామను మాత్రం స్వీకరించి, ఒక శుభముహూర్తంలో జాంబవతీసత్యభామల్ని పెండ్లి చేసుకున్నాడు.

ఈ వినాయకచవితినాడు పాలలో చంద్రుణ్ణి చూచిన కారణంగా నింద కల్గిందనీ, లంబోదరుడైన వినాయకుణ్ణి చూచి, చంద్రుడు నవ్వగా, కోపించిన పార్వతి "చంద్రా! చవితి నాడు నీ ముఖాన్ని చూచినవాళ్లకు నిష్కారణంగా నిందలు కల్గుగాక!" అని శపించింది. చంద్రుడు బాధపడి, పార్వతిని ప్రార్థించగా "భాద్రపదశుద్ధచవితి నాడు వినాయకుణ్ణి పూజించినవాళ్లకు నిందలు తొలగుతాయి" అని,



అనుగ్రహించిన విషయం తెల్పి, ఒకనాడు ఆవులకు పాలు పిండుతూండగా ఆ పాలలో చవితి నాటిచంద్రుణ్ణి చూడడం



వల్ల తనకు ఇలాంటి నిందకల్గిందని వివరించి, తాను ఈ వినాయకవ్రతం చేయడం వల్లనే నింద తొలగి, శుభాలు పొందాననీ, ఇది మొదలు భాద్రపదశుద్ధ చవితినాడు ఒకవేళ చంద్రుణ్ణి చూచినా, ఆ రోజు పగలు వినాయక వ్రతం చేసి, ఈ శమంతకమణి వృత్తాంతాన్ని విని, అక్షతలు శిరస్సుపై తాల్చినవాళ్లకు ఎట్టి నిందలూ రావు' అనీ అనుగ్రహించాడు.

మునుపు, భగీరథుడు గంగను భూమికి... తెచ్చేటప్పుడూ, దేవతలూ, రాక్షసులూ పాలసముద్రాన్ని చిలికి, అమృతం సాధించే సమయంలోనూ, సాంబుడు తన కుష్ఠురోగాన్ని పోగొట్టుకునేందుకూ ఈ వ్రతాన్ని ఆచరించి, తమ తమ కోరికలు సాధించుకున్నారు' అని వివరించాడు.

ఇలా సూతమహాముని చెప్పిన ప్రకారం ధర్మరాజు ఈ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించి, శత్రువుల్ని సంహరించి, రాజ్యాన్ని పొంది, సుఖించాడు. ఈ దేవుణ్ణి పూజించడంవల్ల అన్నికోరికలూ నెరవేర్తాయి.

కనుక ఈ స్వామిని "**వరసిద్ధి వినాయకుడు**" అంటారు. ఈ వినాయకస్వామిని పూజించడంవల్ల విద్యార్థులకు విద్య, జయం కోరే వాళ్లకు జయం, సంతానం కోరేవాళ్లకు మంచి సంతానం, భర్తను కోరేకన్యకు మంచి భర్త, ముత్తయిదువకు సౌభాగ్యం సిద్ధిస్తాయి. విధవ పూజిస్తే పైజన్మకు వైధవ్యం రానేరాదు.

అన్ని వర్ణాలవాళ్లూ వయస్సుతో నిమిత్తం లేకుండా యథావిధిగా ఈ వ్రతాన్ని ఆచరించడంవల్ల, వినాయకుని కృపతో అన్నికార్యాలూ ఫలిస్తాయి. కొడుకులు, కూతుళ్లు, మనుమళ్లు, మునిమనుమళ్లు కల్గి, వంశం వృద్ధి చెందుతుంది. గొప్ప సంపదలు కల్గుతాయి. అన్నిరకాల ఆటంకాలూ తొలగి, అన్నిపనులూ త్వరగా విజయవంతమవుతాయి అని చెప్పాడు.

కథ పూర్తి అయ్యాక- ఒక టెంకాయకొట్టి, వినాయకునికి నైవేద్యం పెట్టి, కర్పూరహారతి ఇవ్వాలి.

## ఉద్యాపన

యజ్ఞేన యజ్ఞ మయజంత దేవాః తాని ధర్మాణి ప్రథమాన్యాసన్ తేహనాకం మహిమానః సచంతే యత్రపూర్వే సాధ్యాస్సంతి దేవాః శ్రీ మహాగణాధిపతయే నమః యథాస్థానం ప్రవేశయామి.. శోభనార్థం పునరాగమనాయచ.

*అనే మంత్రం చదువుతూ విఘ్నాధిపతిని ఈశాన్యం దిశగా కదిలించి స్వామివారికి ఉద్యాపన చెప్పకోవాలి. (నిత్యపూజ చేసి చవితి నుంచి 3, 5, 7, 9, 11 రోజుల్లో నిమజ్జనం చేసేవారు ఆ రోజున ఈ మంత్రం పఠించి ఉద్యాపన చెప్పకోవాలి.)*

అకాలమృత్యుహరణం సర్వవ్యాధినివారణం
సర్వపాపక్షయకరం శ్రీ మహాగణపతి పాదోదకం పావనం శుభమ్

*అంటూ పంచామృతాలు, కొబ్బరినీళ్లను కలిపి తీర్థంగా తీసుకోవాలి. అనంతరం పూజ చేసిన అక్షతలను పిల్లల శిరస్సుపై ఉంచాలి. పెద్దలు కూడా ఆ అక్షతలు శిరసుపై ధరించాలి.*

సర్వేజనాస్సుఖినో భవంతు
ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః

## -: ఫలశ్రుతి :-

ఈ వ్రతకథను చెప్పినవాళ్లకూ, విన్నవాళ్లకూ అనేక శుభఫలాలు వినాయకునికృపతో సిద్ధిస్తాయి.



# సత్యప్రమాణాల దేవుడు..

ఈ నెల 27న వినాయకచవితి

- శ్రీ గాజుల మంజునాథ

మన దేవాలయాలు

ఎంతటి అనారోగ్యంతో ఉన్నవారైయినా ఆ స్వామికి మొక్కుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సొంతం అవుతుంది. అడిగిన వరాలన్నీ ఇచ్చే వరసిద్ధుడు ఆయన. సత్యప్రమాణాల విలక్షణ మూర్తి. భక్తుల కొంగుబంగారంగా, నిత్యం వేలాదిమంది పూజలు అందుకుంటున్న వరప్రదాతే కాణిపాకం వినాయకుడు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరుకు 11 కిలోమీటర్ల దూరంలో ఐరాల మండలంలో కాణిపాకం గ్రామంలో పవిత్ర బాహుదా నదీతీరాన విరాజిల్లుతోంది కాణిపాకం పుణ్యక్షేత్రం. ఇక్కడ నిరంతరం పెల్లుబికే పాతాళగంగ నడుమబావిలో వినాయకుడు స్వయంభువుగా వెలిశాడు. వెయ్యేళ్లకు పైబడ్డ చారిత్రక, ఆధ్యాత్మిక, పౌరాణికనేపథ్యంతో దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన ఈ ఆలయంలో వినాయక చవితి సందర్భంగా బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి.

## స్వామి.. స్వయంభువు

బాహుదానదీతీరాన విహారపురి గ్రామంలో పూర్వం ముగ్గురు అన్నదమ్ములుండేవారు. వారు ప్రత్యేక ప్రతిభా వంతులు. వీరికి నదీతీరాన 'కాణి' (ఎకరాలో పాతికవంతు) వ్యవసాయభూమి ఉండేది. బావి నీటితో దాన్ని సాగు చేసేవారు. ఓసారి కరవుతో బావి ఎండిపోగా లోతు చేసేందుకు అన్నదమ్ములు పలుగూ పారలతో బావిలోకి దిగారు. తవ్వుతుండగా ఇసుక పొరల్లో రాయి అడ్డువచ్చింది. పలుగుపోటుకు రాయి నుంచి రక్తం స్రవించగా ఆ రక్తస్పర్శతో వారి వైకల్యాలు పోయాయి. వారి ద్వారా విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఇసుక తొలగించి చూడగా బావిలో వినాయక విగ్రహం దర్శనమిచ్చింది. పరిసర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన జనం పూజలు చేశారు. వారు కొట్టిన టెంకాయల నుంచి వచ్చిన తీర్థపు



నీళ్లతో ఆ పొలమంతా తడిచింది. తీర్థపు నీరు కాణి వైశాల్యమున్న పొలమంతా పారినందున ఆ ప్రాంతాన్ని స్థానికులు కాణిపాకంగా పిలిచారు. కాలక్రమంలో కాణిపాకం పవిత్ర పుణ్యక్షేత్రంగా ప్రాచుర్యం పొందింది. బావిలో స్వయంభువుగా వెలసిన ఇక్కడి స్వామి మూలవిరాట్టు బొజ్జ వరకే భక్తులకు దర్శనమిస్తోంది. మిగిలిన సగం బావి లోపల ఉండి బయటికి కనిపించదు. బావి చుట్టూ స్వామివారికి గర్భగుడి నిర్మించారు. బావి నుంచి నిత్యం పాతాళజలం పెల్లుబికి వస్తూ ఉంటుంది. దేవుడి అభిషేకాలకు ఈ నీటినే వినియోగిస్తున్నారు. అభిషేకం సందర్భంలో అర్చకులు బావిలో వెలసిన స్వామి వారి చుట్టూ ఉబికి వచ్చే నీటిని చూపిస్తూ ఈ క్షేత్రానికి వచ్చిన భక్తులకు స్థలమాహాత్మ్యం చెబుతారు. స్వామివారి మూలవిరాట్టు శిల్పి చెక్కినట్లుకాక స్వామి వారి ఆకారం కలిగిన సహజశిలగా కనిపిస్తుంది.

## చోళరాజు నిర్మించిన ఆలయం

కాణిపాక ఆలయానికి వెయ్యేళ్లకు పైబడ్డ చరిత్ర ఉంది. 11వ శతాబ్దంలో చోళరాజు మొదటి కుళోత్తుంగుడు ఆలయం నిర్మించగా, 14వ శతాబ్దంలో విజయనగర రాజులు అభివృద్ధి పరిచారు. కాణిపాకంలో చోళ, పాండ్య, గంగరాజులకు సంబంధించిన మూడు శాసనాలు లభించాయి. చోళశాసనంలో







కాణిపాకం 'కావణి పాక్కం'గా పేర్కొన్నారు. కాణిపాక దేవస్థానానికి వరదరాజస్వామి, మణి కంఠేశ్వరాలయాలు అనుబంధంగా ఉన్నాయి. ఇవి ప్రాచీనమైనవి.

వినాయకుడి ఆలయంలో వీరాంజనేయస్వామి ఉపాలయం ఉండగా, మణి కంఠేశ్వరాలయంలో మహా గణపతితో పాటు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కొలువదీరారు. వరదరాజస్వామి గుడిలో శ్రీదేవి, భూదేవీ సమేత వరద రాజస్వామి వెలిశారు. దీంతో కాణిపాకం అద్వైతక్షేత్రంగా పేరు తెచ్చుకుంది. 1982 సం॥లో ఇక్కడ నిత్యాన్నదానం మొదలైంది. కాణిపాక ఆలయం సత్యప్రమాణాలకు ప్రసిద్ధి. ఆలయంలో ప్రమాణం చేసే భక్తులు మాట తప్పే సాహసం చేయరు. అందువల్ల తాగుడు, జూదం, వివాహేతర సంబంధాలు, దొంగ తనాలువంటి వ్యసనాలకులోనైన వారిని కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులు ఇకపై అలా చేయబోమంటూ ఆలయంలో ప్రమాణం చేయిస్తుంటారు.

## బాహుదా నదికి పురాణనేపథ్యం

కాణిపాక క్షేత్రాన్ని స్పృశిస్తూ ప్రవహించే బాహుదా నది కూడా ఎంతో మహిమాన్వితమైంది. పురాణాల్లోని శంఖలిఖితులనే సోదరుల వృత్తాంతం దీన్ని బలపరుస్తోంది. పూర్వం శంఖుడు, లిఖితుడు అనే విప్రసోదరులుండేవారు. దొంగతనానికి పాల్పడ్డ వారి చేతులను రాజు నరికించేశాడు. పశ్చాత్తాపంతో, బాధతో అల్లాడుతున్నవారు కాణిపాక క్షేత్రదర్శనానికి వెళ్ళి బాహుదానదిలో స్నానమాచరించారు. పవిత్రనదీ జలాలమహిమ కారణంగా వారికి పోయిన బాహువులు తిరిగొచ్చాయి. కోల్పోయిన బాహువులను తిరిగిచ్చిన నది కనుకే బాహుదా అన్న పేరొచ్చిందనే కథ ఇక్కడి జనంనోళ్లలో నానుతోంది.

## 10 కోట్ల వ్యయంతో పునర్నిర్మాణం

వరసిద్ధి వినాయకస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మించారు. పాత ఆలయాన్ని పూర్తిగా తొలగించి రాతి కట్టడం నిర్మించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన శిల్పకళ అందరిని ఆకట్టుకుంటోంది. పురాతన ఆలయాన్ని పోలిన విధంగా ఆలయాన్ని నిర్మించారు. దీంతో ఆలయ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. 2021 ఆగస్టు 4వ తేదీన ఆలయంలో నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఆగస్టు 21న ఆలయ మహాకుంభాభిషేకాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయనిర్మాణ సమయంలో హోమగుండం పక్కన బాలాలయాన్ని నిర్మించి అత్తిచెక్కపై స్వామి ప్రతిమను శిల్పులతో చెక్కించి ప్రాణప్రతిష్ఠ చేసి ఆరునెలలపాటు భక్తులకు దర్శనం కల్పించారు. కుంభాభిషేకం నిర్వహించిన రోజు నుంచి భక్తులకు మూలవిరాట్ దర్శనాన్ని కల్పించారు.

## రాజగోపురం... వర్ణశోభితం

కాణిపాక వరసిద్ధుని ఆలయానికి ప్రతి సంవత్సరం ఏకవర్ణం వేసేవారు. 2022 సం॥ నుండి మొట్టమొదటిసారిగా పంచరంగులు వేశారు. దీంతో ఆలయానికి శోభ చేకూరింది. వరసిద్ధుని ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలను కూడా రంగులతో అలంకరించారు.

వరసిద్ధుని దర్శనార్థం ఆలయానికి విచ్చేసే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండటంతో స్వామి దర్శనానికి వెళ్లే భక్తులు ఇబ్బందుల పడకుండా ఉండేందుకు తిరుమల తరహాలో క్యూ కాంప్లెక్సు ఏర్పాటు చేశారు. స్వామి దర్శనానికి ఎక్కువ సమయం పడితే వృద్ధులు, మహిళలు, చిన్నారులు అవస్థలు పడకుండా ఇక్కడ సేదతీరడానికి వీలుంటుంది. అలాగే ప్రధాన ఆలయంలోకి వీవీఐపీలు వెళ్లే సమయంలో సామాన్య భక్తులు ఇబ్బందిపడకుండా వారి కోసం ఉత్తరద్వారం ద్వారా క్యూలైను ఏర్పాటు చేశారు. దీంతో సామాన్య భక్తులకు దర్శన సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు శాశ్వతంగా తీరిపోయాయి.



ఈ నెల 23న పోలాల అమావాస్య...

# పిల్లలు బాగుంటే చాలు...

- శ్రీమతి కె.యస్.యల్.కె. చైతన్యశ్రీ

ఆంధ్రదేశంలో శ్రావణబహుళ అమావాస్యను పోలాల అమావాస్యగా పరిగణిస్తారు. గోదావరిజిల్లాలో ప్రజలు పోలాలమావాస్యగా కీర్తిస్తారు. ఈరోజున గోదావరినది పొంగి పొర్లుతూ, పరవళ్లుతొక్కుతుంది. ఇది గోదావరిప్రజల విశ్వాసం. ఇది మహిళలు తమపిల్లల ఆరోగ్యం, సంక్షేమం కోసం జరుపుకునే పండుగ. ఈ రోజున మహిళలు ఉపవాసం ఉంటారు. ప్రార్థనలు చేస్తారు.

పోలాల అమావాస్యరోజున తెల్లవారుఝామునే నిద్ర లేచి, శుచియై ఈ రోజు పోలాల అమావాస్యపూజను చేస్తానని మనసులో సంకల్పించుకోవాలి. పూజ పూర్తి అయ్యేవరకు ఉపవాసం ఉండాలి. పూజామందిరాన్ని శుభ్రంచేసి, నిత్య పూజను యథావిధిగా పూర్తి చేసుకోవాలి. అనంతరం పూజ గదిలో కందమొక్కను ఉంచాలి. ఆ మొక్కకు తొమ్మిది పసుపు కొమ్ములు కట్టాలి. ముందుగా వినాయకుడిని పూజించి, ఆ తర్వాత కందమొక్కలోకి మంగళగౌరీదేవి లేదా సంతాన లక్ష్మిని ఆవాహనం షోడశోపచారాలతో పూజలు చేయాలి. ఐదు రకాల పిండివంటలను నైవేద్యంగా సమర్పించాలి. పూజ పూర్తయిన తర్వాత ముత్తైదువులకు వాయనం ఇవ్వాలి.

పూజించిన కందమొక్కను ఇలా చేయాలి- పోలాల అమావాస్య మరుసటిరోజు పూజించిన కందమొక్కను ఇంటి ఆవరణలో, పూలకుండీల్లో నాటాలి. ప్రతిరోజూ నీళ్లుపోస్తూ మొక్కను సంరక్షించాలి. కొద్దిరోజులకు ఈమొక్క ప్రక్కనే మరికొన్ని పిలకలు వస్తాయి. అలా రావడం శుభసూచకం. కందమొక్కకు పిలకలు వస్తే సంతానం లేనివారికి సంతానం కలుగుతుంది. అలాగే సంతానం అభివృద్ధిలోకి వస్తుంది.

పోలాల అమావాస్య రోజు తులసిమొక్కకు ప్రదక్షిణ చేస్తే కష్టాలు, దుఃఖాలు తొలగిపోయి జీవితంలో సుఖ సంతోషాలు లభిస్తాయి.

ఆంధ్రదేశంలో గ్రామీణప్రజల ప్రధానవృత్తి వ్యవసాయం. ఈకార్యకలాపాలకు శుభప్రదంగా భావించే రోజు 'పోలాలఅమావాస్య'. రైతులకు అత్యంత ముఖ్యమైన పండుగ రోజు ఇది. వ్యవసాయదారులు శ్రావణ మాస చివరిరోజుల్లో పోలాల అమావాస్యను జరుపుకుంటారు. హనుమాన్, పోచమ్మ ఆలయాలచుట్టూ ప్రదక్షిణలు చేసి ఇంట్లో పిండిపదార్థాలతో కూడిన నైవేద్యాన్ని సమర్పిస్తారు. ముఖ్యంగా బసవేశ్వరుని రూపంలో ఉన్న ఎద్దులను కొలుస్తూ ఆతిథ్యాన్ని అందజేస్తారు. పోలాల అమవాస్యను 'రైతుల అమావాస్య'గా, 'వ్యవసాయ అమావాస్య'గా కూడా పిలుస్తారు.


ఒక రోజు పార్వతీదేవి శివునితో "నిరంతరం భక్తుల పూజలందుకునే నీవు.. నీ నందివాహనునికి కూడా పూజలందుకునే అవకాశాన్ని కల్పించలేకపోయావా?" అని కోరిందట, అప్పుడు శ్రావణమాసం చివరిరోజైన అమావాస్య నాడు పోలాల అమావాస్య పేరున బసవన్నలను పూజించుకునే వరాన్ని ప్రసాదించాడు శివుడు. పోలాల అమావాస్య రోజు నందీశ్వరుణ్ణి పూజిస్తే సాక్షాత్తు ఆ శివపార్వతులు ఆశీర్వదిస్తారని రైతుల ప్రగాఢ విశ్వాసం.

పోలాల అమావాస్య ముఖ్యంగా మూడురోజుల పండుగ. మొదటిరోజు ఉప్పులు. రైతుకు అండగా వెన్నుదన్నుగా నిలుస్తున్న ఎద్దులను "ఉప్పులరోజు" ఉదయాన్నే కొమ్ములు సరిచేసి సాయంత్రం నాలుకపై ఉప్పును రాసి, తినిపిస్తారు. కలుపుమొక్కలు, పసరుగడ్డి మొదలైనవి తిని, వాటి నాలుక మొద్దుబారిపోయి ఉంటుంది. ఉప్పు తినిపించడం ద్వారా నాలుక అంతా శుభ్రం అవుతుంది. పూజచేసి, వాటి నాలుక, వీపుపై పసుపురాసి మంచినూనె త్రాగిస్తారు. ఎంతో బరువులను మోసిన ఎద్దుల బరువులను తగ్గించడమే ఉప్పుల పండుగ ప్రాధాన్యత,

ఉప్పు తినిపించడం వల్ల వాటి జీర్ణాశయంలో పేరుకుపోయిన మలినాలను పూర్తిగా తొలగుతాయి. నూనె తాగించడంతో జీర్ణశయాన్ని మామూలుస్థితికి తీసుకురావడం,

అలాగే పసుపు ఆంటీబయోటిక్‌గా పనిచేయడం వంటి శాస్త్రీయ అంశాలు కూడా ఉప్పులపండుగలో దాగి ఉన్నాయి.

రెండవరోజు బసవన్నపండుగ. ఈరోజున ఎద్దులకు స్నానాలు చేయించి, కొమ్ములకు రంగులువేసి, బుగ్గలు, రంగురంగుల కాగితాలతో కొమ్ములను, గంటలు, గజ్జెలు,



గుగ్గర్లతో వాటి గంగడోలును అలంకరిస్తారు. గ్రామంలో ప్రజలంతా ఒక చోట చేరుతారు. గ్రామపెద్ద ఇంటినుండి ఊరేగింపుగా డప్పువాయిద్యాలతో రైతులంతా సామూహికంగా బసవన్నలతో బయలుదేరి గ్రామంలోని దేవాలయాల చుట్టూ "హరహర మహాదేవ శంభోశంకర" అంటూ మహాదేవుని నామస్మరణ చేస్తూ ప్రదక్షిణాలు చేస్తారు.

తదనంతరం ఇళ్లవద్ద ప్రత్యేకంగా వండిన పిండి వంటలను, తాంబూలాలను నైవేద్యంగా సమర్పించుకుంటారు. పాలేరులకు కొత్తబట్టలు, డబ్బులను కృతజ్ఞతగా సమర్పించుకుంటారు.

మూడవరోజు 'బొడిగె'. శాస్త్రీయంగా బొడిగెను పరిశీలిస్తే శ్రావణమాసంలో అధికంగా వర్షాలు కురుస్తాయి. మరికొన్ని ప్రాంతాల్లో పోలాల అమావాస్య రోజును మాతృదినోత్సవంగా జరుపుకుంటూ "కందమొక్క"ను పూజించడం శుభప్రదం అని భావిస్తారు.

ఈ సందర్భంలో చెప్పబడే పౌరాణికగాథ ఒకటి కలదు. పూర్వం అంధకాసురుడు బ్రహ్మను గూర్చి తపస్సు చేసి అనేకవరాలు పొందాడు. వరగర్వంచేత అతడు ఒకసారి పార్వతినే కామించాడు. శివుడు భూలోకానికి వెళ్లిన వేళ కనిపెట్టి అంధకాసురుడు పార్వతి వద్దకు వెళ్లి తన దుష్ట చింతనను తెలిపాడు. అది చూచి వాకిట కావలి కాచు నంది ఆ అసురునితో యుద్ధానికి తలపడ్డాడు. ఇంతలో శివుడు వచ్చి అంధకాసురుని హతమార్చాడు. ఈ సందర్భంలో తనకు చేసిన ఉపకారానికి మెచ్చి శివుడు ఆతణ్ణి ఏదైనా వరం కోరుకోమన్నాడు.

అప్పుడు నందీశ్వరుడు ఈ విధంగా కోరుకున్నాడు. "శిలాదుడు పొలం దున్నుతుండగా ఆదివృషభరూపాన అతనికి నేను దొరికిన రోజు శ్రావణ బహుళ అమావాస్య, కనుక ఆనాడు వృషభపూజ రైతులు చేస్తే ఫలప్రదమయ్యేట్లు అనుగ్రహింప వలసింది." అని కోరాడు. శివుడు సరేనని వరాన్ని అనుగ్రహించాడు.

## నారాయణగిరిలో ఛత్రస్థాపనోత్సవం

**(2025, ఆగష్టు 06వ తేది)**

**ప్రతి సంవత్సరం సౌరమాన ఆషాఢమాసం శుద్ధ ఏకాదశీ సందర్భంగా మరునాడు శుద్ధద్వాదశి రోజున ఈ ఉత్సవం జరుగుతుంది. ఆనాడు ఉదయం శ్రీవారి ఆలయం నుంచి బాజాభజంత్రీలతో శ్రీవారి అర్చకులు, వేదపండితులు, ప్రసాదాలతో, ఛత్రచామరాలతో బయలుదేరి నారాయణగిరి పర్వతంపైన వెలసిన శ్రీవారి దివ్యపాదపద్మాల సన్నిధికి చేరుకుంటారు.**

**మహావైకుంఠం నుండి వచ్చి భూలోక వైకుంఠమైన ఈ క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరుడు మొట్టమొదట ఈ పర్వతంపై కాలుమోపాడు. ఈ పర్వతంపై వెలసిన శ్రీనివాసుని దివ్యపాదపద్మాలకు అభిషేకాది అలంకార అర్చనలు, నివేదనాదులు అయిన తర్వాత రెండు భూచక్ర గొడుగులను అక్కడి స్తంభాలకు గాని, చెట్లకుగాని కట్టి వస్తారు. అక్కడ చేరిన భక్తులకు ప్రసాదవితరణ జరుగుతుంది.**

ధారావాహిక



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు

ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్
తెలుగు- శ్రీదేవీ మురళీధర్
97388 59553

*గత సంచిక తరువాయి భాగం....*

సన్యాసి కావాలనుకున్నవారు, గురువు లేనప్పుడు, ఈ వేదపుష్కరిణికి వచ్చి కొత్త కాషాయవస్త్రాన్ని, త్రిదండాన్ని ధరిస్తారు. శ్రీవైష్ణవసంప్రదాయానికి చెందిన ఏ యతి అయినా మేల్కోటేలో ఈ పవిత్రస్థలాన్ని సందర్శించి, దానిపై కొత్త కాషాయవస్త్రాన్ని ఉంచి, అక్కడ ప్రార్థన చేసిన తరువాత మాత్రమే దాన్ని ధరిస్తారని చెబుతారు.

స్వర్గలోకయాత్రికులు వేదపుష్కరిణి ప్రస్తుతస్థితిని చూసి జాలిపడి తమలో తాము మాట్లాడుకుంటారు. ఏదో ఒక రోజు ఎవరైనా సత్పురుషులు ఈ స్థలాన్ని సందర్శించి పవిత్ర పుష్కరిణిని, స్థలాన్ని పునరుజ్జీవింపజేస్తారని, రామానుజులు శ్వేతవస్త్రాలను విడిచి, మేల్కోటేలో కాషాయాన్ని ధరించిన స్మృతిని ఏటా ఒక ఉత్సవంగా జరుపుతారని చెప్పుకుంటారు.

## తిరునారాయణపురంలో యోగనరసింహ సన్నిధి

నారదుడు, గంధర్వులు శ్రీకరస్వామిబృందంలో చేరారు. శ్రీకరస్వామి నారదునికి నమస్కరిస్తాడు. అప్పుడు నారదుడు తాము అష్టతీర్థాలను సందర్శించినట్లు చెప్పగా విని, శ్రీకర స్వామి చాలా సంతోషించాడు. అప్పుడు వారందరూ ముందుగా యోగనరసింహాలయానికి వెళ్లి, తరువాత శెల్వపిళ్లై, పేశుమ్ యతిరాజర్ దర్శనానికి తిరిగి రావాలని నిర్ణయించుకున్నారు.

అందరూ నరసింహ కరావలంబస్తోత్రం, మంత్రరాజ పదస్తోత్రం, సుదర్శనాష్టకం మొదలైన వాటిని పఠిస్తూ యోగ నరసింహాలయం 360 మెట్లు ఎక్కడం ప్రారంభించారు. కొంత మంది వృద్ధులు మూడువందల మెట్లు ఎక్కిన తర్వాత బాగా అలసిపోయి ముందుకు ఎక్కలేకపోయారు; అప్పుడు నారదుడు, గంధర్వుడు ఆహా, ఈ ఇద్దరూ తమ మంత్రశక్తి ద్వారా వృద్ధులు ఆలయం వద్దకు చేరుకునేటట్లు చెయ్యగా, ఇతరులకు మాత్రం అది శ్రీప్రహ్లాదరక్షకుని నామాన్ని పఠిస్తూ వృద్ధులందరూ ఎంతో ఉత్సాహంగా మెట్లెక్కి నడుస్తున్నట్లు కనిపించింది. వారందరూ పైకి చేరుకోగా యోగనరసింహ దేవాలయం ప్రధాన అర్చకుడు శ్రీనారాయణభట్టర్‌వారికి స్వాగతం పలికాడు. యోగభంగిమలో గంభీరంగా కూర్చున్న యోగనరసింహమూర్తి కన్నులపండువగా ఉన్నాడు. శ్రీనారాయణభట్టర్ కర్పూరహారతి ఇచ్చారు, అందరూ చక్కగా దర్శనం చేసుకున్నారు.

ఈ యోగ నరసింహుని ప్రతిష్ఠ సాక్షాత్తు ప్రహ్లాదుడే స్వయంగా నిర్వహించాడు. హైదర్ అలీ ఈ ఆలయానికి ఢక్కను విరాళంగా ఇచ్చాడు. ఒక ముస్లిం రాజు హిందూదేవాలయానికి విరాళం ఎలా ఇచ్చాడని ఆశ్చర్యం. హైదర్ అలీ సైన్యంలో ఉన్న ఏనుగులన్నీ యుద్ధంలో జబ్బుపడ్డాయి. హైదర్ అలీ సలహాదారులు వాటిని నయం చేయమని మెల్కోటే నరహరిని ప్రార్థించమని సలహా ఇవ్వగా ఆయన కూడా హృదయపూర్వకంగా నరసింహుని ప్రార్థించాడు. అతని ఏనుగులన్నిటికీ వెంటనే జబ్బు తగ్గిపోయింది. కృతజ్ఞతతో ఆయన ఆలయానికి ఎన్నో విరాళాలు ఇచ్చాడు. ఒక ప్రత్యేక ఢక్క (నగారా అని పిలుస్తారు) కూడా విరాళంగా ఇచ్చాడు; ఈ రోజుకు కూడా, దాన్ని ప్రవేశద్వారం వద్ద చూడవచ్చు. ప్రతిరోజూ చివరి అర్ధ ఝాముపూజ(చివరిపూజ) సమయంలో, డప్పు శబ్దం మేల్కోటే పట్టణంలో ప్రతిధ్వనిస్తూ ప్రతి ఒక్కరికీ అర్ధఝాము పూజ జరుగుతోందని, ఆ రోజుకి ఆలయం మూసివేస్తున్నారని తెలియజేస్తుంది. *(ఇంకా ఉంది)*

# సౌభాగ్యాన్నిచ్చే శ్రావణశోభ

- శ్రీమతి పి. రమాదేవి


శ్రావణమాసం అంటేనే సందడి చేసే మాసం, ఎక్కడ చూసినా మంగళతోరణాలూ, మంగళవాయిద్యాలే. శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమికి ముందువచ్చే (రెండవ) శుక్రవారాన్ని వరలక్ష్మీ వ్రతంగా జరుపుకోవడం అనాది సంప్రదాయం.

ప్రతిమాసం పౌర్ణమి రోజున ఏ నక్షత్రం ఉంటే ఆ నెలకు ఆ నక్షత్రం పేరు పెట్టడం జరిగింది. శ్రీమహావిష్ణువు జన్మనక్షత్రం కూడా శ్రవణమే, శ్రీవారికి ఇష్టమైన జన్మనక్షత్రం శ్రవణంకాబట్టి ఇది శ్రావణమాసమైంది. అంటే పౌర్ణమి రోజున శ్రవణానక్షత్రం ఉండటం వల్ల శ్రావణమాసమైంది. శుక్రవారం నాడు వరలక్ష్మీదేవిని పూజిస్తే అష్టలక్ష్ములకు పూజలు చేసినంత ఫలం లభిస్తుందని హైందవ మహిళల నమ్మకం. అంతేకాదు అష్టైశ్వర్యాలు లభిస్తాయని ప్రగాఢ విశ్వాసం. అష్టలక్ష్ముల్లో వరలక్ష్మీదేవికి ఓ ప్రత్యేకత ఉంది, మిగిలిన లక్ష్మీపూజలకంటే వరలక్ష్మీపూజ శ్రేష్ఠం. శ్రావణమాసంలో ఈ వ్రతాన్ని చేస్తే విశేష ఫలితాలు లభిస్తాయి. సర్వమంగళప్రాప్తి. సకలాభీష్టాల కోసం, నిత్యసుమంగళిగా ఉండాలని కాంక్షిస్తూ స్త్రీలు ఈ వ్రతం చేస్తారు. దక్షిణ భారతదేశంలో ఈ వరలక్ష్మీ వ్రతాన్ని వివిధసంప్రదాయాల్లో ఆచరిస్తారు. ఎవరు ఏ పద్ధతులు పాటించినా శ్రీలక్ష్మిని కొలిచే తీరు మాత్రం అందరిదీ ఒక్కటే, సకల శుభకర మైన, మంగళదాయకమైన ఈ వరలక్ష్మీదేవి పూజ జగదానంద కరమైంది.

ఎవరైతే అష్టలక్ష్మి పూజాదికాలు చేస్తారో, వారు ఆయా లక్ష్మీప్రసన్నతచే తమ కోరికలు పొందుతారని శాస్త్రవచనం. "ధనం మూలం ఇదం జగత్" అన్న వాక్యం అందరికీ తెలిసిందే. మానవుడు తన నిత్య ఆరాట పోరాట వ్యవస్థలో జీవనమస్తకానికి ధనమే కదా! మూలమైంది. లక్ష్మీకటాక్ష సిద్ధికోసం ఆ జగన్మాతను, విష్ణుపత్నిని ఆరాధించడం అవశ్యమని భారతీయశాస్త్రాలు చెబుతున్నాయి.

శ్రీమహాలక్ష్మి ఆసనం కమలం. కమలం ఆసనంగా కలది కనుక ఆమెను 'కమలాసని' అన్నారు. నిజానికి ఈమె ఆదిశక్తి. ఈ ఆదిశక్తియే సముద్రగర్భంనుండి లక్ష్మీరూపంగా అవతరించి, విష్ణు మూర్తికి వామాంగంలో స్థానం ఇచ్చింది. ఆమె తన భర్తను నిరంతరం సేవిస్తూ ఉంటుంది. ఆమె ప్రాణం శ్రీయంత్రంలో ఉంటుంది. ఎవరైతే శ్రీయంత్రాన్ని లేదా విష్ణుమూర్తిని పూజిస్తారో అనగా శ్రీసూక్తం పఠిస్తారో, పూజిస్తారో వారిపై శ్రీలక్ష్మీదేవి కృప ఉంటుంది. లక్ష్మీదేవికి సంబంధించిన స్తోత్రాలలో సర్వాధిక మహిమాన్వితమైన శ్రీసూక్తం ఐహికవాంఛలను నెరవేర్చడానికి, సౌభాగ్యప్రాప్తికి అమోఘమైన సాధనం-శ్రీయంత్ర పూజ మనో వాంఛలు సిద్ధింపచేస్తుంది. ఈ శ్రావణమాసంలో వరలక్ష్మీదేవిని శ్రీసూక్తతత్వంతో ధ్యానిస్తే సకలఫలసిద్ధి కలుగుతుంది.

మొదటి మనువైన స్వాయంభువ మనువుకాలంలో శ్రీమహాలక్ష్మి భృగుమహర్షి పుత్రికగా జన్మించింది. ద్వితీయ మనువు స్వారోచిషుని కాలంలో శ్రీమహాలక్ష్మి అగ్నితత్వంగా ప్రకాశించింది. మూడవ మనువు ఉత్తమమనువు పాలనలో శ్రీ మహాలక్ష్మి జలతత్త్వం పొంది నీటినుండి ఉద్భవించింది. సర్వ శక్తులను తనశక్తిలో ఇముడ్చుకున్న జలం సాక్షాత్తూ శ్రీమహా లక్ష్మి స్వరూపం. నాల్గవ మనువు తామసమనువు ఈ ప్రపంచాన్ని పరిపాలించిన సమయంలో శ్రీమహాలక్ష్మి భూతతత్త్వంతో భూదేవిగా అవతరించింది. అయిదవ మనువు రైవతమనువు



కాలంలో బిల్వవృక్షస్వరూపిణిగా ఆవిర్భవించింది. ఆరవమనువు చాక్షుషమునువుకాలంలో శ్రీమహాలక్ష్మి కమలంలో ఆవిర్భవించి కమలరూపిణి అయినది. ప్రస్తుతం జరుగుచున్న వైవస్వత మనువు కాలంలో పాలసముద్రం నుంచి చంద్రసహోదరిగా ఆవిర్భవించి, తనను నమ్మికొలిచిన వారందరికీ సర్వసౌభాగ్యాలను ప్రసాదిస్తోంది.


కనుక స్త్రీలు దీర్ఘకాలం సుమంగళిగా ఉండేందుకు వర లక్ష్మీవ్రతం ఆచరించడం తప్పనిసరి. లక్ష్మీదేవి సంపదలనిచ్చే తల్లి. సంపదలంటే కేవలం ధనం మాత్రమేకాదు, ధాన్యసంపద, పశు సంపద, గుణసంపద, జ్ఞానసంపద మొదవైనవి ఎన్నో ఉన్నాయి.

“వర” అంటే శ్రేష్ఠమైన అనే అర్థం కూడా ఉంది. భక్తితో వేడుకుంటే వరాలందించే తల్లి వరలక్ష్మి. నిశ్చలమైన భక్తి, ఏకాగ్రచిత్తంతో చేసే వరలక్ష్మీవ్రతం ఎంతో మంగళకర మైంది. ఈ వ్రతాన్ని చేయడంవల్ల లక్ష్మీదేవి కృపాకటాక్షాలు కలిగి ఐశ్వర్యం సిద్ధిస్తుంది..

పరమేశ్వరుడు వరలక్ష్మీవ్రతం గురించి పార్వతికి వివ రించినట్లు స్కాందపురాణం చెబుతోంది. ఆ కథ “పూర్వకాలంలో చారుమతి అనే ఒక స్త్రీ తన భర్తయందు ఆదరాన్నీ, అత్తమామలపట్ల గౌరవాన్నీ ప్రకటిస్తూ ఉత్తమ ఇల్లాలుగా తన బాధ్యతల్ని నిర్వహిస్తూ ఉండేది. ఆమెకు మహాలక్ష్మి అంటే ప్రాణం. భక్తిశ్రద్ధలతో ఆ తల్లిని కొలిచేది, త్రికరణశుద్ధిగా ఆరాధించేది. ఒకనాడు చారుమతికి స్వప్నంలో లక్ష్మీదేవి దర్శనమిచ్చింది. శ్రావణమాసశుక్లపక్షపూర్ణిమకు ముందుగా వచ్చే శుక్రవారాన తనను ఆరాధిస్తే కోరిన వరాలనిస్తా నని ఆమెకు అభయమిచ్చింది. ఆ దేవి ఆదేశానుసారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి చారుమతి సమస్త సిరిసంపదలు పొందింది” అని శివుడు పార్వతికి చెప్పాడు.

ఏపూజచేసినా ముందు గణపతిని పూజించాలి. పసుపుతో గణపతిని చేసి పూజించి తర్వాత కలశంలోకి వరలక్ష్మీదేవిని ఆవాహనం చేసి షోడశోపచారపూజ చేసిన తర్వాత అథాంగపూజ చేయాలి. ఆ తర్వాత అష్టోత్తరశత నామపూజ చేయాలి. పిదప ధూప, దీప, నైవేద్యాలను, తాంబూలాన్ని సమర్పించాలి. కర్పూర నీరాజనం, మంత్రపుష్పం సమర్పించి మంగళహారతి ఇవ్వాలి. తర్వాత తోరగ్రంథి పూజ చేసి తోర బంధన మంత్రం పఠిస్తూ ఆ నవసూత్రాన్ని కుడిచేతికి కట్టుకోవాలి. చివరగా వాయనదాన మంత్రం పఠిస్తూ, ముత్తైదువను పిలిచి, మహాలక్ష్మిగా భావించి, ఆమెకు వాయన దానమియ్యాలి. తిరిగి రెండోరోజు అమ్మవారికి పునఃపూజ చేసి నమస్కరించుకోవాలి. ఇంతటితో వరలక్ష్మీవ్రతం పూర్తవుతుంది.

విశ్వదాభిరామం     వేమన పద్యసూక్తి



## చెప్పడుమాటలు వినరాదు

ఆలిమాటలు విని అన్నదమ్ముల రోసి
వేరుబడెడువాడు వెర్రివాడు
కుక్కతోక బట్టి గోదావ రీదునా
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** రోసి= విడిచి; వేరుబడెడువాడు= పంచుకొని ప్రక్కకు వెళ్లేవాడు; వెర్రివాడు= పిచ్చివాడు.

**భావం:** భార్యమాటలు విని అన్నదమ్ముల్ని విడిచి, వేరు కాపురం పెట్టుకునేవాడు వెర్రివాడు. అలాంటి వేరుకాపురం కుక్కతోకబట్టుకుని గోదావరి ఈదినట్లుంటుంది.

**వివరణ:** కుటుంబంలో అందరూ కలిసి ఉంటే అందరికీ సుఖం. భార్యమాటలు విని అయినవాళ్లను వదిలి విడిగా వెళ్లిపోతే అది మూర్ఖత్వం అవుతుంది. తెలివికలవాడు ఆ పని ఎప్పుడూ చేయడు. కుక్క నీళ్లలో కొంతవరకు ఈదగలదు. దానికి ఈదేశక్తి ఉంది కదా అని దాని తోకను పట్టుకుని గోదావరినదిలో ఈ ఒడ్డు నుండి ఆ ఒడ్డుకు వెళ్దామనుకుంటే అది జరగదు. అలాగే భార్య మాట విని కుటుంబం విడిచివెళ్తే బ్రదుకుసాగదు. ఆలిమాట అని మాట వరసకు చెప్పినా, చెప్పుడుమాటలు విని కష్టాలు కోరితెచ్చుకోగూడదు. ఆలోచించి వ్యవహరించాలి అని తాత్పర్యం

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

# మా కృష్ణయ్య పుట్టిన దినమూ.. కిలకిల నవ్వెను జగమూ...


- డా॥ ఆకెళ్ళ సూర్యకనకదుర్గ,
81061 61190

శ్రావణబహుళాష్టమిని దేశంలోని అనేకప్రాంతాల్లో శ్రీకృష్ణాష్టమిగా జరుపుకుంటారు. శ్రీకృష్ణుడు జన్మించిన రోజు కనుక ఈ రోజును శ్రీకృష్ణాష్టమి అని, శ్రీకృష్ణుడు చిన్నతనంలో గోకులంలో పెరిగాడు కనుక గోకులాష్టమి అని, ఆయన జన్మించిన రోజు కనుక జన్మాష్టమి అని పిలుస్తారు. ఈ వేడుకను దేశంలోని వివిధప్రాంతాల్లో ఒక్కోరీతిలో సంప్రదాయంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకుంటుంటారు.

కృష్ణాష్టమిరోజున ప్రతి ఇంటా బాలకృష్ణుని చిన్న చిన్న పాదాలు లోగిళ్లలో వేసి శ్రీకృష్ణుడు ఇంట్లోకి రావాలని భక్తులు కోరుకుంటారు. ఇంటి ముఖద్వారాలకు పచ్చని మామిడాకు తోరణాలు, వివిధ పూవులతో తోరణాలు కడతారు. కృష్ణుడి విగ్రహాన్ని తడివస్త్రంతో శుభ్రంచేసి, చందనం, కుంకుమలతో తిలకం దిద్దుతారు. కృష్ణుని విగ్రహాన్ని, పూజామందిరాన్ని పూవులతో అలంకరిస్తారు. అక్షతలు, ధూపదీపాలతో స్వామివారిని పూజిస్తారు.

## కృష్ణాష్టమి పూజలు

పూజాదిక్రతువు పూర్తయిన తర్వాత శ్రీకృష్ణలీలా ఘట్టాలు చదవాలని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. కృష్ణాష్టమి నాడు కేవలం భగవానుణ్ణి పూజించడమే కాదు, అయనలోని మంచిలక్షణాలను కూడా అలవర్చుకోవాలి. కృష్ణాష్టమి రోజున కృష్ణుని అర్చిస్తే సకలపాపాలుపోతాయి. ధర్మార్థకామ మోక్ష ప్రాప్తి కలుగుతాయి. ఈ రోజున బంగారంతో కాని, వెండితో కాని చంద్రబింబాన్ని తయారుచేసి వెండి, బంగారు పాత్రలలో దాన్ని ఉంచి పూజించి అర్ఘ్యమిస్తే కోరికలు తీరుతాయి. ఈ రోజున భీష్మాచార్యుడిని పూజించే సంప్రదాయం కూడా కొన్ని ప్రాంతాల్లో ఉంది. సంతానం లేని వారు బాలకృష్ణుడిని సంతాన గోపాలమంత్రంతో పూజిస్తే సంతానం కలుగుతుంది.



అదేవిధంగా వివాహం కానివారు, వివాహ ప్రయత్నాలు చేస్తున్న వారు రుక్మిణీకల్యాణఘట్టాన్ని పారాయణం చేయడం వల్ల వారికి వివాహయోగం కలుగుతుంది. శ్రీకృష్ణుడిని స్మరిస్తూ గోవులను దానం చేస్తే ఆ భగవానుడి అనుగ్రహం, కృప కలుగుతాయి.

## దేశమంతా సంబరాలు

శ్రీకృష్ణుడు వెన్నకోసం ఉట్టిలోని కుండలను పగల గొట్టిన ఇతివృత్తానికి ప్రతీకగా శ్రీకృష్ణాష్టమి నాడు భక్తులంతా ఒకచోటికి చేరి ఉట్టికొట్టడం సంప్రదాయం. ఈ ఉట్టి కొట్టే వేడుకను భక్తులు

ఎంతో సంబరంగా జరుపుకుంటారు. మథుర, బృందావనం ప్రాంతాలు కృష్ణుడి జన్మస్థలం కాబట్టి అక్కడ వేడుకలు ఎంతో వైభవంగా జరుగుతాయి. అక్కడి కృష్ణాలయాలను ప్రత్యేకంగా అలంకరిస్తారు. జన్మాష్టమి రాత్రి "రాసలీలా" ప్రదర్శన ఉంటుంది. కృష్ణుడి రాజ్యస్థానం ద్వారకలో "జులన్ ఉత్సవ్" జరుపుతారు. ఇది చాలాప్రసిద్ధిపొందిన ఉత్సవం. దేవాలయాల్లో ప్రత్యేకపూజలు, అలంకారాలు ఉంటాయి. ముంబై వంటి ప్రాంతాల్లో 'దాహిహాండీ' అనే పోటీలతో వేడుకలు ఘనంగా జరుగుతాయి. గోపాలకులు మకరందం (ముఖ్యంగా మజ్జిగతో నిండిన మట్టికుండ) కుండను పగులగొడతారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణప్రాంతాల్లో శ్రీకృష్ణుని రూపాలను పూజిస్తారు. గ్రామాల్లో కోలాటం, పేరంటాలు జరుపుతారు. తమిళనాడులో కృష్ణుడి పాదాలగుర్తులు ఇంట్లో ప్రవేశద్వారంనుండి పూజాగదివరకు వేస్తారు. నైవేద్యంగా వెన్న ప్రసాదం ఉంటుంది. కర్ణాటకలో శ్రీకృష్ణుడి బాల్యక్రీడలను ప్రదర్శించే నాటికలు, ప్రత్యేకపూజలు ఉంటాయి.

పశ్చిమబెంగాల్, ఒడిశాప్రాంతాల్లో శ్రీకృష్ణాష్టమి ప్రధానంగా "నందోత్సవ్"గా జరుపుకుంటారు. ఆలయాల్లో ఆచారాలు, భజనలు ప్రధానంగా ఉంటాయి. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ ప్రాంతాల్లోని పెద్ద ఆలయాలలో ఘనంగా పూజలు చేసి, జన్మాష్టమి రాత్రి వేళ కృష్ణుడి జననఘట్టం "అభిషేకం"తో జరుపుకుంటారు. ఈ విధంగా, శ్రీకృష్ణాష్టమి భారతదేశం మొత్తం భిన్నభిన్న సంస్కృతులు, సంప్రదాయాలతో ప్రత్యేకంగా, ఆహ్లాదకరంగా జరుపుకుంటారు.

### విదేశాల్లో కృష్ణాష్టమి వేడుకలు

శ్రీకృష్ణుడి ఆరాధన ప్రాచీనకాలంలోనే విదేశాలకు పాకింది. ఎనిమిదోశతాబ్దంలోనే ప్రాచీనగ్రీకులు శ్రీకృష్ణుడిని వాసుదేవుడిగా, దేవాదిదేవుడిగా కొలిచేవారు. గ్రీకు రాయబారి హిలియోడారస్ 113 సంవత్సరంలో మధ్యప్రదేశ్‌లోని విదిశానగరంలో ఒక గరుడస్తంభాన్ని నాటించాడు. ఈ రాతిస్తంభంపై బ్రహ్మీలిపిలో 'వాసుదేవుడు దేవాదిదేవుడు', ఆయన అడుగుజాడలైన ఆత్మనిగ్రహం, జ్ఞానం, దానం అనుసరించడం వల్ల స్వర్గాన్ని చేరుకోవచ్చు' అని రాసి ఉంది. బ్రిటిష్ పాలనలో ఒకటిగా ఉండి తర్వాత విడిపోయిన మన పొరుగుదేశాల్లో శ్రీకృష్ణాలయాలు ఉన్నాయి.



### ఖండాంతరాల్లో కృష్ణాలయాలు

మన పొరుగుదేశాల్లోనే కాకుండా, ఆసియా, యూరోప్, అమెరికా, ఆస్ట్రేలియాల్లో శ్రీకృష్ణాలయాలు ఉన్నాయి. మలేసియాలోని కౌలాలంపూర్‌లో కుయిల్ శ్రీకృష్ణాలయం, పెనాంగ్‌లో శ్రీకృష్ణాలయం, రాధాకృష్ణాలయం సహా పలు కృష్ణాలయాలు ఉన్నాయి. సింగపూర్‌లో 1870 నాటి శ్రీకృష్ణాలయం ఉంది. దీన్ని సింగపూర్ ప్రభుత్వం జాతీయసాంస్కృతికవారసత్వనిర్మాణంగా గుర్తించింది. మయాన్మార్లో రాధా మండలేశ్వరాలయం ప్రసిద్ధి పొందింది. థాయ్‌లాండ్‌లో ఏడోశతాబ్ది నాటికే వైష్ణవారాధన ఉండేది. థాయ్‌లాండ్‌లోని శ్రీథేప్‌లో పదమూడో శతాబ్దినాటి వైష్ణవాలయంలో గోవర్ధనగిరి పైకెత్తిన శ్రీకృష్ణుడి విగ్రహం కనిపిస్తుంది. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో రాధాశ్యామ సుందర ఆలయముంది. ట్రినిడాడ్ అండ్ టొబాగోలో సెయింట్ మాడలిన్ నగరంలో శ్రీకృష్ణమందిరం ఉంది.

ఈవిధంగా కృష్ణాష్టమి వేడుకలు, శ్రీకృష్ణుడి ఆరాధన విశ్వవ్యాపితంగా నేటికీ అఖండంగా జరుగుతూనే ఉన్నాయి. విశ్వమంతా వెన్నదొంగకు విశేషార్చనలు జరుపుతూనే ఉంది.

# ప్రకృతి ఒడిలో కొలువైన 'శ్రీకుక్కె సుబ్రహ్మణ్యం'

- కుమారి ఆర్. జయశ్రీ కాశీకర్, 90140 45853

కుక్కెపట్టణం కర్ణాటకరాష్ట్రంలోని ఏడు అత్యంత ప్రముఖ యాత్రాస్థలాలలో ఒకటి. దక్షిణ కన్నడజిల్లాలోని ఈ క్షేత్రం కుమార, శేషపర్వతాల మధ్యనుంది. ప్రకృతిమాత ఒడిలో సౌందర్యసిరులమధ్య శోభాయమానంగా చూపరులను ఇట్టే ఆకర్షిస్తుంది. ఈ క్షేత్రం పౌరాణికమహత్తును కూడా సంతరించుకోవటం విశేషం. ఇందుకు కారణం ఇచ్చట వెలసిన శ్రీ కుక్కె సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం. సుబ్రహ్మణ్యస్వామికి కుమారస్వామి, షణ్ముఖుడు, కార్తికేయుడు అన్న పేర్లు కూడా ఉన్నాయి.

తారక, శూర, పద్మాసుర ఇత్యాది రాక్షసులచే పీడింపబడ్డ జనులను రక్షించడంకోసం కుమారపర్వత అధిపతియైన కుమారస్వామి ఆ రాక్షసులను సంహరించాడు. తన ఆయుధాలను ఈ క్షేత్రంలోనే ప్రవహించే నదిలో శుభ్రపరచాడు. ఆ కారణంగానే ఈ నదికి ధారాతీర్థమన్న పేరొచ్చింది. సుబ్రహ్మణ్యస్వామి చేసిన ఈ మహత్కార్యానికి మెచ్చి మహేంద్రుడు తన కుమార్తె దేవసేనతో అతని వివాహం గావించాడు. అంతేకాక కుమారధారతీర్థంలో "స్వామి కార్తిక" అన్న పేరుతో ఒక పట్టణం కూడా నిర్మించాడు. కుమారస్వామి, దేవసేనల వివాహం మార్గశిర శుద్ధ షష్టిరోజున జరిగింది. కనుక, ప్రతి సంవత్సరం మార్గశిరశుద్ధషష్టిరోజున రథోత్సవం, విశేషపూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఒకసారి పరమశత్రువులైన వాసుకి (సర్పం), గరుడునికి మధ్య ఘోరయుద్ధం జరిగింది. కశ్యపమహర్షి వాసుకిని రక్షించాడు. "కుక్కె" ప్రదేశంలో వాసుకి శివుని గూర్చి తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చి శివుడు అతణ్ణి సుబ్రహ్మణ్యునిలోయందు ఐక్యమై భక్తులప్రార్థనలను, కోరికలను తీర్చాల్సిందిగా ఆనతిచ్చాడు.

శ్రీఆదిశంకరులు ఈ క్షేత్రాన్ని దర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా ఈ క్షేత్రం మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది.

ఈ క్షేత్రంలో శ్రీసుబ్రహ్మణ్యదేవాలయంతోపాటు శ్రీలక్ష్మీనరసింహస్వామి, ఉమామహేశ్వర ఆలయాలను కూడా దర్శించవచ్చు. కుక్కె సుబ్రహ్మణ్య క్షేత్రం మనదేశంలోని 108 శైవక్షేత్రాలలో ఒకటి. ఉత్తరభారతదేశంనుండి కూడా వేల సంఖ్యలో భక్తులు ఇక్కడకు వచ్చి సర్పసంస్కారం చేయిస్తుంటారు. ఈ క్షేత్రానికి "సర్పాలయ"మన్న పేరు కూడా ఉంది. సర్పదోషనివృత్తి పూజలు చేయించుకునే భక్తుల సంఖ్య అధికంగా ఉంటుంది. ఈ పూజలు చేయించుకునే వారు ఇక్కడ రెండు రోజులు ఉంటే మంచిది. తమ భూమిలో పంటలు బాగా పండాలని కోరుకునే వారు, ఆరోగ్యం, సంపద కోరుకునే వారు ఈ స్వామిని కొలిచి వేడుకుంటారు.

ఈ క్షేత్రంలో ప్రవహించే కుమారధార నదిలో స్నానమాచరించి, పొర్లుదండాలు పెట్టి స్వామిని పూజిస్తే అన్ని రకాల చర్మవ్యాధులు నయమవుతాయని భక్తుల విశ్వాసం.

ఈ క్షేత్రం మంగళూరుకు 105 కిలోమీటర్ల దూరంలో సుళ్య తాలూకాలో ఉంది.



# శ్రీవేంకటేశ్వరలీలలు



# లవంగాల వైద్యం


- శ్రీ ఆర్.సి.కృష్ణస్వామి రాజు, 93936 62821

అది బ్రహ్మోత్సవాలసమయం. స్వామివారిదర్శనం చేసుకుందామని అలిపిరిగుండా కాలినడకన కొండకు బయలు దేరాను. పచ్చటిచెట్లను చూస్తూ, శేషాచలం అందాలను ఆస్వాదిస్తూ నడుస్తున్నాను. దారిలో తలయేరుగుండు వచ్చింది. మోకాళ్లనొప్పులు, తలనొప్పుల ఉపశమనానికి భక్తులు చాలా మంది ఆ తలయేరుగుండుకు నమస్కరిస్తూ ఉన్నారు.

నేనూ వెళ్లి తలయేరుగుండుకు నమస్కరించి ఓ చెట్టు కింద కూర్చున్నాను. ఒక్కసారిగా ఎడమకింది దవడ పన్ను దగ్గర 'జువ్వు జువ్వు' మని లాగ సాగింది. 'కొద్దిసేపటికి బాగై పోతుందిలే' అని నన్ను నేను సముదాయించుకున్నాను. గోవింద నామస్మరణలు చేస్తూ ఎలాగోలా కొండకు చేరుకున్నాను.

పంటినొప్పికి తట్టుకోలేక, క్యూలో గంటల కొద్దీ నిలబడే ఓపికలేక స్వామిదర్శనం లేకుండానే వెనక్కి వెళ్లిపోవాలని అనుకున్నాను. బేడి ఆంజనేయస్వామిగుడి దగ్గర నిలబడి ఏడుకొండలస్వామికి క్షమాపణలు చెప్పి బస్టాండు వైపు నడవ బోయాను. నొప్పి మరింత ఎక్కువై అక్కడే మెట్ల మీద కూర్చోవాల్సి వచ్చింది.

పక్కనే ఒక కేరళ యువకుడు కూర్చుని ఉన్నాడు. నేను పడుతున్న పంటి నొప్పి విషయం గమనించినట్లున్నాడు. చిన్నగా నాదగ్గరికు వచ్చాడు. తను కేరళ రాష్ట్రం కొట్టాయం నుంచి వచ్చానని తనను తాను పరిచయం చేసుకున్నాడు.



తను ఆయుర్వేదవైద్యుడినని, తనకు లవంగాలతోట కూడా ఉందని, ఈసారి తోట ద్వారా మంచి లాభాలు వచ్చాయని చెప్పాడు. తనతో పాటు తెచ్చిన పెద్దసంచిలో స్వామివారికి సమర్పించడానికి తెచ్చిన లవంగాల మూట చూపించాడు.

ఆ పెద్దసంచిలోనే తనతో పాటు ఎప్పుడూ తీసుకెళ్లే మెడికల్ కిట్ కూడా ఉంది. పంటినొప్పికి లవంగాలు బాగా పనిచేస్తాయని చెప్పి ఆ కిట్‌లోని నాలుగులవంగాలు ఇచ్చాడు. అలాగే తన సంచిలోని లవంగం నూనె బాటిల్ చిన్నది, దూది చేతికి తీసుకున్నాడు. లవంగంనూనె అద్దిన దూదిని నాకిచ్చాడు.

దాన్నితీసుకుని పంటినొప్పి ఉన్న ప్రదేశంలో పెట్టాను. కొద్దికొద్దిగా నొప్పి తగ్గుముఖం పట్టింది. బాగా గాలి పీల్చి, గాలి వదిలి స్వామి వారి మహాద్వారం వైపు చూస్తూ చిన్నగా లేచి నిలబడ్డాను.

కేరళయువకుడికి ధన్యవాదాలు చెబుదామని పక్కకు తిరిగాను. ఆ యువకుడు కనిపించలేదు. ఎప్పుడో... జనంలో కలిసిపోయినట్లు ఉన్నాడు. లవంగాలు నోటిలో పెట్టుకుని వడి వడిగా వెళ్లి క్యూలో నిలబడ్డాను. మూడు గంటల వ్యవధిలోనే స్వామివారిదర్శనం పూర్తయ్యింది. మాయమైన పంటినొప్పి పళ్లతోనే ఉచిత లడ్డు తింటూ గుడి బయటకు వచ్చాను.


పూర్వం సౌరాష్ట్రదేశంలోని దేవనగరం రాజధానిగా సోమకాంతుడు అనే మహారాజు పరిపాలించేవాడు. ఆయన భార్య సుధర్మ, గొప్ప ఇల్లాలు. ఆయన కుమారుడు హేమకంఠుడు. తండ్రికి తగ్గ తనయుడు. కాంతి విషయంలో సోముణ్ణి జయించడం వల్ల అతడికి సోమకాంతుడనే పేరు వచ్చింది. అంతటి రూపవంతుడైన మహారాజుకు చిత్రంగా అతిదారుణమైన కుష్టువ్యాధి వచ్చింది. శరీరమంతా గాయాలు స్రవిస్తున్న రక్తంతో, చీముతో వికారంగా తయారయ్యాడు. రాజ్యాన్ని కుమారునికి అప్పజెప్పి తాను వానప్రస్థం చేయాలని నిశ్చయించుకున్నాడు. తన ఐదుగురు మంత్రుల్ని పిలిచి తన అభిప్రాయాన్ని చెప్పాడు. వాళ్లందరూ రాజు అడవులకు వెళ్లడానికి ససేమిరా ఒప్పుకోలేదు. రాజు వాళ్లను ఒప్పించి హేమకంఠుడికి యువరాజ పట్టాభిషేకం చేశాడు.

బాలనీతి

# పురాణాలను గౌరవించాలి!!

**– శ్రీమతి నల్లాని రాజేశ్వరి, 99086 02443**

హేమకంఠుడు కూడా తల్లిదండ్రుల సేవకు మించిన గొప్ప పనిలేదని, తనకు రాజ్యం వద్దని, తాను అడవులకు వస్తానని ప్రాధేయపడ్డాడు. అయినా మహారాజు వినలేదు. తాము అడవులకు వెళుతున్న కారణం చెప్పి, కొడుకును ఒప్పించాడు.



సోమకాంతుడు అనేక రాజనీతివిషయాలు, వ్యక్తిగతధర్మాలు కొడుక్కు బోధించాడు. ఆ తర్వాత సుబలుడు, జ్ఞానగమ్యుడు అనే ఇద్దరు మంత్రులతోనూ, భార్యతోను అరణ్యాలకు వెళ్లాడు. మధ్యమార్గంలో బాగా అలసిపోయి ఒక చక్కని సరోవరం దగ్గరకు చేరారు. మంత్రులు “రాజదంపతుల ఆహారం కోసం ఫలసేకరణకు వెళ్లారు. ఇంతలో ఒక మునికుమారుడు ఆ సరోవరంలో నీరు తీసుకుపోవడానికి వచ్చి, వాళ్లను చూచాడు. మహారాజు ఆ బాలుని చూడగానే ఆకర్షితుడై అతనెవరని ప్రశ్నించాడు. ఆ ఋషిబాలుడు మీరెవరని ఎదురుప్రశ్న వేశాడు. సోమకాంతుడు తన దురదృష్టగాథనంతా వివరించాడు. ఆ ఋషిబాలకుడు తాను భృగుమహర్షి పులోమ దంపతుల పుత్రుడనని, తన పేరు చ్యవనుడని పరిచయం చేసుకున్నాడు.

చ్యవనుడు ఆశ్రమం చేరుకున్నాడు. తండ్రి అతని ఆలస్యానికి కారణమడిగాడు. చ్యవనుడు జరిగినదంతా చెప్పాడు. భృగుమహర్షి, ఆ రాజదంపతుల్ని తమ ఆశ్రమానికి తీసుకురమ్మని కొడుకుని ఆజ్ఞాపించాడు. చ్యవనుడు తీసుకువచ్చాడు. భృగుమహర్షి ఆశ్రమంలో సింహాలు, పులులు వంటి క్రూరజంతువులు, జింకలు, లేళ్లు వంటి సాధు జంతువులతో సహజవైరాలు మరచి సఖ్యతతో తిరగడం ఆ రాజ దంపతులు చూచారు. ఆ ప్రశాంత వాతావరణంలోకి అడుగుపెట్టగానే రాజుకు ఉపశమనం లభించింది.

అతను భృగుమహర్షికి తన దీనగాథ చెప్పుకున్నాడు. ఆ మహర్షి తన దివ్యదృష్టితో సోమకాంతుని పూర్వజన్మను దర్శించి "నీవు క్రిందటి జన్మలో ఘోరమైన పాపాలు చేశావు' అని చెప్పాడు.

గత జన్మలో దుమకాంతుడు ఒక వర్తకుడికి జన్మించాడు. అతని పేరు కామందుడు. అతని భార్య పేరు కుటుంబిని. కామందుడు తల్లిదండ్రులు మరణించిన తర్వాత విశృంఖలజీవితానికి అలవాటుపడ్డాడు. దుష్టులతో స్నేహం చేసి, ఉన్నదంతా ఊడ్చి పెట్టేశాడు. భార్యాబిడ్డలకు నిలువనీడ కూడా లేకుండాచేశాడు. దాంతో కుటుంబిని గంపెడుమంది బిడ్డల్ని తీసుకుని పుట్టిల్లు చేరింది. కామందుడు అడిగేవాళ్లు లేరని మరింత రెచ్చిపోయాడు. ప్రజలు అతని ఆగడాలు భరించలేక రాజుకు చెబితే, ఆయన అతనికి దేశబహిష్కరణశిక్ష విధించాడు.

కామందుడు అరణ్యాలకు వెళ్లాడు. అక్కడ పొట్టకూటి కోసం దొంగతనాలు, దోపిడీలు, హత్యలు చేయసాగాడు. శ్రీమంతుడయ్యాడు. భార్యాబిడ్డల్ని తిరిగి తన దగ్గరకు పిలి పించుకున్నాడు.

ఒకరోజు గుణవర్ధనుడనే బ్రాహ్మణయువకుణ్ణి అతని దగ్గరున్న నగల కోసం బంధించాడు. అతడు కామందునికి జ్ఞానోపదేశం చేశాడు. ఈ పాపఫలాన్ని అనుభవించడానికి ఎన్నో జన్మలు ఎత్తాల్సివస్తుందని చెప్పాడు. అయినా కామందుడి మనసు కరుగలేదు. తాను కొత్తపెళ్లికొడుకునని గుణవర్ధనుడు ప్రాధేయపడినా చలించలేదు. అతణ్ణి చంపి, ఆభరణాలు కాజేశాడు.

కామందుడికి వృద్ధాప్యం వచ్చింది. శరీరాన్ని అనేకరోగాలు ఆశ్రమించాయి. రూపం మారింది. భార్యాబిడ్డలు, బంధువులు, మిత్రులు, సేవకులు అందరూ అతణ్ణి నిరాద రించడం ప్రారంభించారు. దీంతో అతనిలో పాపచింతన ప్రారంభమైంది. తాను సంపాదించినదంతా దానధర్మాలు చేసేయాలనుకున్నాడు.

ఊర్లో ఉన్న బ్రాహ్మణోత్తములను పిలిపించాడు. వాళ్లు అన్యాయంగా సంపాదించిన సొమ్మును దానంగా స్వీకరించలే మని చెప్పి వెళ్లిపోయారు. కామందుడు ఇక చేసేది లేక అనేకరకాలుగా ఆలోచన చేశాడు.

అడవిలోనే ఉన్న ఒక శిథిలాలయాన్ని చూచి, దాని బాగుచేయాలనుకున్నాడు. అలాగే చేశాడు. ఆలయం చాలా వైభవంగా ఉద్ధరింపబడింది. నాలుగుదిక్కుల్లో దిగుడుబావులు ఏర్పాటుచేశాడు. భగవద్ధ్యానంతో మరణించాడు.

యమభటులు అతణ్ణి యముణ్ణి ముందు నిలబెట్టారు. ఆయన "ఓయీ! నీవు జీవితమంతా పాపాలే చేశావు. గణపతి జీర్ణదేవాలయాన్ని పునరుద్ధరించి ఒకే ఒక మహాపుణ్యకార్యం చేశావు. కాబట్టి నీవు ముందు పాపఫలాన్ని అనుభవిస్తావా? పుణ్యఫలాన్ని అనుభవిస్తావా" అని అడిగాడు. కామందుడు "ముందుగా పుణ్యఫలాన్నే అనుభవిస్తా"నని చెప్పాడు.

ఆ పుణ్యఫలం వల్లనే మహారాజుగా జన్మను పొంది సోమకాంతుడుగా రాజ్యమేలాడని భృగువు అతనికి అతని పూర్వజన్మవృత్తాంతాన్ని తెలియజేశాడు.

సోమకాంతుడు ఆ మహర్షి పాదాలపై పడి శరణు వేడాడు. పాపకర్మల నుండి బయటపడడానికి గణేశపురాణం పఠించడమే పరిష్కారమని భృగువు చెప్పాడు.


తన కమండలంలోని జలాన్ని తీసుకుని గణేశుని అష్టోత్తరశతనామాల్ని పఠించి ఆ మంత్రజలాన్ని సోమ కాంతునిపై చల్లాడు. సోమకాంతునిలోని పాపపురుషుడు, భృగు మహర్షి ఆశ్రమం బయట ఉన్న ఎండిపోయిన మామిడిచెట్టు తొఱ్ఱలోకి వెళ్లిపోయాడు. ఆ చెట్టు భగ్గుమని మండి క్షణాల్లో బూడిదైపోయింది.


మహర్షి శుభముహూర్తంలో రాజదంపతులకు గణేశ పురాణాన్ని వినిపించాడు. సోమకాంతుడు తిరిగి సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాడు. కనుక మన పురాణాల్ని మనం తేలికగా తీసుకోగూడదు. హేళనచేయకూడదు. ఈ భౌతికప్రపంచంలో మనం చేసే మంచిచెడులు వెంటనే కంటికి కన్పించకపోయినా, అవి లెక్కలోకి వస్తూనే ఉంటాయి. కనుక మనం అష్టాదశ పురాణాల్ని పఠించాలి. అందులోని మార్గదర్శకసూత్రాల్ని మన జీవితాలకు అన్వయింపచేసుకోవాలి.

ఈ వినాయకచవితి పండుగరోజు నుండి అయినా గణేశపురాణ పఠనం ప్రారంభించండి! ఆ స్వామి ఆశీస్సులు పొందండి!!

# చిత్ర కథ మొదటి నమస్కారం చేయకపోతే..

కథ–'కళారత్న' డా॥కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు– శ్రీ తుంబలి శివాజీ





దూరంలో గణపతి ఒక బ్రహ్మచారి రూపంలో కనిపించాడు.
నాయనా! నాకు ఒక ఉపకారం చేస్తావా? సూర్యాస్తమయం గావస్తుంది. సంధ్యా వందనం ముగించుకుని వస్తాను. అంత వరకు ఈ జ్యోతిర్లింగాన్ని పట్టుకొని ఉండు.
ఈ భాగ్యానికి నేనెందుకు? ఆ గట్టు మీద పెట్టి వార్చుకోవయ్యా!
కుదరదు నాయనా! అన్యథా చేస్తే దక్కదు. చేతిలోనే పట్టుకోవాలి.
సరే ఇవ్వు.. అమ్మో!ఈ లింగం ఇంత బరువు ఉందే?
అయ్యా! నేను మోయగలిగినంత మోస్తాను. మోయలేనప్పుడు మూడుసార్లు పిలుస్తాను. వెంటనే రాకపోతే ఆ తర్వాత ఈ లింగానికి నేను బాధ్యుణ్ణి కాను.
పిలవగానే వస్తాను...
రావణా! ఓ రావణా!
ఇదిగో మూడో సారి పిలుస్తున్నా... రా..వ..ణా..!
శివలింగాన్ని నేలపై పెట్టాడు.
బాలకా! నువ్వు నా పాలిట విఘ్నేశ్వరుడవయ్యావే! ఆత్మలింగాన్ని భూమ్మీద పెట్టావే..!
రావణా! గణపతికి మొదట పూజ చేయకపోవడం వలన ఇదంతా జరిగింది. దైవం నీకు ప్రతికూలించింది. చేయగలిగిందేమీ లేదు. లంకానగరం చేరు..
రావణా! అమేయభక్తితో నన్ను మెప్పించి ఆత్మలింగాన్ని పొందిన నీ చరిత్ర అమరం. నేటి నుంచి ఈ గోకర్ణ క్షేత్రం భూకైలాసంగా ప్రసిద్ధి చెందుతుంది. ఇక్కడకు వచ్చిన భక్తులు మొదట విఘ్నేశ్వరుని పూజిస్తారు.
లోకాస్సమస్తా స్సుఖినో భవంతు!
2

ఆయుర్వేదం

# ఉండ్రాళ్లు - మోదకాలు


- డా॥ జి.వి.పూర్ణచందు, 94401 72642

వినాయకచవితి రోజున సూర్యోదయానికి ముందు తూర్పున ఎలుక ఆకారం, దానిమీద ఏనుగు ఆకారం గల నక్షత్రాల గుంపు ఉదయిస్తుందని, సూర్యోదయానికి ముందు ఏ నక్షత్రం ఉదయిస్తుందో ఆ నక్షత్రానికి సంబంధించిన దైవాన్ని పూజించాలి కాబట్టి, భాద్రపదశుద్ధచవితినాడు వినాయకచవితి జరుపుతున్నారు.

ఒక్కో దేవుడికి ఒక్కో పూజావిధానం ఉన్నట్టే ఒక్కోవిధమైన నైవేద్యం కూడా ఉంటుంది. వినాయకుడికి కుడుములు, ఉండ్రాళ్లు లేదా మోదకాలు ఇష్టమైనవిగా భావించి నైవేద్యం పెడ్తుంటాం.

పరమేశ్వరుడి మెడలో కపాలాల్ని చూసి ఉండ్రాళ్లు అనుకుని తొండంతో లాగుతున్న బాలవినాయకుడు తనను రక్షించాలని కూచిమంచి తిమ్మకవి వినాయకస్తుతి చేశాడు. బ్రహ్మదేవుడు చేసిన ఒక చిన్నతప్పువల్ల ఆయన ఐదో ముఖం ఊడిపోయి, శివుని చేతిలో కపాలంగా చేరిందని అదే శివుడి భిక్షాపాత్రగా మారిందనీ, ఈ కపాలం శిలామయశివలింగ రూపంగా వెలిసిన క్షేత్రమే బ్రహ్మ కపాలం అయ్యిందనీ చెప్తారు. చనిపోయిన వారి కపాలాలను శివుడు మెడలో ధరిస్తాడని ఒక నమ్మకం. మరణించినా శివుడి మెడలో మాలగా ఉండటమే కపాలం రహస్యం అంటారు పెద్దలు.

తిరుమల రామచంద్ర గుండ్రంగా ఉండేవి ఉండ్రాళ్లని, కొంచెం పొడవుగా ఉండేవి మోదకాలని భావించారు. మోదకాల కోసం 'అచ్చు'లు కూడా బజార్లో దొరుకుతాయి. బియ్యప్పిండి ముద్దని ఈ అచ్చులో నింపి, వేలితో గుంటలా చేసి, అందులో తీపిలౌజు కూరిన మోదకాలను ఆవిరిమీద ఉడికిస్తారు. మోదాన్ని అంటే సంతోషాన్నిస్తాయని ఇలా పిలిచి ఉంటారు. తెలుగువాళ్లలో చాలామంది ఉండ్రాళ్లని కూడా జిల్లేడు కాయల పేరుతో అదే ఆకారంలో లోపల తీపిలౌజు పెట్టి తయారు చేస్తుంటారు ఈనాటికీ!



చరకసంహిత సూత్ర స్థానం (159) ప్రకారం కంది, మినప, పెసరలాంటి పప్పుదినుసుల పిండిని గానీ వరి, గోధుమ, యవలు (బార్లీ) లాంటి ధాన్యాలపిండిని ఉండ్రాళ్లుగా చేసి ఆవిరిమీద ఉడికిస్తే వాటి గుణాలలో మార్పు ఉండదని దీని భావం.

ప్రెషర్‌కుక్కర్లో వండటం కూడా ఆవిరిమీద ఉడికించటమే కదా అని మీరడగవచ్చు. నేరుగా ఆవిరి మీద ఉడకటం వలన చరకుడు చెప్పిన గుణధర్మాలు ఏవీ మారవు కానీ, గట్టిగా మూత బిగించి లోపల ఆవిరితో వత్తిడి కలిగించి అధిక ఉష్ణోగ్రత మీద వండితే ఆ వండిన పదార్థపు గుణధర్మాలు హానికరంగా మారిపోయే ప్రమాదం ఉంది. అధిక ఉష్ణోగ్రతతో వండితే అందులో 'ఏక్రిలమైడ్' అనే విషపూరిత రసాయనం పుడుతుంది. అదే క్యాన్సర్ లాంటి వ్యాధులకు కారణం అవుతుంది. ఒక గిన్నెలో నీళ్లు పోసి ఆ గిన్నె మూతికి ఒక గుడ్డకట్టి ఆ గుడ్డ మీద ఉండ్రాళ్లు ఉంచి మూతపెట్టి, తగినంత వేడిమీద వండితే ఆ ఉండ్రాళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. రుచికరం, పుష్టికరం. ఆకలి తీరుతుంది. జీర్ణశక్తి ననుసరించి తింటే మేలు చేస్తాయి. అజీర్తిగా ఉన్నవాళ్లు అతిగా తింటే కఫాన్ని వాతాన్ని పెంచుతాయి. బియ్యపురవ్వ, జీలకర్ర కలిపి ఉండ్రాళ్లు చేసుకోవటం, పుదీనా పచ్చడి నంజుకుని తినటం, నెయ్యి వేసుకుని, బెల్లం ముక్క కొరుక్కుంటూ తినటం, లేదా బెల్లపు లౌజును లోపల ఉంచి చేసే జిల్లేడుకాయల్లాంటి మోదకాలను తినటం మంచిది. ఉప్పు లేకుండా చప్పిడిగా చిన్నచిన్న ఉండ్రాళ్లను చేసి, ఆవిరి మీద ఉడికించి పాలలో వేసి పాయసం కాస్తారు. ఇది ఒక విధమైన పాలతాలికల లాంటి వంటకం. వేడి తగ్గిస్తుంది. ఎసిడిటీతో బాధపడే వారికి మంచిది. చాలా బలకరమైంది.

తీవ్రమైన వేసవి తాకిడి తరువాత తొలకరి జల్లులు ప్రారంభమయ్యాక వినాయకచవితి వస్తుంది. కాలే పెనం మీద నీళ్లు పడితే ఒక్కసారిగా వేడి ఆవిర్లు వచ్చినట్టు మన శరీరంలో కూడా వేడి పెరిగే కాలం ఇది. ఈ సీజన్లో ఉండ్రాళ్ల లాంటివి చలవ నిస్తాయి. జీర్ణశక్తిని చంపే టిఫిన్లకన్నా ఇవి మేలు చేసేవిగా ఉంటాయి. ఆయా ఋతుధర్మాల ననుసరించి ఆహార అలవాట్లలో ఎలాంటి మార్పులు చేసుకోవాలో మన పండుగలు మనకు గుర్తు చేస్తుంటాయి. ఆరోగ్యస్పృహ ముఖ్యం కదా!

# క్విజ్ 37

01) దేవసేన ఎవరి కూతురు? జ)........................

02) సోమకాంతుని కొడుకు? జ)........................

03) గోకర్ణక్షేత్రాన్ని ఇలా అంటారు? జ)........................

04) జయవిజయులు ఎక్కడుంటారు? జ)........................

05) దితి, అదితిల భర్త? జ)........................

06) లక్ష్మి ఎక్కడ ఉండదు? జ)........................

07) కంసుని సోదరి? జ)........................

08) వేంకటాద్రికి వెళ్లి పాపాల్ని పోగొట్టుకున్నవాడు? జ)........................

09) వేదాలను అపహరించింది? జ)........................

10) హయగ్రీవుడి ద్వారా శక్తి ఉపాసనా రహస్యాలు తెలుసుకున్నవారు? జ)........................

11) అలర్క శాకమంటే? జ)........................

12) ధర్మరాజుకు శ్రీకృష్ణుడు చెప్పిన వ్రతం? జ)........................

13) గీతాంజలి ఎవరి రచన? జ)........................

14) మహాత్ముడికి పరమప్రాణమైన గ్రంథం? జ)........................

15) వేంగమాంబ దానపత్రాలకు నకళ్లు రాసినవారు? జ)........................

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-08-2025.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: ........................ వయస్సు: ............

పాఠశాల: ........................ తరగతి: ............

పేరు: ........................

చిరునామా: ........................

........................

........................

........................ పిన్‌కోడ్: ............

ఫోన్ సంఖ్య: ........................

### జవాబులు చేరాల్సిన చిరునామా

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.


## పిల్లలూ మీకు వినాయకుడి రూప రహస్యం తెలుసా?



*గణపతి రూపం మేనేజ్‌మెంట్ పాఠాలకు ఎలా ఉపయోగపడుతోందో చూడండి. గణనాథుడి అవతారంలో ఎన్నో మంచిగుణాలు దాగున్నాయి. వాటిని గుర్తించి ఆచరిస్తే ఏ రంగంలోనైనా విజయదుందుభి మోగించవచ్చు. అవేమిటో చూడండి...!!*


పెద్ద తల - పెద్దగా ఆలోచించు
చిన్న కళ్లు - ఏకాగ్రతను సాధించు
పెద్ద చెవులు - ఎక్కువగా విను
చిన్న నోరు - తక్కువ మాట్లాడు
పొడవైన తొండం - దీర్ఘకాల ప్రణాళికలు రచించు
ఏకదంతం - ఒకే లక్ష్యం కోసం పనిచేయి
పెద్ద బొజ్జ - ఎక్కువ సామర్థ్యాన్ని చూపించు
అభయహస్తం - అందరికీ స్నేహశీలివై, సహాయకారివై ఉండు
ఉండ్రాళ్లు - సామర్థ్యానికి తగ్గ ప్రతిఫలం ఆశించు
ఆయుధం - సమయస్ఫూర్తితో సమస్యలను ఎదుర్కో
ఎలుక వాహనం - కిందిస్థాయి వారితోనూ స్నేహంగా ఉండు

## చుక్కలు కలపండి! కన్నయ్యను ఇంటికి పిలవండి..



## రంగులు వేద్దాం..!!

క్రింది చిత్రాన్ని చూసి రంగులు వేయండి



# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి

**మేషం**– అలంకారయోగం, విలువైన వస్తువులు సంగ్రహించుట, బంధుమిత్ర సమాగమం, ధనం అధికంగా ఖర్చు చేయుట, వృత్తివ్యాపారాలలో స్తబ్దత ఉంటాయి.

**వృషభం**– తలపెట్టిన పనులు సకాలంలో పూర్తి అవుతాయి, ధైర్యంతో వ్యవహారజయం సాధిస్తారు. ఉద్యోగాలవిషయాలలో ముందంజ. అన్ని వృత్తులవారికి జీవనవృద్ధి, వ్యక్తిగతలాభం, జీవనస్థాయి పెరగడం, పుష్కలమైన ఆరోగ్యం కలుగుతుంది.

**మిథునం**– దూరప్రయాణాలు చేస్తారు. పుణ్యక్షేత్రాలతో సహా అనేకప్రదేశాలకు ప్రయాణిస్తారు. గంగ వంటి పవిత్రనదుల్లో స్నానం చేస్తారు. ఆర్థికంగా హెచ్చుతగ్గులకు గురౌతారు.

**కర్కాటకం**– ఈ మాసం ప్రథమార్ధంలో ఆరోగ్యసమస్యలు కలుగుతాయి. తండ్రితోనూ, బంధుమిత్రులతో అభిప్రాయభేదాలు ఉంటాయి. నిలకడ ఉండదు. ఆర్థికవిషయాలు సామాన్యంగా ఉంటాయి ద్వితీయార్ధంలో శుభయోగాలు.

**సింహం**– కొత్తపథకాలు రచిస్తారు. మరింత చురుకుగా ఉత్సాహంతో ఉంటారు, భౌతిక సంపదను వృద్ధిచేస్తారు. దస్తావేజులు మొదలైన రహస్యపత్రాల్ని అందుబాటులో ఉంచుకోవాల్సి వస్తుంది.

**కన్య**– ప్రయాణాలు కలసివస్తాయి. కుటుంబ సభ్యులతో సామరస్య సంబంధాలు అనుభవిస్తారు. పరిపూర్ణఆరోగ్యంతో ఆనందభరితమైన విలాసవంతమైన జీవితాన్ని గడుపుతారు.

**తుల**– శ్రమకు తగ్గ ఫలితం. జీవితాన్ని ఆనందిస్తారు. ఉద్యోగులకు ఆదాయం, పదోన్నతి లేదా కొంతఆదాయం పెరుగుదల.

**వృశ్చికం**– ఉపాసనాబలం పెరుగుతుంది, నమ్మకాలు, ఆధ్యాత్మికత మొదలైన విషయాలపై ఆసక్తి చూపుతారు. జ్ఞానపిపాస ఉంటుంది. అందరినీ ఉత్సాహపరచి ప్రోత్సాహం అందచేస్తారు.

**ధనుస్సు**– వృత్తిధర్మం, మంచిచర్యలు, నైతికత, ఉన్నతవిలువలు పాటించడం, ఆధ్యాత్మికతపై ఆసక్తి చూపుతారు. సంప్రదాయపరమైన వ్యక్తిగత విలువలకు కట్టుబడి ఉంటారు.

**మకరం**– ఉన్నతస్థితిని పొందగల అసాధారణమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నతస్థితిని పొందుతారు. వ్యాపార భాగస్వాములను గౌరవించాలి. వారిపై తేలిక, చులకన భావం మిమ్ములను దూరంచేస్తుంది.

**కుంభం**– జాగ్రత్తవహించి ప్రమాదాలు నిర్మూలించడం, సమాజం మరియు కుటుంబ భద్రతను పరిరక్షించడం, స్వస్థతకలగడం, ఆరోగ్యంవిషయంలో కూడా అప్రమత్తంగా ఉండటం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్య ఉండదు.

**మీనం**– సంతానంనుండి శుభవార్తలు వస్తాయి. ఆర్థికవృద్ధి ఉంటుంది. సృజనాత్మకంగా ఉండి అందరి మన్ననలు పొందుతారు. ఉద్యోగంలో పదోన్నతి లేదా ఆర్థికవృద్ధి కలగవచ్చు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-
జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :
(అ) చందానెంబరు :
(ఆ) భాష :


**6.** చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / ఎట్ పర్ చెక్ మాత్రమే :
........................................................ తేది :...................

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.
2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.
3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.
4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".
5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# శ్రీపదకేళి

115



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)శ్రావణపూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం స్త్రీలు చేసే వ్రతం(7); 5)యుద్ధం(3); 6)శ్రావణపూర్ణిమ నాడు జరిగే పండుగ(5); 7)దుఃఖం(2); 8)రంగు(2); 10)లక్ష్మణుని తల్లి(3); 11)శ్రావణకృష్ణఏకాదశి(3); 14)సముద్రము(3); 16)హనుమంతుడు తీసుకు వచ్చిన పర్వతం(4); 19)శ్రావణశుక్ల ఏకాదశి(3); 21)భాద్రపదశుద్ధచవితిరోజున వచ్చే పండుగ(7)

**నిలువు** 1)శ్రావణపూర్ణిమరోజున వచ్చే జయంతి(8); 2)దుర్యోధనుని కూతురు(3); 3)భాద్రపదశుద్ధ పంచమికి మరో పేరు(5); 4)మన్మథుడు(4); 6)శ్రీకృష్ణుని ప్రియురాలు(2); 7)శరము(2); 9)పార్వతి(4); 10)పుష్పం (2); 12)సర్పం(2); 13)ఈ నక్షత్రం పౌర్ణమి రోజున కలదు కనుక శ్రావణమాసం అన్నారు(3); 15)మరీచిభార్య(2); 17)సత్యవంతుని భార్య(3); 18)కంటికి పెట్టుకునేది(3); 20) సూర్యుడు(2)


జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.



Printed by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., and Published by Dr.V.G.Chokkalingam, M.A., Ph.D. on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.




శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి (శ్రీనివాసమంగాపురం) వారికి
30-06-2025 నుండి 02-07-2025 వరకు జరిగిన సాక్షాత్కారవైభవోత్సవ దృశ్యాలు




23-06-2025 నుండి తిరుమలలో కియోస్కయంత్రాల ద్వారా లడ్డూల విక్రయ ప్రారంభ దృశ్యాలు.
ఈ యంత్రాలు లడ్డూ పంపిణీ కౌంటర్లకు సమీపంలోనే ఏర్పాటయ్యాయి.




తి.తి.దే. ఆధ్వర్యంలో జరిగిన యోగాదినోత్సవ (21-06-2025) దృశ్యాలు.
ఈ కార్యక్రమంలో తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్.,
తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్.,
తి.తి.దే. పాలకమండలి సభ్యులు శ్రీమతి పనబాకలక్ష్మి, శ్రీ జి.భానుప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthnams
Printing on 25-07-2025 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under
RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT
No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 5th of Every Month.



వినాయకచవితి (27-08-2025)